ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ



సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి



సంపుటి 19 - సంచిక 11
ఏప్రిల్ 2015

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798


## సముద్ర మథనం వల్ల లభించే మూడు దివ్యమైన రత్నాలు

జీవితమనే సముద్ర మథనం ద్వారా మనకు మూడు రత్నములు లభించగలవు. అవి 1) ప్రేమ, 2) జ్ఞానం, 3) బాధలలో ఉన్న తోటి మానవులపట్ల అంతులేని దయ. ఈ మూడు మనకు ఎంత ఎక్కువగా లభిస్తే మనం అంత ఉన్నతంగా ఎదుగుతాము.

ఒంటరితనాన్ని, కఠినమైన పరిశ్రమ వల్ల కలిగే అలసటను, ఎగుడు దిగుడు ఆటుపోట్లతో నిండిన ఈ జీవితాన్ని ప్రేమతోనే సుసంపన్నం చేసుకొనగలం. సమస్త సుఖ సంతోషాలు ప్రేమ అనే ఒక్క కేంద్రంలోనే ఏకత్రితమౌతాయి. ప్రేమ అనే పులకరింపుతోనే ఆనందంతో కూడిన ఉల్లాసం కలుగుతుంది. ప్రేమించటం వల్ల మనం ఏదైనా కొంచెం పోగొట్టుకొనవలసివస్తే ఆ పోగొట్టుకునే దానికన్నా పొందేది లక్షల రెట్లు అధికంగా ఉంటుంది.

సత్యమనేది ఎంతో గొప్పది, మానవుడు క్రమంగా సత్యము యొక్క ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలి. ఇప్పటివరకూ తెలుసుకున్నది, తెలుసుకొనుచున్నది అద్భుతమైనవి, కానీ ఇంకా తెలుసుకొనవలసినవి ఎన్నో ఉన్నాయి. సత్యాన్ని తెలుసుకొనటం, వెదకటం, పొందటం అనే ప్రయత్నాల ద్వారా ఇప్పటివరకూ ఎన్నో రకాల ఉపలబ్ధులు మనకు లభించాయి. ఇదేవిధంగా మనస్సును లగ్నం చేసి అన్వేషిస్తే ఇప్పటివరకూ పొందలేక పోయినవాటిని కూడా పొందగలము.

ప్రపంచంలో సుఖం కొరవడిననూ మనుగడ సాగించగలం, కానీ కష్టాలతో మానవులు చిరకాలం మనుగడ సాగింపజాలరు. అజ్ఞానంలో పడికొట్టుకుంటూ పతన దిశగా సాగిపోవుట ఎంతో బాధాకరమైన విషయం. దీనిని అధిగమించుటకై తగిన జ్ఞానాన్ని ప్రయత్నంతో అందిపుచ్చుకోవాలి. కష్టాలలో ఉన్నవారి ఎడల కరుణ చూపించి, వారికి సేవ చేస్తూ మానవ జీవితాలలో ఆనందాన్ని నింపాలి. ఈ లక్ష్యసాధనకై ఆత్మ దివినుండి భువికి దిగివచ్చినది.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 1974*

**వానప్రస్తులారా! ప్రోగు చేయుట ఇకనైనా ఆపండి-వెదజల్లండి! నాటండి-కోసుకోండి!**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** సముద్ర మథనం వల్ల లభించే మూడు దివ్యమైన రత్నాలు 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** చెడు అలవాట్ల నుండి దూరంగా ఉండాలి 4
3. **వేదమంత్రం :** మానవ ధర్మం 5
4. **గాయత్రీ విద్య-52 :** గాయత్రి-ఆధ్యాత్మిక త్రివేణి 6
5. **అశ్వమేధం-2 :** యజ్ఞము - దేవ సంస్కృతి మేరుదండము 7
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 34 :** ఆశీస్సులు, వాగ్దానాలు 10
7. **శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 7 :** కటువైన మాటల వలన కలిగే మానసిక రుగ్మతలు 13
8. **కర్మకాండ ఎందుకు-ఎలా? - 1 :** కర్మకాండ ఎందుకు ఎలా 15
9. **జీవన సాధనకు బంగారు సూత్రములు-1 :** సావధానంగా ఉండండి 17
10. **మనం - మన ఆరోగ్యం :** స్వర్ణిమ ఆరోగ్య నియమాలు 19
11. **చేతనత్వ విజ్ఞానం-1 :** ఆలోచనల వ్యాపకత్వం, శక్తి 21
12. **అతీంద్రియ విజ్ఞానం-1 :** అతీంద్రియ శక్తుల పృష్ఠభూమి 23
13. **బోధ కథ :** శ్రమ యొక్క ఫలితం 25
14. **శంకర జయంతి ప్రత్యేకం :** వైదిక ధర్మరక్షణ కొరకు జీవితాన్ని ధారపోసిన శ్రీ ఆదిశంకరాచార్య 26
15. **వ్యక్తి నిర్మాణం :** సాధన చేస్తూ సాగిపోతే సాధించలేనిదేముంది? 30
16. **సర్వోత్తమ ఐశ్వర్యం (విభూతి) విద్య** 32
17. **జీవించే కళ :** జీవితం చాలా అమూల్యమైనది, దానిని అందముగా తీర్చిదిద్దుకోండి! 34
18. **ఆత్మసత్తాలో నిహితమైన విభూతుల రహస్యోద్ఘాటన** 36
19. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** లోకశిక్షకుల జీవనోద్దేశ్యం, లక్ష్యం - 4 39
20. **నా వారితో నా మాట :** ఇది పరివర్తన గురించి చాటి చెప్పే సంవత్సరం 43
21. **యుగ నిర్మాణ చిత్రావళి-1:** పరశురాముని ద్వారా అత్యాచారాల శిరచ్ఛేదన (నిర్మూలన) 46
22. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 11** 48
23. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 50




## సద్గురు వాణి

### చెడు అలవాట్ల నుండి దూరంగా ఉండాలి

చెడు అలవాట్లు ఇతరుల నుండి నేర్చుకోవడం వల్లనో లేదా అలాంటి వాతావరణంలో ఉండటం వల్లనో క్రియాన్వితమవుతాయి. మనస్సు కూడా నీటివలె నిమ్నంవైపు (పల్లానికి) పయనిస్తుంది. ఈ రోజులలో మానవ ప్రకృతి అవాంఛనీయ పక్షం వైపు వెళ్తున్నది. వివేకమున్నవారు సైతం ఇతరులను స్నేహితులుగా చేసుకునేందుకు చెడు అలవాట్లను ఆశ్రయిస్తుంటారు. ఈ విధంగా మనిషి చెడు అలవాట్లకు బానిస అవుతాడు. చెడు అలవాట్లు ఉన్న వ్యక్తి హేయమైన జీవనాన్ని జీవిస్తూ దుష్ప్రవృత్తుల దుష్పరిమాణాన్ని చవిచూస్తాడు. అందు వలన చెడు అలవాట్లనుండి దూరంగా ఉండాలి.

*- అనువాదం: ముక్కామల రత్నాకర్*



**డా॥ ప్రణవ్ పండ్యా**

*పూజ్యులు, పరమ శ్రద్ధేయ డా॥ ప్రణవ్ పండ్యా, అఖిల విశ్వగాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు మరియు దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ కులపతి హైదరాబాద్ నగరానికి 11 ఏప్రిల్ 2015 శనివారం విచ్చేయుచున్నారు.*

*ఈ శుభ సందర్భంగా డా॥ ప్రణవ్ పండ్యాగారి ప్రవచనంతోపాటు పరివారానికి ఆశీస్సులు అందించెదరు. కావున యావన్మంది గాయత్రీ పరివార్ పరిజనులు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసికొనవలసిందిగా కోరద మైనది. మీ రాకను తెలియజేస్తూ గాయత్రీ చేతనా కేంద్రానికి తెలియజేయప్రార్థన.*

ఇట్లు
**అశ్విని సుబ్బారావు**
*సంయోజకులు-గాయత్రీ పరివార్*
*ఎ.పి. & తెలంగాణ*

**నీ బుద్ధిని భగవంతుని పొలంలో నాటు అది అసాధారణ ప్రతిభగా వికసిస్తుంది**

వేదమంత్రం

# మానవ ధర్మం

**యత్ర బ్రహ్మ చ క్షత్రం చ సమూచౌ చరతః సహ ।**
**తల్లోకం పుణ్యం ప్రజ్ఞేయం యత్ర దేవాః సహాగ్నినా ॥**
***(యజుర్వేదం 20/25)***

**భావార్థం:** శాస్త్రాల ద్వారా సత్కర్మలను జాగృతం చేయుట, శస్త్రముల ద్వారా దుష్టుల సంహరించుట రెండూ అవసరమే. జ్ఞానం, కర్మల సంయోగం ద్వారా సర్వాంగపూర్ణ ఆధ్యాత్మిక జీవనం లభిస్తుంది. బ్రాహ్మణ వర్ణం యొక్క జ్ఞానం, క్షత్రియ వర్ణం యొక్క తేజస్సు ఎక్కడ కలసిమెలసి పనిచేస్తాయో, ఆ సమాజం ఎల్లప్పుడూ పుష్పిస్తుంది ఫలిస్తుంది.

**సందేశం:** ఆయా సమయాలలో అవసరార్థం పృథ్విపై అవతరిస్తానని గీతలో భగవానుడు ఇలా అన్నాడు. 'పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతాం'. ఆయన లక్ష్యం ప్రపంచంలో సత్కర్మల చేసేవారిని, సాధు వ్యక్తులను రక్షించుట, దుష్టులు, దురాచారులు, పాపులను సంహరించుట. నచ్చచెప్పిన విననిచో, సామదానభేద దండోపాయాలతో వారిని సంస్కరించుట కూడనిచో సంహరించుట ధర్మమే. 'నిశిచర హీన కరౌమహి యే' ప్రపంచాన్ని సుఖంగా ఉంచే మూల మంత్రము. దీనితోనే రామరాజ్య స్థాపన జరిగింది.

పరమాత్మునికి ధనుస్సు-బాణాలు ధరించి, వేణువు ఊదుతూ అవతరించి, భూమి నుండి పాపులను, రాక్షసులను తొలగించవలసిన ఆవశ్యకత ఏమీ లేదు. ఆయన సర్వవేళలా, సర్వావస్థలయందు విశ్వమంతటా నిండి ఉన్నాడు. మన శరీరంలోని రోమరోమంలో, కణకణంలో, అణువణువులో నిండి ఉన్నాడు. ఆ పరమాత్మ యొక్క పవిత్ర అంశయే మనలోని ఆత్మ. మనమే ఆయన ప్రతినిధులం. ప్రియమైన రాజ కుమారులం, ఆయన అసంఖ్యాక అనుదానాలు, వరదానాలు మనకు ప్రాప్తించాయి. మనమే మనలోని ప్రతిభ, సామర్థ్యాలను ప్రపంచంలో సత్కర్మల వ్యాప్తికి, దుష్కర్మల నాశనానికి ఉపయోగించాలి. ఇదే సరియైన మానవధర్మం. జ్ఞానయోగం, కర్మయోగం సాధనల సమన్వయాన్ని సాధించుటలోనే మానవ జన్మ సార్థకత ఉన్నది.లేకపోతే మనకు పశువులకు తేడా లేనట్లే.

మనుష్యునికి పశువుకు ముఖ్యమైన తేడా – పశువు ఎలాంటి నియమాలతోనూ బంధించబడిలేదు. మనుష్యునిపై వేలాది నైతిక నియమాల బంధన ఉన్నది. అనేక బాధ్యతలు మోపబడ్డాయి. బాధ్యతలు, కర్తవ్యాలు నిర్వర్తించుట మానవుని ధర్మం. మన కర్తవ్యం శరీరాన్ని రోగరహితంగా ఉంచుట, మస్తిష్కాన్ని సద్గుణాలతో నింపుట. దేశం, ధర్మం, సమాజం సంస్కృతులను సమున్నతం గావించి సంపూర్ణశ్రద్ధ వహించుట, లోభ, మోహ, పాశాల నుండి తనను తాను విడిపించుకొని జీవాత్మను ఉద్ధరించుట కూడా మన కర్తవ్యమే. భగవంతుడు మనలను ఏ పని నిమిత్తం ప్రపంచంలోకి పంపించాడో, ఏ పని కోసం మనుష్య జన్మ ఇచ్చాడో ఆ పని పూర్తి చేయుట మన అవశ్య కర్తవ్యం. మన జ్ఞానం, ప్రతిభలను మరింత వృద్ధి చేసుకుంటూ తదనుసారము శ్రేష్ఠ ఆచరణ చేయుట కూడా మన పవిత్ర కర్తవ్యమే. ఇదే జ్ఞానయోగం, కర్మయోగం యొక్క నిజమైన సాధన మరియు ఈశ్వర భక్తి. ఇవే మానవుడికి శ్రేష్ఠతను ప్రదానం చేస్తాయి.

వర్ణవ్యవస్థలోని నాలుగు వర్ణాలు సమాజ ఉన్నతి కోసం కలసిమెలసి పనిచేసే విధానం మరుగున పడిపోయింది. ఈ జ్ఞానం యొక్క సదుపయోగం ద్వారా సమాజం తేజస్వి, వర్చస్వి అవుతుంది, ఉన్నతమవుతుంది, పుష్పించి ఫలిస్తుంది. దీనికై కృషి చేయడమే మానవ ధర్మం.

★★★

## పండుగలు

**ఏప్రిల్ 2015**

| | |
|---|---|
| 02-04-2015 | మహావీర్ జయంతి |
| 03-04-2015 | గుడ్ ఫ్రైడే |
| 23-04-2015 | ఆదిశంకరాచార్య జయంతి |

**మే 2015**

| | |
|---|---|
| 01-05-2015 | మేడే ప్రపంచ కార్మిక దినోత్సవం |
| 04-05-2015 | బుద్ధ పూర్ణిమ |
| 28-05-2015 | గాయత్రీ జయంతి<br>పండిత శ్రీరామశర్మ ఆచార్య<br>మహా ప్రయాణం |

**నీకు ఏది కావాలో దానిని సద్బుద్ధితో నాటుట మొదలుపెట్టు - అది సిద్ధిస్తుంది**



గాయత్రీ విద్య-52

# గాయత్రి - ఆధ్యాత్మిక త్రివేణి

గంగ, గీత, గోవు, గాయత్రి – ఈ నాలుగు ఆర్య ధర్మమునకు ప్రతీకలు. భారతీయ ధర్మాన్ని గౌరవించేవారు ఈ నాల్గింటిని తల్లితో సమానంగా గౌరవిస్తారు. ఒకే తల్లి సంతానం వలె చుట్టు ప్రక్కల వారితో ఏకత్వం అనుభవంలోకి వస్తుంది. గాయత్రి ఆధ్యాత్మిక త్రివేణిగా చెప్పబడింది. గంగ, యమునలు కలవడం వలన ఒక అదృశ్య, సూక్ష్మమైన, అలౌకికమైన దివ్య ప్రవాహం ఆవిర్భవిస్తుంది. దానిని సరస్వతి అని అంటారు. గంగ, యమున, సరస్వతిలు కలసిన దానిని త్రివేణి అంటారు. త్రివేణి అయినందువలననే ప్రయాగకు తీర్థరాజమని చెప్పబడింది. ఇదే ప్రకారంగా ఆధ్యాత్మిక జగత్తు యొక్క త్రివేణి గాయత్రిగా చెప్పబడింది. దాని యొక్క మూడు అక్షరాలు సంకేత రూపంలో త్రిగుణాత్మ సమ్మేళనం యొక్క రహస్యోద్ఘాటన చేస్తుంది. మొదటి అక్షరం "గ" గంగను సూచిస్తుంది. రెండవ అక్షరమైన "య" యమునను సూచిస్తుంది. మూడవ అక్షరమైన "త్రి" త్రివేణి యొక్క అస్థిత్వాన్ని సూచిస్తుంది. ఈ మూడు శక్తులలో ఎన్నో ఉన్నాయి. 1) సత్-చిత్-ఆనంద్ 2) సత్యం-శివం-సుందరం 3) సత్వ-రజస్సు-తమో 4) ఈశ్వరుడు-జీవి-ప్రకృతి 5) ఋక్-యజు-సామ 6) బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య 7) గుణ-కర్మ స్వభావం 8) శైశవం-యవ్వనం-ముసలితనం 9) బ్రహ్మ- విష్ణువు-మహేశ్వరుడు 10) ఉత్పత్తి-వృద్ధి-నాశనం 11) చలి- వేడి-వర్షం 12) ధర్మ-అర్థ-కామము 13) ఆకాశం-పాతాళం- పృథ్వి మొదలైన అగణిత త్రిగుణాలు గాయత్రి ఛందస్సు యొక్క గర్భంలో సంపుటీకరించబడ్డాయి. దీని లోతులలోకి ప్రవేశించి మనన, చింతన, పరిశీలన చేసినవారికి అనంతమైన లాభాలు సిద్ధిస్తాయి. ఈ మూడు అక్షరాలను అవగాహన చేసుకో గలిగితే మనుష్యులు ఎదుర్కొనెడి అనేకానేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. తద్వారా జీవన్ముక్తికి మార్గం దొరుకుతుంది.

త్రివేణి యొక్క మూడు ధారలు చూడటానికి చాలా కష్టమైనవిగా, అసాధ్యమైనవిగా, అగాథమైనవిగా కనిపిస్తాయి. ఇదేవిధంగా గాయత్రీలో ఉన్న సమస్యలు కఠినమైనవిగా కనిపిస్తాయి. త్రివేణి, జలధారలలో స్నానం చేయడం వలన భయం పోయి శాంతి, చల్లదనం, ప్రఫుల్లత (freshness) ప్రాప్తిస్తాయి. అదేవిధంగా గాయత్రిలో చింతన, మననల చేయుట ద్వారా శాశ్వత శాంతి పరమానందం లభిస్తాయి. గాయత్రి నిస్సందేహముగా ఆధ్యాత్మిక త్రివేణియే మరియు, తీర్థరాజము. దీనిలో ఉన్నటు వంటి తత్వజ్ఞానము అతి సరళము, సుగమము, సుఖశాంతులను ఇవ్వగలదు.

గాయత్రి శక్తి అనంతము. వేద పురాణములు, శాస్త్రములు, ఇతిహాసములు, ఋషులు, మునులు, గృహస్తులు, విరాగులు అందరూ దీని మహత్వాన్ని గుర్తించారు. దీనిలో మన దృష్టికోణాన్ని మార్చగలిగే అద్భుత శక్తి దాగి ఉంది. తన నిమ్న ఆలోచనాసరళి, భ్రాంతిమయమైన మనోభూమిని సరిచేస్తే మన కోరికలు, ఆకాంక్షలు, ఆలోచనాధారలు, భావనలు ఉచిత రీతిలోనున్నచో మనిషి దేవతల కన్నా గొప్పవాడిగా ఎదిగి ప్రతి ఒక్కరికి ఆనందాన్ని అందిస్తాడు. మనిషి దుష్టబుద్ధి స్వర్గాన్ని నరకంగా మార్చింది. ఈ విషమ స్థితిలోనుంచి బయట పడవేసి, మనిషి మస్తిష్కాన్ని సరిచేసే శక్తి గాయత్రికి మాత్రమే ఉన్నది. ఎవరైతే ఈ శక్తిని ఉపయోగించుకుంటారో వారు వికారాల నుండి, భ్రాంతుల నుండి, దుర్భావనల నుండి, భవబంధనముల నుండి విముక్తి పొంది జీవితాన్ని సత్యం, శివం, సుందర రూపంలో దర్శిస్తారు. పరమాత్మ అనుగ్రహంతో శాశ్వతశాంతిని పొందుతారు. ఇందువల్లనే వేదమాత గాయత్రిని మహా మహిమామయిగా కీర్తించారు. గాయత్రీ మహత్యం అనంతం.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 9 (1.12) నుండి*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**భార్యాభర్తలు ఒకే ప్రాణం రెండు శరీరాల్లా జీవించాలి, ఇదే విశుద్ధమైన ప్రేమ**

అశ్వమేధం - 2

# యజ్ఞము - దేవ సంస్కృతి మేరుదండము

తత్వదర్శులయిన ఋషులు తమ సూక్ష్మదృష్టిని, బుద్ధిని ఉపయోగించి అత్యంత ఉపయోగకరమైన సాంస్కృతిక పరంపరలను ప్రచారంలోకి తెచ్చారు. దేనికైనా ప్రాముఖ్యత నిచ్చేముందు దాని ఉపయోగాలు. ఉపలబ్దులే లెక్కించ బడతాయి, యజ్ఞమును ధర్మకృత్యములలో శ్రేష్టమైనదిగా గుర్తించుటలో దాని భౌతిక ఆధ్యాత్మిక లాభాలే ముఖ్యకారణము.

ఋగ్వేద ఆరంభంలోనే యజ్ఞమును మార్గదర్శక పురోహితునిగా సద్గురువుగా వర్ణించారు. వేదవాఙ్మయంలో యజ్ఞవిద్య మీద యజ్ఞాగ్ని మహాత్మ్యము మీద చెప్పబడినంత మిగతా విషయాల మీద చెప్పబడలేదు. ప్రసిద్ధ జ్యోతిష్య గ్రంథము "సిద్ధాంత శిరోమణి"లో "వేదస్థావద్ యజ్ఞ కర్మ ప్రవృత్తః" అనగా వేదముల ప్రవృత్తి యజ్ఞకర్మముల కొరకే. "యజ్ఞోవేదేశుప్రతిష్టితః" (గోపథ బ్రాహ్మణము 1-1-38) ప్రసిద్ధ, తార్కిక, దర్శన, న్యాయానికి సంబంధించిన వాత్స్యాయన భాష్యములో ఈ విషయమే చెప్పబడి ఉన్నది." యజ్ఞోమంత్రః వేదస్య విషయః" (4-1-62)

భారతీయ జీవిత విధానములో అన్ని ధర్మకృత్యములలోను యజ్ఞము అవిచ్ఛిన్న రూపముగా కలిసి ఉన్నది. జన్మము నుంచి మరణ పర్యంతము 16సార్లు ఈ యజ్ఞ ప్రక్రియను షోడశ సంస్కారములుగా ప్రయోగించి మానవునిలోని పశు ప్రవృత్తిని ఉన్మూలన గావించి దేవప్రవృత్తులను అభివర్ధనము చేసేవారు.

యజ్ అనే ధాతువు నుంచి ఉత్పత్తి అయిన యజ్ఞ శబ్దమునకు మూడు అర్థములు ఉన్నవి. 1. దేవ పూజనము అనగా పరిష్కృత వ్యక్తిత్వము. దైవీసద్గుణాల అనుసరణ 2. సంగతీకరణము అనగా ఏకత్వము, సహకారము సంఘీ భావము 3. దానము అనగా సమాజ పరాయణత, విశ్వ కుటుంబీకత, ఉదార సహృదయత ఈ మూడు ప్రవృత్తుల ప్రతినిధిత్వమే యజ్ఞము. ఈ ప్రక్రియలో సద్భావనలను సత్కరములను పరిణతి చెందించగల్గెడి ప్రేరణ ఉన్నది. జ్ఞాన, కర్మల సమన్వయమే ప్రగతికి ఆధారము. సత్కర్మలను తపస్సని. సద్జ్ఞానమును యోగమని వ్యవహరిస్తారు. ఆత్మ ప్రగతికి ఇవే ఆధారాలు. భౌతిక ప్రగతికి కూడా శ్రమ, శిక్ష ఇవే ప్రధాన సాధనాలు.

యజ్ఞము విశుద్ధ రూపములో సామూహికము. దీనిని ఒంటరిగా ప్రయోగించుట ప్రోత్సహింపబడదు. కనీసం భార్యాభర్తలైనా ఉండాలి. (ఋగ్వేదము యొక్క 2వ మండలము నుంచి 9వ మండలము వరకు అనేక ఋక్కులు దీనిని ధృవీకరిస్తున్నాయి.)

యజ్ఞ కృత్యములో జరిగే అనేక కర్మకాండలలో అనేకుల సహకారము అవసరమవుతుంది. మంత్రోచ్ఛారణ ఆహుతి ప్రధానము. పరిక్రమ లాంటి కృత్యాలలో ఏకరూపత సమస్వరత లాంటి అనుశాసనాలు పాటింపబడతాయి. యజ్ఞావశిష్టమును తిననివాడు దొంగతో సమానమని చెప్పబడినది.

యజ్ఞాగ్ని మనకు అనేక ఆదర్శాలను తెలుపుతుంది. 1) ఎల్లప్పుడూ వేడిగా-సక్రియముగా ఉండుట. 2) జ్యోతిర్మయము గా ఉండుట అనగా అనుకరణీయమైన ఉదాహరణగా ఉండుట, దారి చూపించుట. 3) తన సంపర్కములోకి వచ్చినవారిని తనవలె తయారుచేయుట. 4) పొందిన సామాగ్రిని సమాజ మంతటికి పంచిపెట్టుట. 5) నిరంతరము అగ్ని శిఖలను ఎత్తుగా ఉంచుట, అంటే ఆలోచనా సరళి, స్వాభిమానమును క్రిందకు పడనీయకుండా ఉంచుట యజ్ఞాగ్ని యొక్క ఈ సద్గుణ సామర్థ్యాలు ఋగ్వేదము. 7-1-7, 7-11-1 అధర్వణ వేదము 5-12-2లో కీర్తింపబడ్డాయి. స్వర్గము వరకు ఆత్మను తీసుకు వెళ్ళగలిగే వాహనము యజ్ఞాగ్ని అని శాస్త్రములు చెప్పాయి. (ఐతరేయ బ్రాహ్మణము 1-2-10, శతపథ బ్రాహ్మణము 12-4-1-7)

యజ్ఞము యొక్క తత్త్వదర్శనము, ఉదారత, పవిత్రత, సహకారిత అనే త్రివేణి మీద ఆధారపడి ఉన్నది. ఈ మూడే ప్రపంచాన్ని సుఖంగా ఉంచి సమున్నతముగా, సుందరంగా చేస్తాయి. సంపూర్ణ సృష్టి, ఆ పరస్పర ఆకర్షణ సూత్రాలలో బంధింపబడి ఉండుటయేగాక వాటిమధ్య అతి మహత్వ

**సజ్జనుల ఆజ్ఞల పాటించుటలో వచ్చెడి కష్టనష్టాలను లక్ష్యపెట్టకు**

పూర్ణమైన ఇచ్చి పుచ్చుకొనుట జరుగుతాయి. యజ్ఞపరంపర వల్లనే జడపదార్థాలు చేతనత్వము, సువ్యవస్థిత స్వరూపాన్ని సంతరించుకుంటాయి. అందుకే 'యజ్ఞో భువనస్యనాభిః' అన్నారు. ఈనాటి పర్యావరణ సమస్యను రూపుమాపటానికి యజ్ఞోపచార ప్రక్రియను తిరిగి తీవ్రతరం చేయాలి. యజ్ఞాలను శారీరక రోగాలతోపాటు మానసిక రోగాలను కూడా కుదుర్చుటకు ఉపయోగించవచ్చునని అథర్వణవేదము, ఋగ్వేదము తెలుపుచున్నాయి.

భౌతిక విజ్ఞానము కంటే ఎక్కువ సమర్థవంతమైనది సూక్ష్మ విజ్ఞానము. యజ్ఞముల ప్రముఖ ప్రయోజనము, వాయు శోధనతోపాటు వాతావరణ నిర్మాణము చేయుట. పవిత్ర వేదమంత్రాల సుస్వర ఉచ్చారణ-విశ్వ చేతనత్వములో పవిత్రతను నిర్మించే దివ్యకంపనాలను ఉత్పన్నం చేస్తుంది. సామాన్యమైన అగ్నిని, యజ్ఞాగ్ని-దేవాగ్నిగా మలిచేపనిని అధర్వుడు, ఉద్గాత లాంటి విశిష్ట యాజకుల యొక్క శ్రద్ధా సంకల్పశక్తి చేస్తుంది. పవిత్ర హోమ ద్రవ్యముల సూక్ష్మీకరణ వల్ల సూక్ష్మ జగత్తు అత్యంత ప్రభావితం చెందుతుంది.

యజ్ఞ ప్రక్రియ యొక్క వ్యాపక ప్రభావము పర్జన్య వర్షం ద్వారా జరుగుతుంది. పర్జన్యము యొక్క స్థూల అర్థము-మేఘాలు, సూక్ష్మ అర్థము-ప్రాణవర్షము. నిజం చెప్పాలంటే పర్జన్యము దుర్భిక్ష నివారణ కొరకు జరిగే మేఘమథనం. వర్షముతో కలసి నేలమీదకి వచ్చే ప్రాణతత్వము యొక్క అభివర్ధనకు తోడ్పడుతుంది. (భగవద్గీత 3వ అధ్యాయము 10,11,12 శ్లో)

ఈ రోజులలో జరుపబోయే ఉచ్చస్తరీయ అశ్వమేధ మహాయజ్ఞ ప్రయత్నం ప్రజల ఆలోచనా సరళిని పరిష్కృతము గావించి ఉజ్వల భవిష్యత్తుని రచించగలదని భావిస్తున్నాము.

## యజ్ఞము అభీష్ట సిద్ధి దాయకము

కోరికలుండుట తప్పుకాదు. వదలవలసినది వాటి స్వరూపాన్ని, సాధనాల నికృష్టత. శ్రేష్ఠమైన కోరికలలో స్వయం హిత సాధనతోపాటు ఇతరుల శ్రేయస్సును గురించి ఆలోచనలు కూడా కలిసి ఉండాలి. ఈ శ్రేష్ఠమైన కోరికల పూర్తికొరకు దివ్యద్రష్ట ఋషి సమూహాల అనుభూతుల ప్రయోగశాలలో యజ్ఞము అనే ఒకే ఒక శబ్దము దొరుకుతుంది. ఈనాడు కామ్య యజ్ఞముల విధానాలు కనుమరుగయ్యాయి. అక్కడక్కడ కొన్ని సంకేతాలు మాత్రమే లభిస్తున్నాయి. పురాణాలలో ముఖ్యముగా అగ్ని పురాణములో రాజ్యప్రాప్తి కొరకు, వ్యాధి నాశనము కొరకు, అకాల మృత్యువు నుంచి రక్షించుకొనుటకు ధర్మ, అర్థ, కామ, మోక్షాలనిచ్చే విధానాలు ధనప్రాప్తి కొరకు లక్ష్మీ యజ్ఞము సిద్ధించిన మంత్రాలతో నిర్ణయించబడిన హవన సామగ్రితో యజ్ఞము వల్ల సకల వశీకరణ లాంటి అనేక ప్రయోగాల వర్ణన వివరణ దొరుకుతుంది.

కాని వ్యక్తిగత స్థాయిలోగాక సంపూర్ణ మానవజాతికి శుభం కలగాలి అనే ఆర్తి ఉద్భవించినప్పుడు చేయవలసిన విధి విధానాన్ని గురించి ఋషులందరూ ఏక స్వరముతో ఇలా అన్నారు.

**అశ్వమేధాప్యాయితా దేవాం వృష్ట్యుత్సర్గేణ మానవః ।**
**ఆప్యాయణం వై కుర్వంతి యజ్ఞాః కల్యాణహేతవః ॥**

అశ్వమేధం ద్వారా ప్రసన్నులయిన దేవతలు మానవుల మీద శుభాలను వర్షింపచేస్తారు.

కలి ప్రవాహాన్ని నిలువరింప చేసి సత్యయుగ వాతావరణాన్ని పునర్ నిర్మించే ఈ మహాయజ్ఞాల 'శృంఖల' యజ్ఞము చేసే యాజకుల మహోన్నత కోరికను పూర్తి చేయడానికి ఒక అద్భుతమైన అలౌకిక ప్రయోగము. ఒకప్పుడు పృథు, అంబరీషుడు లాంటి లోకనాయకులు ఈ మహత్తర ప్రయోగాన్ని చేసి మానవులను ఉద్ధరించారు. ఈనాడు అదే ప్రయోగము యుగాంతరకారీ శక్తుల ద్వారా సంచాలిత మవుతుంది.

## యజ్ఞము అనగా శ్రద్ధ మాత్రమే కాదు అద్భుత విజ్ఞానము కూడా

భౌతిక శక్తి, ప్రాణశక్తుల సమన్వయముతో పురాతన వైజ్ఞానికులు మూడవశక్తిని ఆవిర్భవింపచేయుటలో అద్భుత సాఫల్యం పొందారు. దీనికి యజ్ఞాగ్ని అని నామకరణము చేశారు. దీని వైజ్ఞానికతను 5 రకాలుగా తెలుసుకొనవచ్చును.

**1. యజ్ఞకుండ ఆకృతి:** యజ్ఞ కుండములు విభిన్న ఆకృతులలో నిర్మించబడి విశిష్ఠ ప్రయోజనాల సిద్ధింపచేస్తాయి. వాటిలో ముఖ్యమైనవి యోనికుండము, అర్ధచంద్రకుండము, త్రికోణకుండము, వృత్తకుండము, సమఅష్టాస్రకుండము, సమషడస్రకుండము, చతుష్కోణాస్ర కుండము, పద్మకుండము. ఈ ఆకృతుల వల్ల అందులో ఉత్పన్న మయ్యే వేడిని (కాంతిని)

వెనుకబడిన వారికి చేయూతనివ్వు - అవే భావనలలో జీవించు, శ్రమించు

అదుపులోనికి తెచ్చి వాతావరణములో కావలసిన మార్పులు తీసుకురాగలము.

**2. సమిధలను ఎన్నుకొనుట:** వేడి పదార్థాలలో రసాయనిక మార్పులను తీసుకువస్తుందన్నది సర్వ విదితమే. పదార్థాలు జ్వలించబడినప్పుడు కొత్త పదార్థాల ఉత్పత్తి పెరుగుతుంది. దీనికి మూలాధారమైన సమిధల గుణ, ధర్మాలననుసరించి యజ్ఞ ఉద్దేశ్యము లేక ప్రయోజనాల సమన్వయం గావించుకొని సమిధలు నిర్ణయిస్తారు.

**3. హవన సామాగ్రి:** పదార్థముల రసాయనిక గుణ, ధర్మములు దాని భౌతిక స్థితిమీద ఆధారపడి ఉంటాయి. పదార్థముల స్వాభావిక స్థితిలో జరిగే ప్రక్రియల కంటే భాష్పస్థితిలో వాటి మధ్య ఘనిష్ట సంబంధము ఏర్పడుతుంది. పంచదార, బొగ్గు, మొదలగునవి అతి సూక్ష్మస్థితిలో వాయువుతో కలసినప్పుడు మందుగుండుగా ప్రేలుతుంది. దీనిని బట్టి సూక్ష్మీకృతమైన పదార్థ స్వభావముననుసరించి వాని ఎంపిక జరుగుతుంది.

హవన సామాగ్రి మండించినపుడు ఆడిక్లైడ్స్, ఆమైన్స్, సైక్లిక్ శ్రేణిలో అనేక పదార్థాలు ఏర్పడతాయి. నెయ్యి ఉపయోగించటం వల్ల అగ్ని తాపమానాన్ని నియంత్రణలో ఉంచుతుంది. ఇది భాష్పరూపములో పరిణతి పొంది సామాగ్రి యొక్క సూక్ష్మకణాలను అన్ని వైపుల నుంచి ఆవహించి దాని మీద ఋణాత్మక విద్యుచ్ఛక్తిని ఏర్పరుస్తుంది.

అగ్ని ఉష్ణతవలన యజ్ఞ స్థలములోని వాయువు వేడెక్కి, పైకి వెళ్ళుటవలన ఆ ప్రదేశాన్ని నింపుటకు చుట్టుప్రక్కలనున్న వాయువును తీసుకొని ముందుకు వస్తుంది. అగ్నిలోని వేడిమి వలన వాయువులోని రోగ కీటాణువులు నశించి పోతాయి.

సూర్యకిరణాలలో "ప్రకాశిని రశ్మి" ఉంటుంది. సముద్రపు ఉపరితలం మీద వీటి తరంగ దైర్ఘ్యము 2960 $A^0$ ప్రతి 800 గజాల పైకి వెళ్ళిన కొద్దీ ఈ కిరణ తరంగాల పొడుగు 10 $A^0$ తగ్గుతుంది. 2960 $A^0$ కంటే తక్కువ పొడుగు గల తరంగముల రోగ కీటాణువులను నాశనము చేయటానికి ఉపయోగ పడతాయి. 2950 $A^0$ తరంగాలు వాయువుని అయనీకరణము చేస్తాయి. దీనివల్ల వాయువులో ఆరోగ్యము చేకూర్చే తత్వముల పరిమాణము పెరుగుతుంది.

సూర్యకిరణాలలో వేర్వేరు రంగులుంటాయి. రోగ కీటాణువుల మీద ఈ రంగుల ప్రభావము వేర్వేరుగా ఉంటుంది. ఈ ప్రభావాన్ని గుర్తించటానికి ఒకే పరిమాణము గల తగరపు (టిన్) డబ్బాలలోపల వేరు వేరు రంగులు లోపల వైపు వేసి చాలా ఎక్కువ సంఖ్యలో దోమలున్న గదిలో పెట్టారు. సూర్యోదయ సమయంలో అన్ని డబ్బాలకు మూతలు పెట్టారు. ఒక్కొక్క మూత తెరచి చూసినప్పుడు నారింజరంగుగల డబ్బాలో అన్నింటికంటే తక్కువ సంఖ్యలో దోమలున్నాయి. అగ్ని రంగు కూడా నారింజ రంగులోనే ఉంటుంది. దీనితో అగ్నిహోత్రపు ఉపయోగము, దాని ప్రభావము స్పష్టమవుతుంది.

యజ్ఞధూమము వల్ల వాయు పరిశుద్ధతే గాక అక్కడున్న స్థలము (పృథ్వి) జలము మొదలగు అనేక తత్వాలు పరిశుద్ధ మవుతాయి. అంతేగాక మానవ శరీరములో రోగ నిరోధక, వినాశక అణువుల శాతం పెరుగుతుంది. అందువల్ల అతని ఆరోగ్యము బాగు పడుతుంది. కుందేళ్ళు, ఎలుకల మీద హవన ధూమము యొక్క ఈ శక్తిని పరీక్షించి అది వాస్తవమని నిరూపించారు. అంతేగాక యజ్ఞధూమము యొక్క సాత్విక లక్షణాలు మేఘాలలో జొరబడి వర్షించి భూమి మీద ఉన్న అన్నము, ఓషధులలో సత్వగుణ తత్వాన్ని పెంచుతాయి. ఈవిధంగా అనేక రకాలుగా యజ్ఞము పర్యావరణములో ఉన్న కాలుష్యాన్ని తొలగిస్తుంది.

**4. మంత్రాల శుద్ధ స్పష్ట ఉచ్చారణ:** అనుకూల పరిస్థితులు ఏర్పరచటానికి చాలా ప్రముఖ పాత్రను వహిస్తాయి. మంత్ర శాస్త్రంలో ముఖ్యముగా గాయత్రీ మంత్ర ప్రయోగము యజ్ఞము యొక్క లాభాలను అనేక రెట్లు పెంచుతుంది.

**5. యజ్ఞము చేసే సమయము:** ఈనాటి యుగసంధి కాలంలో విశ్వశాంతి, సమున్నతి, సమృద్ధి అనేది ఏర్పడటానికి మనకు ఋషులు అందించిన అశ్వమేధ యజ్ఞాల కంటే మించిన విధి విధానము లేదు.


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


**వస్తువులను, మనుష్యులను కాక ఆదర్శాల ప్రేమించు**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-34

# ఆశీస్సులు, వాగ్దానాలు

### దైవభక్తి - దేశభక్తి సంయోగం చెందినవేళ

కాలగమనంలో జైలులోని సహచరులంతా స్వామి రామదాసును స్వామి భగత్‌జీ అని పిలువసాగారు. స్వామి భగత్‌జీ భక్తిసాగరంలో మునిగి కూడా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొనసాగారు. స్వామిలో తిరుగుబాటుతత్వమున్నదనెడి భావనతో ఆయనను పోలీసులు నిర్బంధించిరి. ఆగ్రాకు సమీపంలోనున్న ఆంజనేయస్వామి గుడిలో భగత్‌జీ నివాసం. గుడిలో రాముని పరివారమంతా ఆశీనులై ఉన్నప్పటికి గుడికి హనుమాన్ మందిరమని భగత్‌జీ పేరుపెట్టుట విశేషం. రాముని సంతోషింప చేయుటకు ప్రతివారు హనుమంతునిలా ఎదగాలని భగత్‌జీ అంటూ ఉండేవారు. భగత్‌జీ దృష్టిలో హనుమంతుడు ఒక ఆదర్శభక్తుడు మరియు బలానికి, ధైర్యానికి, సాహసానికి, వివేకానికి, జ్ఞానానికి ప్రతిరూపం. హనుమలోని గొప్పగుణాలను పొందుటకై ఆయనను దర్శింప వచ్చిన వారికి ఆయన ప్రేరణనిస్తాడు. యుక్త వయస్సులోనున్న వారికి, యువకులకు దేవాలయ ప్రాంగణంలో స్వామి శిక్షణా తరగతులను నిర్వహించేవారు. 8-10 సంవత్సరముల వయస్సు ఉన్నవారికి గత 5 సంవత్సరముల నుండి రామాయణంలోని కథల చెప్పుచూ యోగా తరగతులను నిర్వహించేవారు. దీనికి తోడు స్వాతంత్ర్యోద్యమ విషయాలను కూడా వారికి స్వామి బోధించేవారు. భగవాన్ రాముడు అవతరించిన నేలను విదేశీయులు పాలించరాదనెడిది స్వామి నియమం. దీనిని స్ఫూర్తిగా, లక్ష్యంగా గొని హనుమాన్ మందిరాన్ని స్వాతంత్ర్య సమరయోధుల శిక్షణా కేంద్రంగా స్వామి మలిచాడు. ప్రభుత్వ వర్గాలు దీనిని గమనించినను సరియైన ఆధారాలు లభింపక స్వామిపై చర్యలు చేపట్టజాలక పోయారు.



ఏవేవో సాకులు చూపి పోలీసులు స్వామిని నిర్బంధించుటకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనితో పోలీసులు దేవాలయ పాలనపై, రోజువారి కార్యక్రమాలపై నిఘాపెట్టారు. చివరకు ప్రభుత్వ వ్యతిరేక వర్గాలకు ఆశ్రయ మిచ్చుచున్నాడనెడి ఆరోపణలపై స్వామిని నిర్బంధించుట జరిగింది. ఆలయమంతా వెతికినప్పటికి పోలీసులకు ఆధారాలు ఏమి కనిపించలేదు. అయినప్పటికి పోలీసులు తమ ప్రయత్నాలను విడువక మందిరంలోని విగ్రహాల క్రింద ఒక రహస్య ద్వారం ఉన్నదని, విగ్రహాలను తొలగించినచో అది బయట పడుతుందని ఆరోపించారు. ఇంతటితో ఆగక స్వామీజీ అభ్యంతరాలను త్రోసిపుచ్చుతూ బలవంతంగా పోలీసు అధికారి విగ్రహాలను తొలగించుటకు పూనుకున్నాడు. దీనిని స్వామీజీ అడ్డగించగా ఇరువురి మధ్య కొట్లాటకు దారితీసింది. దీనితో స్వామి భగత్ అధికారిని కొట్టుచుండగా మిగిలిన భక్తులు కూడా చేతులు కలిపారు. దీనితో పోలీసు అధికారి ప్రాణభీతితో అచ్చటి నుండి పారిపోతూ తగిన శిక్షను ఎదుర్కొనెదవని భగత్‌జీని హెచ్చరించాడు. మూడు రోజులు తదుపరి ఆ అధికారి అతని ఇంటిలో చనిపోయి ఉండుట జరిగినది. కారణాలు ఎవరికి అంతుచిక్కలేదు. దీనిపై విచారణ చేస్తూ దీనికి పూర్వం మందిరంలో జరిగిన సంఘటనల ఆధారంగా భగత్‌జీపై అతని అనుచరులపై కేసు నమోదు చేసి వారిని నిర్బంధించారు. ప్రభుత్వ అధికారిని చంపినాడనే అభియోగం స్వామిపై మోపి బెయిలు ఇవ్వని సెక్షన్ క్రింద నిర్బంధించుట జరిగింది. స్వామి భగత్‌జీ తన నిర్బంధాన్ని లెక్కించక తన రోజువారీ విధులను జైలులో కూడా యదావిధిగా నిర్వర్తిస్తూ తోటివారికి ధైర్యం, బలం, వివేకం, జ్ఞానం మరియు వినయాన్ని గురించి బోధిస్తూ ఉన్నాడు. దీనికి తోడు ఇతరులకు వ్యాయామాన్ని, యోగ, ప్రాణాయామాలపై శిక్షణలను కూడా ఇస్తుండేవాడు. స్వామీజీ ద్వారా శిక్షణ పొందినవారు తగిన లబ్ధిని కూడా పొందినామని తెలిపేవారు.

### సాధకునికి దైవీ సంరక్షణ

సాధకుడు ఎప్పుడు తన జీవితంలో ఊహాతీతమైన

**ప్రప్రథమ విజేత అగ్రగణ్యుడుగా నిలుస్తాడు తరువాత వారంతా అనుచరులు మాత్రమే**

సంఘటనలకు ఆశ్చర్యజనిత సంఘటనలకు తావివ్వడు. నమ్మకం మరియు సమర్పణ సందర్భానుసారంగా పరీక్షా సమయమందు తప్పక ఆశ్చర్య సంఘటనలకు చోటు కల్పించునని విశ్వసిస్తాడు. భగత్‌జీ చాలా శ్రమజీవి. జైలులోని పరిస్థితి చాలా దారుణంగా భరింపశక్యం కాకుండా ఉంది స్వామీజీకి. జైలు బాధ్యతలు నిర్వహించెడి అధికారుల ప్రవర్తన చాలా లోప భూయిష్టంగా ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి తోడు భారతీయ అధికారులు కూడా భగత్‌జీ పట్ల అమర్యాదగా ప్రవర్తించుట చోటు చేసుకుంది. ఇట్టి స్థితిలో నాలుగు నుండి ఐదు వానరాలు జైలులోనికి ప్రవేశించి భగత్‌జీ చుట్టూరా కాపలాగా తిరుగసాగాయి. ఎవరైనా భగత్‌జీ పట్ల అమర్యాదగా, అవహేళనగా ప్రవర్తించినచో అట్టివారిని వానరాలు భయపెట్ట సాగాయి.

ఒకసారి కొంతమంది అధికారులు లాఠీలు చేబూని భగత్‌జీ వైపు వస్తుండగా మూడు వానరాలు వారిపై మూకుమ్మడిగా దాడిచేసి వారిని రక్కుచు అచ్చటి నుండి పారిపోయేలా చేశాయి. ఇట్టి సంఘటనలు వరుసగా రెండు మూడు సార్లు జరుగుటచే జైలు ప్రాంగణమంతా తన భక్తుని సంరక్షణార్థమై భగవంతుడు తన సేనను పంపాడనెడి వార్త వ్యాపించింది. జైలు అధికారులు ఆ వానరాలను పట్టి బంధించుటకు ప్రయత్నించారు. చివరకు కాల్చివేయాలనెడి ప్రయత్నం చేయగా వారి ప్రయత్నాలు ఫలించలేదు. గత్యంతరం లేక జైలు అధికారులు భగత్‌జీ పట్ల తమ ప్రవర్తనను, నడవడిని మార్చుకొనక తప్పలేదు. అప్పుడు వానరాలు శాంతించి కొన్ని రోజులకు జైలుని విడిచి వెళ్ళిపోయాయి. తిరిగి కనిపించలేదు.

శ్రీరామ్ కన్నా కొన్ని రోజుల ముందుగా భగత్‌జీని పోలీసులు నిర్బంధించుట జరిగింది. ఆయనపై హత్యారోపణ మోపబడింది. ప్రభుత్వ లాయరు భగత్‌జీ హంతకుడని హత్య చేశాడని తగిన ఋజువు సాక్ష్యాధారాలను కూడా కోర్టులో ప్రవేశపెట్టాడు. ఇన్ని జరిగినా, చిత్రంగా న్యాయాధికారి థాంసన్ ప్రభుత్వ లాయరు చేసిన ఆరోపణలను, ప్రవేశపెట్టిన ఆధారాలను విశ్వసింపక రాఘవ భగత్‌జీని నిర్దోషి అని విడుదల చేయుట జరిగింది. భగత్‌జీ విడుదల క్షణం నుండి ఆయన చేపట్టిన శిక్షణా తరగతులు, సాధనలు నిలిచిపోయాయి. అప్పుడు భగత్‌జీ శ్రీరామ్‌తో ఇలా అన్నాడు – "సాధకుడు ఎల్లప్పుడూ ఆ క్షణంలో ఏమి చేయాలి? అనెడి దానిపై మనస్సు పెట్టి చేయాలి అంతేగాని భూతకాలాన్ని మరియు భవిష్యత్ కాలాన్ని గురించి మనస్సు పెట్టరాదు."

### కారాగారం నుండి విడుదల తర్వాత ఇంటికి చేరుట

శ్రీరామ్‌కు తన తల్లి తాయీజీ నుండి ఇలా గట్టి హెచ్చరిక అందింది. "జైలు నుండి విడుదలయ్యాక ఇంటికి వస్తావా? లేక వనవాసం చేస్తావా?" దీనితో శ్రీరామ్ కలత చెంది సిగ్గుతో స్నేహితులకు వీడ్కోలు చెప్పి ఇంటి ముఖం పట్టాడు. ఇంటికి చేరేసరికి శ్రీరామ్ భార్య సరస్వతీదేవి హారతి చేబూని ఇంటి ద్వారం వద్ద శ్రీరామ్‌కు స్వాగతం పలికింది. తాయీజీ కోడలు వెనుక నిలబడింది. హారతి ఇచ్చి కోడలు వెనుకడుగు వేయగా తాయీజీ ముందుకు వచ్చి నిలబడగా శ్రీరామ్ తల్లి పాదాల స్పృశించి నమస్కరించాడు. తాయీజీ కుమారుని ఆశీర్వదిస్తూ "శ్రీరామ్! నీవిప్పుడూ పూర్తి స్వేచ్ఛాజీవివి. నీవు ఎప్పుడైనా రావచ్చు, పోవచ్చు. ఇంటి బాధ్యతల నుండి నీకు స్వేచ్ఛ లభించింది. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తదుపరి నీవు కుటుంబ బాధ్యతలను చేపట్టవచ్చు" అన్నది. పై మాటలు అన్న పిదప తాయీజీ మోములో తృప్తి మరియు సంతోషం వెల్లివిరిశాయి. తాయీజీ తన కుమారుని దేశ సేవకు అర్పించింది. శ్రీరామ్ మరోమారు తల్లి పాదాల స్పృశించి ఆమె పాదధూళిని తన నుదుటిపై ధరించాడు. ఇంటిలోనికి ప్రవేశించగనే ఊయలలో నిద్రించుచున్న తన మూడు మాసాల కుమారుడు ఆయన కంటబడ్డాడు. తాను జైలులో ఉండగా పెట్టిన పేరుతో 'ఓం' అని కుమారుని పిలుస్తూ ముద్దాడాడు. భార్య చెంతనే ఉండి ఇదంతా గమనిస్తున్నది. ఆమె తన భర్త పాదాల స్పృశించి "తల్లిదండ్రులుగా ఈ బిడ్డ పట్ల మన బాధ్యత ఏమిటి?" అని భర్తను అడిగింది. బదులిస్తూ శ్రీరామ్ "తాయీజీ మన చెంతనే ఉన్నది. పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత గురించి ఆమె కన్నా చక్కగా చెప్పగలవారెవరు? ఆమె నుండి మార్గదర్శనాన్ని పొందు. నేను వస్తూ ఉంటాను. తాయీజీ నన్ను దేశ సేవకర్పించుట నీవు విన్నావుగా? ఆమె నన్ను తిరుగాడే సాధకునిగా చేసింది."

### దళితులు మరియు వెనుకబడ్డ వర్గాల మధ్య

దళితులు మరియు వెనుకబడ్డ వర్గాల వారు కూడా హిందూ సమాజంలో అంతర్భాగమే అని ప్రకటన వెలువడగానే లెజిస్లేటివ్ కౌన్సిల్ వారి ప్రాతినిధ్య సంఖ్య పెరిగింది. దీనితో

**మానవుని దుష్కర్మలకు మూలం అతని దుష్టచింతనలే**

వారికి గల సభ్యత కేటాయింపు రెండింతలైనది. గాంధీజీ తదితర పెద్దలు దానికి వెనువెంటనే తమ ఆమోదాన్ని తెలియ జేశారు. ఇరువురి మధ్య కుదిరిన పూనా ఒప్పందం తదుపరి, మూడవ రౌండ్ టేబుల్ సమావేశానికి ఏర్పాట్లు ప్రారంభ మయ్యాయి. పూనా ఒప్పందం పిదప రానున్న మార్పులను శ్రీరామ్ ముందుగనే ఊహించాడు. దళితులని పిలువబడెడి వారంతా యదార్థంగా మనం సహోదులేనని శ్రీరామ్ తన సహచరులతో చెప్పసాగాడు. కావున వారికి విడిగా గృహాలు ఉండనవసరం లేదు. అంటరానితనం రూపుమాసిపోవాలి. అట్లే వారిని తాకినంతనే స్నానం చేయాలనెడి ఆచారాన్ని పాటింపరాదు.

ఆవల్‌ఖేడా గ్రామంలో ఒక ఎత్తైన వేదిక ఉంది. స్థానిక దేవత పాదాలను అచ్చట స్థాపించారు. అచ్చట నివాసముండెడి వారిలో ఒకని పూర్వీకుని స్థానదేవతగా గుర్తించి, పూజించు చున్నారు. శ్రీరామ్ అచ్చటికి వెళ్ళి, వారితో "దళితులు కూడా హిందూ సమాజంలో గౌరవ మన్ననల అందుకొనుటకు అర్హులు" అని వారికి నమ్మిక కలిగించేలా మాట్లాడారు. అచ్చటి గుడిసెలోనున్న కన్నయ్య అనెడి వానిని పిలిచి, ఆ స్థానదేవతను గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నాడు. "స్థానదేవతగా పూజింపబడెడి వ్యక్తి 7–8 తరాల పూర్వం అచ్చట జీవించాడు. ఆ గ్రామ ప్రజలను బందిపోటు దొంగల నుండి రక్షించాడు బందిపోట్లతో జరిగిన పోరులో అతడు నలుగురు బందిపోట్లను చంపి, తాను తీవ్రంగా గాయాలపాలై ఒకవారం దినాల్లో అసువులు బాసాడు." అని అతడు వివరించాడు శ్రీరామ్‌కు. శ్రీరామ్ బదులు పలుకుతూ "స్థానదేవతగా పూజింపబడుచున్న వ్యక్తి తనను తాను బలిదానం గావించుకొని గ్రామాన్ని రక్షించాడు అట్టి వ్యక్తి ఖచ్చితంగా మనందరికి దైవమే. యావత్ గ్రామం ఆయనను పూజించాలి" అన్నాడు.

★★★

## యజ్ఞ మహాత్మ్యము

***యజ్ఞో విశ్వస్య భువనస్య నాభిః***

*– అధర్వణ వేదము 9/10/14*

యజ్ఞమే సమస్త బ్రహ్మాండాన్ని బంధించే నాభిస్థానం.

***యజ్ఞాః కళ్యాణహేతవః ।*** *– విష్ణు పురాణము 6/1/8*

యజ్ఞములు కళ్యాణ కారకములు.

***యజ్ఞేన హి దేవా దివం గతాః***
***యజ్ఞే నాసురా నపా మదంతః ।***
***యజ్ఞేన ద్విషంతో మిత్రా భవంతి యజ్ఞేన సర్వం***
***ప్రతిష్ఠితమ్। తస్మాద్యజ్ఞం పరమం వదంతి ।***

*– మహానారాయణీయోపనిషత్*

యజ్ఞమువల్ల దేవతలు స్వర్గము పొందారు. అసురులను ఓడించారు. యజ్ఞమువల్ల శత్రువులు కూడా మిత్రులవు తారు. యజ్ఞములో అన్ని గుణములు ఉన్నవి. అందువల్ల శ్రేష్ఠజనులు శ్రేష్ఠకర్మముగా వర్ణించారు.

***వజ్రో వా అశ్వః*** *– శతపథ 4/3/4/27*

వజ్రమే అశ్వము.

## నాస్తికుడు

*ఒక నాస్తికుడు ఇట్లు తర్కించసాగాడు – "ఈశ్వరుడు అనేవాడు ఎవడు లేడు. ఈ ప్రపంచమంతా స్వాభావిక మైనది, జరిగేవన్నీ ప్రాకృతికమైనవి" ఒకరోజు ఒక యువకుడు ఒక అందమైన చిత్రాన్ని తీసుకువచ్చి నాస్తికుని ముందు ఉంచాడు. నాస్తికుడు ఈ అందమైన చిత్రాన్ని ఎవరు వేశారని అడిగాడు. యువకుడు ఇలా అన్నాడు – "మా శిక్షణ పాఠశాలలో ఒకచోట కాగితం, బ్రషులు, రకరకాల రంగులు ఉంచాము. బ్రష్‌లన్నీ రంగులలో మునిగి బొమ్మ వేయడం మొదలుపెట్టాయి. ఉన్నట్టుండి, ఈ చిత్రం తయారయింది" ఇది విన్న నాస్తికుడు ఇలా అన్నాడు – "చిత్రం తనంతట తాను ఎలా రూపొందు తుంది? దీనిని ఎవరో వేసి ఉండాలి. యువకుడు జవాబు ఇస్తూ – "ఈ సుందరమైన చిత్రాన్ని ఎవరో ఒకరు వేసి ఉండాలి అంటున్నావు. మరి ఈ ప్రపంచం ఎవరి కర్తృత్వం లేకుండా తనంతట తాను ఎలా తయారవుతుంది? అన్నాడు. నాస్తికుడు తన తప్పుని అంగీకరిస్తూ ఆస్తికునిగా మారాడు.*

*– అఖండజ్యోతి, మార్చి 2010*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**దుష్టచింతనలకు ప్రభావితులైనవారు నరపశువులు, నరపిశాచాలుగా ప్రవర్తిస్తారు**

శబ్దబ్రహ్మ - నాదబ్రహ్మ - 7

# కటువైన మాటల వలన కలిగే మానసిక రుగ్మతలు

కటువైన చెడు మాటలు, అశుభమైన, వాసనాత్మక మాటల మూలాలు మనిషి యొక్క గుప్త మనసులో ముద్రించబడతాయి అని స్వరవిజ్ఞానం చెబుతున్నది. అశ్లీల పదాలు వాడెడి మనిషి గుప్త మనసులో ఖచ్చితంగా అశ్లీలత ఉంటుంది. చాలాకాలం మనసులో పేరుకుపోయిన వాసనలు ఈ తిట్లు, చెడ్డమాటల రూపంలో మళ్ళీ మళ్ళీ వెలువడుతుంటాయి.

ప్రతిమాట ఒక రకమైన ఆలోచనా బీజము. మనసులో ముద్రించుకున్న శబ్దం దాని గుణాలను చిగురింపచేస్తూ నలువైపులా విస్తరిస్తుంది. పదే పదే అదే మాటలను అనడం వల్ల, ఆచరణలోకి తేవడం వల్ల పెరిగి ఈ వేర్లు పెద్దవై మహావృక్షంగా మారుతుంది. పదాల (ప్రత్యేకించి తిట్లు) అర్థం తెలియకపోయినా, మెల్లిమెల్లిగా ఆ పదాలే మంచి లేదా చెడు ఫలితాలనిస్తాయి.

అసభ్య జాతులు లేదా వ్యక్తుల నోటి నుండి వచ్చే చెడ్డ మాటలు, తిట్లు, కోపాన్ని, ద్వేషాన్ని సూచించే మాటల ఉచ్చారణ వల్ల వారి పిల్లల వ్యక్తిత్వం దిగజారుతుంది. పిల్లల మనసు పాలలాగా స్వచ్ఛంగా ఉంటుంది. తల్లిదండ్రులు, చుట్టుప్రక్కల వాళ్ళు ఏ అశ్లీల పదజాలాన్ని వాడగా వింటాడో, అవే మంచివి అనుకుని వాటిని గ్రహిస్తాడు. పెద్దయ్యాక ఆ మాటల చెడు తాత్పర్యాన్ని తెలుసుకుని చింతితుడవుతాడు. ఆ మాటలను బట్టే వారి జీవితం మలచబడుతూ ఉత్థాన పతనాల చెందుతుంది.

మాట్లాడే ప్రతిమాట గుప్త మనసుమీద బలమైన సంస్కారాలని ముద్రిస్తుంది అంటారు మనోవైజ్ఞానికులు. ఆ సంస్కారాలే వాతావరణాన్ని ఏర్పరుస్తాయి. ఈ వాతావరణమే జీవితాన్ని నిర్మిస్తుంది. కాబట్టి మన నోటి నుండి పలికే ప్రతి మాటకు జీవితంలో చాలా ప్రాముఖ్యత ఉంటుంది. మాటలే మనిషి భాగ్యాన్ని నిర్మిస్తాయి. మంచి మాటలు, ప్రేరణాత్మక మాటలు, ధర్మ భావాలు, పవిత్ర సంకల్పాలతో నిండి ఉన్న పదాలు ప్రాపంచిక పోరాటంలో గెలుపు ఓటములకు కారణమవుతాయి.

మధురమైన మాటలు జీవితాన్ని రసమయం చేయగలవు. ధార్మిక మరియు వైదిక వాక్యాలతో నూతన ఆలోచనలు, ఘనమైన భావనలు, ఉన్నత సంస్కారాలు సొంతమవుతాయి. ప్రేరణాత్మక మాటలతో మనిషి కష్టాలను, ఉపద్రవాలను జయించగలుగుతాడు. ఆలోచనాపరులు, మహర్షులు, కవులు, ధర్మోపదేశకులు, మహాపురుషులు చేసెడి ఉపదేశాలు ఎందరో వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేస్తాయి. పదాలు (అంటే ఈ సమగ్ర సాహిత్యం) సంగ్రహింపబడి ఉండకపోతే మానవ జాతికి శ్రేష్ఠమైన సంపద చేజిక్కి ఉండేది కాదు. తీవ్రమైన తామసికతను అనుభవించే క్షణాలలో గొప్ప మాటల ద్వారా అభినవ ప్రభావ యుక్తమైన ప్రకాశం ఉదయిస్తుంది.

శబ్ద సాధన ద్వారా నిద్రిస్తున్న మానవీయ శక్తులు మేల్కొంటాయి. మనిషిలో నూతనశక్తి, అద్భుత సామర్థ్యం ఉదయిస్తాయి. నిర్జీవంగా పడి ఉన్న వ్యక్తిలో కూడా కొత్త ఆశ, ప్రాణం చిగురిస్తాయి. మొదట్లో కాళిదాసు మూర్ఖుడే. కాని మార్మిక శబ్దాలే కొత్త జ్ఞానాన్ని అతనిలో రేకెత్తించాయి. భారతీయ మనీషులు ఈ మనోవైజ్ఞానిక తథ్యాన్ని ఆధారం చేసుకుని మంత్ర విజ్ఞాన ప్రక్రియలను కనుగొన్నారు. భారతీయులు ఉచ్చరించే మంత్రాలు నిజానికి జాగ్రత్తగా సేకరించిన శక్తివంతమైన ప్రాణవంతమైన ప్రఖర శబ్దాలు. వాటికంటూ ప్రత్యేకమైన అర్థాలుంటాయి. మన ఆచార్యులు వారి అనుభవంతో, జ్ఞానంతో వీటిని సమకూర్చారు, వారి సంపూర్ణ జీవిత సారాన్ని అందులో నిబిడీకృతం చేసారు. మంత్రాల్లో వాడిన పదాలు సాకారమవడం, జీవితంలో అవి పూర్తిగా అవతరించడం, వాటిని అనుసరించి జీవితమంతా కొనసాగడాన్ని మంత్ర సిద్ధి కలగడం అంటారు. ఈ విధంగా మంత్ర సిద్ధిని సాధించిన వారికి కాయకల్పం జరిగినట్టే.

మంత్ర విజ్ఞానాన్ని నమ్మకపోయినా, శరీరం మరియు మనసుపై సామాన్య స్వరాల ప్రభావం దైనిక జీవితంలో ప్రత్యక్షంగా చూడవచ్చు. పదాలు పలికేప్పుడు ప్రతి హల్లుతో ఒక అచ్చు తోడుగా వస్తుంది. మన సూక్ష్మదర్శులైన ఋషులు వారి దూరదృష్టితో రచించిన ఈ స్వరాలు శరీరం, మనస్సు మీద చాలా బలమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రపంచంలోని మిగిలిన భాషల కంటే భారతీయ భాషలలోని గొప్పతనం ఏమిటంటే మాట్లాడుతున్నప్పుడు ఒక రకమైన సూక్ష్మ యోగిక వ్యాయామం జరుగుతుంది. అందువల్ల మాట్లాడేవారి శారీరిక, మానసిక ఆరోగ్యాల మీద చాలా బలమైన ప్రభావం ఉంటుంది. అందుకే భారతీయ భాషని దైవ భాష అని పిలుస్తారు.

**మానవుని అంతఃకరణలో తెచ్చెడి పరివర్తన ద్వారా మాత్రమే అతనిలో పరివర్తన వస్తుంది**

## అచ్చులకు సంబంధించిన కొన్ని విశేషాలు

**'అ'** – అన్న స్వరం కంఠం నుండి ఉచ్చరించడం వల్ల హృదయం మీద దాని ప్రభావం పడుతుంది. కాబట్టి ఎన్నిసార్లు 'అ' అని ఉచ్చరిస్తే అన్నిసార్లు హృదయం యొక్క కార్యకలాపాలు వేగంగా జరుగుతాయి. శరీరంలోని అవయవాలన్నిటికీ పరిశుభ్రమైన రక్తం హృదయం ద్వారా అందుతుంది. ఏదైనా అవయవం రోగగ్రస్తమైనప్పుడు, దానికి అందే రక్తం ముందుగానే శుభ్రపరచబడితే దానివల్ల ఆ రోగం పోతుంది. అలా కాకుండా అశుద్ధమైన రక్తాన్నే ప్రవహించనిస్తే రోగం తగ్గదు సరికదా పెరుగుతుంది. 'అ' అక్షరం శుద్ధరక్తాన్ని ప్రవహింపజేస్తుంది. మంత్రశాస్త్రంలో ఈ స్వరానికి రచనాత్మక శక్తి ఉన్నట్లు గుర్తించారు.

**'ఆ'** – స్వరం ఉచ్చరించినప్పుడు ఊపిరితిత్తుల పై భాగం మరియు ఛాతి మీద ప్రభావం పడుతుంది. అది పై మూడు పక్కటెముకల్ని బలవర్థకంగా మార్చి, ఆహారాన్ని తీసుకునే నాళాన్ని శుద్ధపరుస్తుంది. మెదడుని సక్రియపరిచి, బద్ధకాన్ని తరిమికొడుతుంది, ఊపిరితిత్తులను ఉత్తేజితపరచి పై భాగాన్ని శుభ్రపరుస్తుంది. దీన్ని అభ్యసిస్తే ఉబ్బసం, దగ్గు నయమవుతాయి. క్షయరోగులు, చీకట్లోనూ, ఒంగి పనిచేసేవారు ఈ అభ్యాసాన్ని ఖచ్చితంగా చేయాలి.

**'ఇ-ఈ'** – అని సాగదీసి ఉచ్చరించడం వల్ల గొంతు, మెదడు రెండింటిపై ప్రభావం ఉంటుంది. గొంతు, అంగిలి, ముక్కు, హృదయం పై భాగాల క్రియ విశేషంగా ఉత్తేజితమవుతుంది. శ్వాసేంద్రియాలలోని కఫం, శ్లేష్మం మరియు పేగుల్లో పేరుకుపోయిన మలం పూర్తిగా వదిలిపోయిన ఈ అవయవాలన్నీ శుభ్రపడతాయి. శరీర పై భాగం మొత్తం మీద ప్రభావం ఉండడం వల్ల తలనొప్పి హృదయరోగాలకు బాగా పని చేస్తుంది. ప్రత్యేకించి ఎప్పుడూ నిస్తేజంగా, విసుగ్గా, కోపంగా ఉండేవారిపై మంచి ప్రభావం చూపుతుంది.

**'ఉ-ఊ'** – కాలేయం, పొట్ట మొదలైన అవయవాల మీద ప్రభావం ఉండడం వల్ల పొత్తికడుపుపై భారం తగ్గుతుంది. పొత్తికడుపు క్రింది భాగాలలో రోగాలతో బాధపడుతున్న స్త్రీలకు 'ఉ-ఊ' ఉచ్చారణ చాలా లాభదాయకంగా ఉంటుంది. ఎన్నాళ్ళ నుంచి ఇబ్బంది పెడుతున్న మలబద్ధకం అయినా సరే దూరమవుతుంది. స్త్రీల గర్భసంచికి కూడా చాలా ఉపయోగం.

**'ఏ-ఐ'** – యొక్క ఉచ్చారణ వల్ల గొంతు, శ్వాసనాళాల మూల స్థానంపై ప్రభావం పడుతుంది. కిడ్నీని ఉత్తేజపరుస్తుంది. పలుమార్లు ఉచ్చరించడం వల్ల మూత్ర సంబంధ వ్యాధులన్నీ పోతాయి. ప్రత్యేకించి గాయకులు, అధ్యాపకులు, చాలా సేపు మాట్లాడే వక్తలకు చాలా లాభం. నాళాల లోపలి జిగురు పొరలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**'ఒ-ఔ'** – యొక్క ప్రభావం ఉపస్థం మరియు జననేంద్రియాల మీద పడుతుంది. ఉచ్చరించడం బాగా అభ్యసించాక నీరసపడ్డ పేగులు, నరాలు తెరుచుకుని స్వాభావికంగా పనులు చేయడం మొదలుపెడతాయి. ఛాతి మధ్యభాగంలో ఉత్తేజాన్ని కలిగించి నిమోనియా వంటి రోగాల నియంత్రణకు తోడ్పడుతుంది.

**'అం'** – ఉచ్చరించేటప్పుడు నాసిక ద్వారా పీల్చే ఊపిరిలోని ఆక్సిజన్ లేదా ప్రాణవాయువు శరీరంలోని కలుషిత రక్తాన్ని శుద్ధపరుస్తుంది, ఎర్రగా మారుస్తుంది. నాసిక ద్వారా ఊపిరి పీల్చడానికి నాశిక మరియు శ్వాస నాళం ఉపయోగపడుతుంది. కాబట్టి ఈ అవయవాలకి ఎలాంటి వికారాలు, రోగాలు రాకుండా చూసుకోవడం చాలా అవసరం. ఈ ఉద్దేశ్యంతోనే మన మహర్షులు ప్రతి బీజ మంత్రానికి చివరన 'మ్' లేదా అనుస్వరాన్ని జోడించి, దీర్ఘంగా పలకాలని నిర్దేశించారు. స్వరాలను ఉచ్చరించేటప్పుడు నోరు తెరుచుకుంటుంది, 'మ్' లేదా అనుస్వరాన్ని పలికేటప్పుడు పెదాలు మూసుకుంటాయి. మొదట పలికే స్వరాల వల్ల శరీరంలోని వికారాలన్నీ దూరమై, అవి మళ్ళీ ప్రవేశించకుండా 'మ్' అన్నప్పుడు పెదాలనే షట్టర్లు మూసుకుంటాయి.

**'అః'** – అని ఉచ్చరించినప్పుడు నాలుక మరియు అంగిలి అగ్రభాగాన్ని తాకుతుంది. దీనివల్ల మస్తిష్క సంచాలనతోపాటు ఒక రకమైన రసస్రావం జరిగి, అది కంఠం ద్వారా శరీరంలోకి ప్రవేశించి రుగ్మతలన్నింటినీ తొలగిస్తుంది. ఛాతి మరియు గొంతు ఉత్తేజితమై బలవర్థకంగా మారుతాయి.

ఈ విధంగా ఈ స్వరాలన్నీ శరీరంలోని హృదయం మొదలైన ముఖ్య అవయవాలను ఉత్తేజపరిచి, సక్రమంగా సంచాలన జరిపి, రక్తాన్ని శుద్ధిపరచి, సమస్త వికారాలను ఉపశమింప చేస్తాయి. శుభ్రమైన రక్త ప్రసరణ వల్ల నరాలు, ఇంద్రియాలు స్వాభావికంగా తమ తమ పనులు చేస్తుంటాయి. బాహ్య రూప స్వరూపాలు, ఆకార వికారాలు బలపడడంతో పాటు ఆంతరికంగా ఓర్పు, రోగనిరోధక శక్తి వంటి గుణాలు కూడా మెరుగుపడతాయి. తద్వారా ఆధ్యాత్మిక విషయ ప్రవృత్తి కూడా పెరుగుతుంది.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం నుండి*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**భావనాశీలురు తమ భావనలతో కాలగమనాన్ని మారుస్తారు**

# కర్మకాండ ఎందుకు? ఎలా?

*ఇది విశిష్టసమయము! జాగృతులైనవారందరికీ కూడా అసాధారణ లాభము చేకూరగలదు! దేవ-శక్తులు ప్రతికాలము లోనూ తమ అనుగ్రహమును, అనుదాన-వరదానములను ఉదారతాపూర్వకముగా వర్షింపజేస్తూనే ఉంటాయి. అయితే యోగ్యమైన మనోభూమి కలవారికే ఈ లాభము ఒనగూడు తుంది. మీ భావసంవేదలను జాగృతము కావించుకుని యుగ ధర్మము నిర్వహణలో భాగస్వాములవ్వండి అనేదే మా పిలుపు, వినతి, శంఖారావము*

*గురుదేవుల యొక్క ఇంత సారగర్భితమైన ఆలోచనలను శ్రవణము చేసిన పిమ్మట 'అన్ని శంకలకు సమాధానము లభించినది' అని తోచిందంటే నమ్మండి! అంధకారమంతా పటాపంచలైపోయింది. సవితా ప్రకాశము నలుదిశలా వ్యాపించసాగింది. నిజముగానే మహాకాలుడు యుగపరివర్తనా మార్గమును దర్శింపజేస్తున్నాడు. '21 వ శతాబ్దము -ఉజ్జ్వల భవిష్యత్తు' ద్వారము తెరచుకుంటున్నది అన్న విశ్వాసమునకు బలము చేకూరింది!!*

## ముందుమాట

ఈనాడు హిందుసమాజములో కర్మకాండల పట్ల సర్వత్రా అవిశ్వాస వాతావరణము వ్యాపించినట్లు కనబడు తున్నది. చాలా కొద్దిమంది జనులే నిష్ఠ-శ్రద్ధలతో కర్మకాండల విధి విధానములను ఆచరిస్తున్నారు. మిగిలినవారంతా అశ్రద్ధ అనే అంధకారములో తిరుగాడుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతున్నది అనెడి దానిపై దృష్టి సారించవలసి ఉన్నది.

మనము ప్రపంచములోని ఇతర ధర్మ సంప్రదాయములను పరిశీలించినచో వాటిలో ప్రతిదానికి ఏదో ఒకరూపములో కర్మకాండల వ్యవస్థ ఉన్నది, కానీ మన సమాజములో వ్యాపించి ఉన్న విధముగా ఆ సంప్రదాయపు అనుయాయుల మనస్సులో తమ కర్మకాండల పట్ల అవిశ్వాసము లేదు అని తెలుస్తున్నది. బహుశా ఉదార-స్వతంత్రచింతనకు హిందూ ధర్మము ఇచ్చినంత స్వేచ్ఛ ఆ సంప్రదాయములలో ఇవ్వబడక పోవటమే దీనికి గల కారణము కావచ్చు. ఈ ఉదార-స్వతంత్ర చింతనా పరంపర ఈనాడు హిందూ సమాజములో దురుప యోగమవుతూ కానవస్తున్నది. మన మిడిమిడిజ్ఞానము దీనికి మూల కారణము. దీనితోపాటు మనకు దిశాహీనతను కలుగజేస్తూ, చీకటి గుహల్లో తిరుగాడుటకు వివశులను చేసే విలువలు లేని మన దోషపూరితమైన విద్యావిధానమనే మరో కారణము కూడా దీనికి బాధ్యత వహిస్తున్నది.

హిందూ కర్మకాండల పట్ల వ్యాపించి ఉన్న భ్రాంతులను దూరము చేయుటకు మరియు వాటిపట్ల శ్రద్ధాభావనను రేకెత్తించుటకై చాలా తేలికైన, సరసమైన ప్రశ్నోత్తర శైలిలో ఈ పుస్తక రచన సాగింది.

ప్రారంభములో 'కర్మకాండల వివిధ క్రియలు ఎందుకు? ఎలా?' అనే ప్రశ్నలకు జవాబు చెప్పుటకు సరళమైన, లఘు ప్రయత్నము చెయ్యబడినది. దీని తరువాత గాయత్రీ-ఉపాసన యొక్క ఉపాదేయత, గాయత్రీసాధన యొక్క సరళవిధి, ఉపాసన, సాధన, ఆరాధనల త్రివిధ ఉపాయములను మరియు ప్రజ్ఞాయోగమును సైతము సంక్షిప్తముగా తెలియ జెప్పే ప్రయత్నము జరిగింది.

గాయత్రీ పరివారములోని సభ్యులందరూ స్వయంగా ఈ పుస్తకమును తాము చదివి లాభాన్వితులౌతారనీ, ఈ పుస్తక ప్రతులను కొనుగోలు చేసి ఇతర నూతన పరిజనులకు చేర్చు ప్రయత్నమును చేస్తారనీ మేము విశ్వసిస్తున్నాము.

## కర్మకాండ ఎందుకు? ఎలా?

**జపము మరియు సిద్ధి :** మేము మా జీవితములో కఠోరతపస్సు చేసిన అనేకమంది వ్యక్తులను దర్శించాము. కానీ వారెవ్వరి లోనూ పరమపూజ్య గురుదేవులకు ప్రాప్తించిన సిద్ధులు దృగ్గోచరమగుటలేదు. అవకాశమును చూసుకొని ఒకరోజు పూజ్యవరులను మేమిలా ప్రశ్నించాము. 'ఓ గురుదేవా! మీరు గాయత్రీమంత్ర జపము చేశారు. అలాగే ఇతరులెంతోమంది కూడా ఆ 24 అక్షరముల గాయత్రీమంత్ర జపము చేశారు.

మనిషి ఆడంబరాలకు, విలసాలకు తావివ్వక, ఆదర్శాలకు ప్రాముఖ్యతనివ్వాలి. ఇదే మానవీయతకు ప్రతీక

అయితే మీకు ప్రాప్తించిన సిద్ధి ఆ వ్యక్తులకు ఎందుకు ఉపలబ్ధమవ్వ లేదు?

పూజ్యవరులు నవ్వుతూ ఇలా అన్నారు. 'పుత్రా! ముందుగా మేము మా బహిరంగ-అంతరంగములను వికసింప చేసుకున్నాము. ఆ తరువాత ఈ గాయత్రీమంత్ర జపము చేశాము. ఇలా చెయ్యకుండా సమస్త ఆధ్యాత్మిక ఉపలబ్ధులు ప్రాప్తించినా కూడా లభించనట్లే. మా మనస్సును మేము చాకలి వలె బాగా ఉతికి ఆరేశాము. కేవలము జపము చేయుట వలన ఎవ్వరికీ లాభము చేకూరదు.

ఇలా చెప్పిన గురుదేవులు ప్రత్యక్షముగా చూసిన ఒక సంఘటనను వినిపించారు. 'ఇద్దరు మహాత్ములు హిమాలయములలో తపస్సు చేస్తుండేవారు. వారు దిగంబరులు, మౌనులు. వారికున్న కొద్దిపాటి స్థలమును సాగుచేయగా వారికి కందమూలములు, ఫలములు లభించేవి. గుహలో నివాసముండేవారు. కందమూలములు తింటూ జీవితమును గడుపుతుండేవారు. ఒక వేసవికాలములో మహాత్ములిద్దరూ గుహ బయటి ప్రాంతమును శుభ్రపరుస్తున్నారు. తమ తమ గుహల ముందరి ప్రదేశములో ఈ శుభ్రపరిచే కార్యక్రమము ఒకటి రెండు రోజులపాటు సాగింది. ఒకరోజున ఒక మహాత్ముడు మరో మహాత్ముని యొక్క కొద్దిపాటి స్థలమును ఆక్రమించాడు. రెండవ మహాత్మునికి కోపము కట్టలు త్రెంచుకున్నది. వెంటనే బెదిరింపులతో సైగచేస్తూ కోపోద్రిక్తుడైనాడు. ఇద్దరూ మునులే!! వారి ఈ మౌనయుద్ధము పెరిగి పెద్దదై పిడిగ్రుద్దులతో కొట్టుకునే పరిస్థితికి దారితీసింది. ఒక మహాత్ముడు మరో మహాత్ముని చెంప పగులకొట్టాడు. రక్తము ప్రవహించింది.'

పూజ్యవరులు ఇలా అన్నారు. 'హిమాలయ మౌనులు, తాపసులు, గుహలో జీవనాన్ని సాగించే ఈ సాధకుల స్థితి ఇలా ఉన్నదే' అని మాకు ఆశ్చర్యము కలిగింది. ఇటువంటి సాధనను తిరస్కరిస్తున్నాము. స్వ-సంస్కరణ జరుగనంతవరకూ దేనినీ పొందలేము. మనుష్యులు తమను తాము ఉతికి-శుభ్రము చేసుకోనంతవరకు వారికి మంత్రము సిద్ధించదు. ఒకవేళ ఏదోవిధముగా సిద్ధించినా భస్మాసురుని వలె తమను తాము భస్మము చేసుకొనుట తప్ప మరే లాభాన్ని పొందజాలరు. భగీరథుడు లోకమంగళము కొరకు, పరమార్థము కొరకు సమస్తమును త్యజించి తపస్సు చేశాడు. ఆ తపఃశక్తి, సామర్థ్యముతోనే స్వర్గలోకములో ప్రవహించే గంగా ప్రవాహమును గోముఖమునుండి భూమి మీదకు తీసుకొని వచ్చాడు. ఒకవేళ భస్మాసురునికి కూడా ఇటువంటి ఉద్దేశ్యమే ఉండి ఉన్నట్లయితే అతను ఎంతోమందికి మేలొనరించ గలిగేవాడు. 'నేను ఎవరి శిరస్సును చేతితో స్పృశిస్తానో వారు తక్షణమే రోగవిముక్తులు అగుదురు గాక!!' అను వరమును భస్మాసురుడు కూడా శివుని నుండి కోరుకొనవచ్చును. కానీ భస్మాసురుడు తనను తాను సంస్కరించుకొనలేదు. లోభ మోహ వాసనా తృష్ణలు ఉన్నంతవరకూ మనిషి ఉన్నతిని సాధించలేడు. ఈ ఆసురీప్రవృత్తులు మనుజుని పతనోన్ముఖుని గావిస్తాయి.

ఆత్మశోధన యొక్క ప్రాథమిక పాఠశాలలో ఉత్తీర్ణుడైన తరువాతనే అధ్యాత్మము యొక్క తొలిమెట్టుమీద కాలుమోపి మున్ముందుకు సాగిపోగలము. ఆత్మశోధన చేసుకుంటే ఆత్మ వికాస మార్గము తెరుచుకుంటుంది. మేము 24 సంవత్సరముల పాటు బార్లీ రొట్టెలు, మజ్జిగ ఆహారముగా స్వీకరించి జీవించాము. తక్షణము ప్రభావమును చూపించే ఉప్పు, మిర్చి, కారము, మసాలా వంటి పదార్థములను ఉపయోగించలేదు. నాలుకను అదుపులో ఉంచుకున్నప్పుడే జీవాత్మను వశపరచుకొనగలము. మేమిది సాధించాము. స్వాదేంద్రియమును నియంత్రించగలిగితే దశేంద్రియములు, మనస్సు మొదలైనవన్నీ మీకు దాసులౌతాయి. అందువలన సాధకుడు ముందుగా తన మనస్సును ప్రక్షాళన కావించుకోవాలి.

ఇలా సాధన చేసినట్లయితే నిశ్చయముగా భగవంతుడిని పొందగలము. అతను జైనుడైనా, ముస్లిం అయినా, బౌద్ధుడైనా, క్రైస్తవుడైనా లేక హిందువైనా సరే తప్పకుండా దైవమును పొందగలుగుతాడు!

సమాధానపూర్వకమైన పూజ్యవరుల యొక్క ఈ భావనలను విని సంతుష్టులమైనాము. మనస్సులోని అపోహలు సమాప్తమైనాయి. మా అంతఃకరణమును కూడా ఆనాటినుండి పవిత్రమొనరించుకొనుట ఆరంభించి, గురుదేవుల నిర్దేశానుసారము మేము జీవనసాధనా క్రమమును ముందుకు కొనసాగించాము.

*(సశేషం)*

*- అనువాదం: శ్రీమతి లక్ష్మిరాజగోపాలు*

**సానపట్టిన వజ్రం మెరుస్తుంది - కష్టాలనెదుర్కొన్న మనిషి కరుకు తేలుతాడు**

జీవన సాధనకు బంగారు సూత్రములు-1

# సావధానంగా ఉండండి

ప్రకృతి చీకూచింతలు లేని పిల్లల వలె నిరంతరం తన ఆటలలో లగ్నమై ఉంటుంది. పంచతత్వములతో నిండిన ఇసుక, రాళ్ళను ప్రోగుచేయుట, అలంకరించుట, పెంచుట, తగ్గించుట, పాడుచేయుట, ఇవే ఆమె క్రియాకలాపముల కేంద్రబిందువులు. గారడీవాని తమాషా చూస్తూ ప్రజలు ఆ కుతూహలమును కలిగించు దానిని చూచుటకు గుమి గూడుతారు. హస్తకౌశలము, చేతి విన్యాసము యొక్క నైపుణ్యము వారిని ఏవిధంగా ఆనందింప చేస్తుందంటే తాము చేయవలసినవి మరచిపోయి అసందర్భమైన కల్పనలో మునిగి తేలుతుంటారు. ఈ భ్రమ కలిగించే తమాషాలో మనస్సు కూడ సహకరిస్తుంది. నవ్వుట, ఏడ్చుట కూడా జరుగుతుంది.

ప్రకృతి యొక్క ఈ మాయాజాలములో సామాన్య మానవుడు అసాధారణమైన రీతిలో ఇబ్బంది పడుతు, ఉద్విగ్నుడు, ఖిన్నుడు, విపన్నుడౌతూ కనబడతాడు. అప్పుడప్పుడైతే ఇతను సినిమా తెర మీద కనిపించిన దృశ్యముల ద్వారా కూడా ప్రభావితుడై చిత్ర- విచిత్ర అనుభూతులలో తన్మయమైనట్లుగా కనిపిస్తాడు. అయితే మొత్తం నైపుణ్యం కెమెరా, ప్రొజెక్టర్, యాక్టర్, డైరెక్టర్ లచే నిర్మించబడిన వల మాత్రమే. కాని చూచేవాడికి మాత్రం, అతనికి తెరపై చలించే నీడ కూడా నిజమనిపిస్తుంది మరియు దానికే కన్నీరు కారుస్తాడు, చిరునవ్వు నవ్వుతాడు, ఆక్రోశిస్తాడు మరియు ఆవేశ పడుట కూడా గమనించగలము. ఇటువంటి విచిత్రములు, కుతూహలం కలిగించే తమాషాలు, తెలివికల వాళ్ళమనుకునే మనుష్యులను కూడా తమ పట్టులో అసాధారణంగా బిగిస్తాయి.

కళ్ళు తెరుచుకున్నపుడు, మత్తు దిగినప్పుడు, భగవంతుని దర్బారుకు చేరినప్పుడు ఏమిచేశామని అడిగినప్పుడు ఈ పగటి కలలు మనని ఎలా మోసగించాయో తెలుస్తుంది. అప్పుడు ఈ భ్రమలు నెత్తికి ఎక్కి ఎంత దారి మళ్ళించాయో? తమ చుట్టూ మతి భ్రమించిన వాని వలె ఎలా వివశులని చేసి తిప్పుకున్నాయో తెలుస్తుంది.

### చిక్కులలో పడుటకంటే పరిష్కరించుటకు ప్రయత్నము చేయండి

భ్రమను కలిగించే దారులున్న ఈ భవనము నుంచి ఈ మాయాజాలము నుంచి తప్పించుకొనమని తత్త్వదర్శులు హెచ్చరిక చేస్తుంటారు. కాని మూర్ఖత్వమును వదలి బుద్ధిని అనుసరించమనే తెలివిని తలెత్తనీయకుండా చేసే దౌర్భాగ్యమును ఏమనాలి? దేవతలకు దుర్లభమైన మానవజీవితంలోని దుఃఖం కలిగించే వినాశమునకు ఇది పృష్ఠభూమి. ఆశ్చర్యమేమిటంటే చదువు కున్నవారు, చదువులేని వారు, తెలివైనవారు, తెలివిలేని మూర్ఖులు అందరూ గుడ్డి గొఱ్ఱెలవలె ఒకరి వెనుక ఒకరు వెళ్తూ లోతైన గోతులలో పడుతూ దుర్ఘటనలలో చిక్కుకుంటూ ముక్కుతూ మూలుగుతూ ప్రాణం వదులు తుంటారు.

ఇప్పుడు రండి, కొంచెము తెలివితేటలు తెచ్చుకుందాము మరియు తెలివైనవారివలె ఆలోచించడము ఆరంభిద్దాము. మానవజీవనము స్రష్టయొక్క బహుమూల్య సంపద, దానికి స్వయంగా సుసంస్కృతము మరియు ఇతరులను సమున్నతంగా చేయుట అనే రెండు ప్రయోజనాలు అప్పగించబడ్డాయి. దీనికొరకు తనదైన ప్రణాళిక వేరుగా ఏర్పాటు చేసుకోవాలి మరియు తన ప్రపంచాన్ని వేరుగా ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. సాలెపురుగు తనకొరకే గూటిని స్వయంగా నిర్మించుకుంటుంది. దానినే అప్పుడప్పుడు బంధనముగా భావిస్తూ ఉంటుంది, ఏడుస్తూ -మొత్తుకుంటూ ఉంటుంది కూడా, కానీ ఎప్పుడైతే వాస్తవస్థితి అనుభూతి చెందుతుందో అప్పుడు మొత్తము గూటిని ఒక దగ్గరకు చేర్చి దాన్ని ఒక ఉండగా చేసుకుని మ్రింగివేస్తుంది. అప్పుడు బంధనాలన్నీ త్రెగిపోయాయని తెలుసుకుంటుంది. మరియు ఏ స్థితిలో అనేక వ్యథలు, వేదనలూ సహించవలసివచ్చిందో అది శాశ్వతంగా సమాప్తమై పోయిందని తెలుసుకుంటుంది.

ఖచ్చితంగా దీని మాదిరిగానే ప్రకృతిలో ఉన్న రెండవ తథ్యము ఏమంటే ప్రతి మనిషి తన కొరకు తన స్థాయికి

**భ్రష్ట మార్గాన్ని పట్టిన మానవుని బుద్ధి, అతనిని, అతని అనుచరులను కూడా భ్రష్టులగావిస్తుంది**

తగిన ప్రపంచమును తన చేతులతో తనే నిర్మించుకుంటాడు. అదే సాలెగూడులో అతను తన జీవితమును గడుపుతాడు. అందులో వేరెవరి జోక్యము లేదు. ప్రాపంచిక అడ్డంకులు మరియు సౌకర్యాలు వెలుగునీడల వలె వస్తూపోతూ ఉంటాయి. వాటిని నిర్లక్ష్యము చేస్తూ ఏ ప్రయాణీకుడైనా తను కోరిన మార్గంలో నిరంతరము ప్రయాణించగలడు. ముందుకు వెళ్ళేవారి కాళ్ళకు సంకెళ్ళు వేయగల ధైర్యం ఎవరికీ లేదు. మంచి లేక చెడు స్థాయికి చెందిన ఆశ్చర్య జనకమైన పనులు చేసే ప్రతి వారి యొక్క కథ – గాథ ఇలాగే ఉంటుంది. వారు ప్రతికూల పరిస్థితుల సన్నని తెరను తొలగించి తాను అనుకున్నదే చేస్తాడు. మానవుని దృఢ నిశ్చయంతో కూడిన సాహసం ముందు ఎప్పుడు ఏవిధమైన ఆటంకము నిలబడలేదు మరియు ఇకముందు కూడా నిలబడదు. మనిషి అటువంటి ధాతువుతోనే నిర్మించబడ్డాడు. "మనిషి తన అదృష్టమును తానే నిర్మించుకుంటాడు" అనే మాటలో పూర్తి నిజమున్నది. అతనే తన చేతులతో పడిపోవుటకు గోతిని త్రవ్వుకుంటాడు మరియు కోరితే పైకి లేచుటకు పద్ధతిగా ఉన్న మెట్లు గల మీనారును (స్థంభమును) ఎన్నుకోగలడు.

తనను తాను దీన– హీన, దయనీయ, దరిద్ర, అసహజ, అభాగ్య, బాధితులుగా తలచేవారు దుస్సహ పరిస్థితులలో చిక్కుకుని ఉన్నామని అనుకుంటారు. కానీ ఎవరైతే తమలో పైకిలేవగలిగే మహిమాన్వితమైన అంతస్థుకు చేరగలిగే శక్తి ఉన్నదని నమ్ముతారో వారు ప్రతికూలతను అనుకూలతగా మార్చుకొనగలుగుటలో కూడ సమర్థులై ఉంటారు. పైకి లేచుటకు ఎవరినుంచైనా సహాయం పొందవచ్చు మరియు తన పతనమునకు కారణం ఇతరులపై నెట్టివేయవచ్చు. కాని వాస్తవము ఏమిటంటే తన వ్యక్తిత్వము మరియు కర్తృత్వమును ఉన్నతము చేయుటకు మరియు పతనము చేయుటకు తనే బాధ్యుడు అనే సిద్ధాంతము అన్నింటికంటే సరియైనది.

నికృష్టస్థితిలో ఉండేవారి స్థితిపై కన్నీరు కార్చడము అనుచితం కాదు. వారికి సహాయము చేయుటకూడా మానవోచిత కర్తవ్యమే. అలాగే అసహాయులని అనబడేవారి మనోబలము పెంచనంతవరకు, వారిలో పురుషార్థపూర్వకంగా ముందుకెళ్ళే సంకల్పం పుట్టించనంతవరకు, బయటనుండి లభించే సహాయం చిరస్థాయి పరిణామం ఉత్పన్నం చేయలేదని మరచిపోకూడదు. ఉత్కంఠ యొక్క అయస్కాంతశక్తి ఎంత శక్తివంతమైనదంటే దాని సహాయంతో నిశ్చయంగా ప్రగతి యొక్క మార్గమును ప్రశస్తము చేయవచ్చును. ఈ సత్యమును కూడా గుర్తుంచుకోవాలి. "భగవంతుడు కూడా తమకు తాము సహాయం చేసుకునే వారికే సహాయం చేస్తాడు." దీనులు–దుర్బలురైతే ప్రకృతి కూడా వారి చావు వారినే చావనీయమని నిర్లక్ష్యముగా వదిలివేసి ముఖం తిప్పుకుని తన దారిన తాను పోతున్నట్లు చూస్తాము. శాస్త్రకారులు మరియు ఆప్తజనులు ఈ తథ్యమును అడుగడుగునా ప్రతిపాదించారు.

వేదాంతశాస్త్రములో నాలుగు గొప్ప సూత్రములున్నాయి. "తత్త్వమసి", "అయమాత్మా బ్రహ్మ", 'సో–హమ్' "ప్రజ్ఞానం బ్రహ్మ". ఈ నాలుగింటి అర్థం ఒకటే. సంస్కరించబడిన జీవాత్మయే పరబ్రహ్మ. వజ్రం సంస్కరించబడిన బొగ్గు తప్ప మరేమీ కాదు. ఆవిరిగా పైకెగిరిన నీరే స్రావితజలం (డిస్టిల్డ్ వాటర్), దాని శుద్ధతపై నమ్మకముంచి దానిని ఇంజెక్షన్ల రూపంలో వైద్యశాలలో ఉపయోగిస్తారు. మానవుడు దారి తప్పిన దేవత తప్ప మరేమీ కాదు. అతడు తనపై పేరుకుపోయిన మురికిని, మైలను, కషాయకల్మషములను తొలగించి విసిరివేస్తే అతని ముగ్ధమనోహరమైన అతులిత సౌందర్యము చూడ ముచ్చటైనది. గాంధీ మరియు అష్టావక్రుని దృశ్యమాన కురూపత వారి ఆకర్షణ, ప్రతిభ, ప్రామాణికత, మరియు ప్రభావగరిమలో కొద్దిగానైనా తేడా కలిగించలేకపోయింది. మనుష్యుని యొక్క అంతఃకరణ సౌందర్యము వ్యక్తమైనప్పుడు బాహ్యసౌందర్య మాహాత్మ్యం ఏమీ వుండదు.

గీతాకారుడు ఈ సత్యమును అనేక సందర్భములలో నొక్కి వక్కాణించాడు. "మానవుడు తనకు తనే శత్రువు మరియు తనకు తానే మిత్రుడు". మనస్సే బంధనములకు మరియు మోక్షమునకు ఒకే ఒక్క కారణము. "నిన్ను నీవు ఉన్నత స్థాయికి చేర్చుకో, పతనము చెందవద్దు". ఈ వచనములలో–అలంకారము లాంటిదేమీ లేదు. ప్రతి వాక్యము అక్షరసత్యమే. ఒక మహనీయుడు ఇలా అన్నాడు "మనిషి యొక్క ఒక గుప్పిటలో స్వర్గం మరియొక గుప్పిటలో నరకమున్నది. అతను తన కొరకు ఈ రెండింటి నుంచి ఏదో ఒకదానిని తెరుచుటకు పూర్తి స్వతంత్రము కలిగియున్నాడు" *(సశేషం)*

*– అనువాదం: ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

**ఈశ్వరుని ప్రేమ ఎవరిమీద ఉంటుందో వారిని అనేక కష్టాలకు గురిచేసి సంస్కరిస్తాడు**

మనం - మన ఆరోగ్యం

# స్వర్ణిమ ఆరోగ్య నియమాలు

శరీర ఆరోగ్యానికి, బలంగా ఉండటానికి పౌష్టిక ఆహారం, మందులు వాడుతుంటారు. ఏదైనా రోగం వస్తే డాక్టరు దగ్గరకు పరిగెత్తుతుంటారు. ఈ ప్రయత్నంలో పెద్ద ఉపయోగం కనిపించదు, డాక్టర్లను మారుస్తుంటారు. మందులు మారుస్తుం టారు, వారి డబ్బు సమయం వృథా చేసుకుంటుంటారు. కానీ ఆ రోగం అలాగే ఉంటుంది. ఇలాంటి మొండి రోగాలతో బాధపడే వారిని మనం చూస్తూనే ఉంటాము. ధనవంతులు పౌష్టిక ఆహారం తీసుకుంటారని చెప్పుకోవచ్చు. టానిక్కులు విటమినులు, శక్తిని ఇచ్చే మాత్రలు కొని తెచ్చుకుంటారు. కానీ ఇవన్నీ తీసుకునే వారి ఆరోగ్యం ఎంత మెరుగయిందో చూస్తే నిరాశే కనిపిస్తుంది. పౌష్టిక పదార్థములతో బలం వస్తే ధనవంతులు పహిల్వానులు కావాలి. కానీ అలా జరగటం లేదు. పౌష్టిక పదార్థములు తీసుకునేవారు దుర్బలంగా ఎందుకు ఉండాలి? చ్యవనప్రాశ్, శిలాజిత్తు మకర ధ్వజం మొదలైనవి తయారుచేసే వారు, వాటిపై గొప్పగా ప్రకటనలు ఇచ్చేవారు ముసలివారిగా ఎందుకు అవుతున్నారు? కుర్రాళ్ళుగా ఎందుకు ఉండలేకపోతున్నారు? ఆరోగ్యం కొరకు డాక్టర్ల దగ్గరకు పరిగెత్తటంలో మృగతృష్ణ వంటి భ్రాంతికన్నా మరేమి లేదు. మానవ మస్తిష్కంపై కమ్ముకున్న అనేక అంధ విశ్వాసాలలో ఇది చాలా పెద్దది. ఆరోగ్యం కొరకు పౌష్టిక పదార్థములు, రోగ నివారణ కొరకు మందులు తీసుకొనవచ్చు. వీటిని అవసరం వచ్చినప్పుడు తీసుకోవాలి. కానీ వీటి ప్రభావము తాత్కాలికము, స్వల్పము.

ఆరోగ్యం ఆహారంపై, అలవాట్లపై ఆధారపడి ఉంటుంది. వీటిని సవ్యంగా పాటించకపోతే ఆరోగ్య సంపదను పోగొట్టు కుంటారు. దుర్బలత్వం రోగాలు పీడిస్తుంటాయి. ఈ వికృతులను సరిచేసుకోకపోతే ఆరోగ్య సమస్యకు పరిష్కారం లభించదు. వాసనలపై (కోరికలపై), లోభముపై నియంత్రణ సాధించి సంయమ జీవన క్రమం పొందగలిగితే దాని ప్రభావం ఆరోగ్యం మెరుగుపడటంలో చూడవచ్చు. రోగాలకు కారణము సంయమము లేకపోవడమే. ఆహారమును, అలవాట్లను సవ్యంగా నిర్ధారించుకుని పాటిస్తే రోగములు వాటంతటవే దూరమవుతాయి. మందులు అవసరం లేకుండానే రోగాలను వదిలించుకోవచ్చు.

డా॥ లుక్‌మాన్ ఏమి అంటారంటే మనిషి తొందరగా చనిపోవడానికి కారణం అతని నాలుకే అని అంటారు. తిండి రంధి కలిగిన నాలుక ఉపయోగపడని పదార్థాలను పొట్టలో వేస్తుంది, జీవన మరణ సంకటాన్ని ఉత్పన్నం చేస్తుంది.

ఒకసారి ఒక రాజుగారు దారితప్పి వనవాసుల గ్రామానికి వెళ్ళాడు. పరిచయం లేనప్పటికీ ఆ వనవాసులు రాజుగారికి భోజనం, వసతి, వీలయినంతగా సత్కారములు చేశారు. రాజుగారు వారి మంచితనానికి ప్రభావితం అయి అక్కడ ఒక ఆసుపత్రి నెలకొల్పాలని నిశ్చయించుకున్నాడు. ఆసుపత్రి ప్రారంభించారు కానీ ఒక్కరోగి కూడా రాలేదు. రాజుగారు ఆసుపత్రి ఎలా ఉందో చూద్దామని ఒక సంవత్సరం తరువాత వచ్చాడు. ఒక్కరోగి కూడా ఆసుపత్రికి రాలేదని తెలిసింది. ఆ ఊరివారిని పిలిచి ఆసుపత్రిని ఎందుకు ఉపయోగించుకోవడం లేదని అడిగాడు. వారు రోగం రాకపోతే ఆసుపత్రికి వెళ్ళడం ఎందుకని అన్నారు. రోగములు ఎందుకు రావడం లేదని రాజుగారు ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. ఆ గ్రామీణులు ఏమి చెప్పారంటే – "మేము ఎంత ఆకలి ఉన్న ఒక ముద్ద తక్కువ తింటాము. అందువలన రోగములు రావు. ఇంకొకటి మేము ఎంత పరిశ్రమ చేస్తామంటే ఏదైనా రోగం వచ్చినా అది చమటలో కొట్టుకుపోతుంది. రాజుగారికి ఆరోగ్య రహస్యం అర్థమయింది. వారికి ఆసుపత్రి అవసరం లేదని తెలుసుకుని దానిని మూసివేశాడు.

ఎంతోమంది మొదట్లో దుర్బలులుగా, రోగగ్రస్తులుగా ఉన్నప్పటికి వారు తమ పద్ధతులను మార్చుకుని బలవంతులు అయ్యారు. హింద్ కేసరి చందగీరామ్ మొదట్లో క్షయ వ్యాధి సోకి అకాల మృత్యువుకు చేరువయ్యాడు. ఈ పరిస్థితి నుంచి బయట పడటానికి అతని జీవన విధానం పూర్తిగా మార్చు కున్నాడు. ఆ మార్పు వలన రోగం పోవడమే గాక పహిల్వానుల

**మానవత్వం పరిమళించాలన్న అతడు/ఆమె సంకీర్ణత, స్వార్థం, క్షుద్రత తొలగించుకోవాలి**

సరసన చేరాడు. విశ్వవిఖ్యాత పహిల్వాన్ శాండో కూడా మొదట్లో చాలా బలహీనంగా ఉండేవాడు. ఒకసారి కుస్తీ పోటీలకు వెళ్ళి, అక్కడ బలంగా ఉన్న పహిల్వానులను చూసి తన తండ్రితో నేను కూడా అలా అవగలనా అని ఆవేదనతో కూడిన కళ్ళతో అడిగాడు. ఆహారంతో, అలవాట్లలో తగిన మార్పులు చేసుకుని ప్రతి వ్యక్తి దృఢంగా కావచ్చు, దీర్ఘ జీవనం పొందవచ్చని అతని తండ్రి సమాధానం ఇచ్చాడు. శాండో ఏమి చెయ్యాలో తెలుసుకుని వాటిని పూర్తిగా పాటించడంలో నిమగ్నమయ్యాడు. ఫలస్వరూపంగా అతను విశ్వవిఖ్యాత పహిల్వాన్ అయ్యాడు.

గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు అతని పొట్టలో సరిగ్గా ఉండేది కాదు. విరోచనం కావాలంటే ఎనిమా చేసుకొనవలసి వచ్చేది. చాలా రోజులు బ్రతికి ఉండనేమోనని అనిపించేది. పరిస్థితిని మార్చుకోవాలని ఆరోగ్య నియమాలను పాటించారు. 120 సంవత్సరాలు జీవించేందుకు తయారయ్యారు. ఆయన హత్యకు గురికాకపోతే అన్ని సంవత్సరాలు జీవించగలిగేవారు. 30 సంవత్సరాల వయస్సులో అఖండ బ్రహ్మచర్య దీక్ష వ్రతం తీసుకుని తన జీవన శక్తిని అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నారు. ఆ ఓజస్సు బలం వలన మహా మానవుల పంక్తిలో చేరగలిగారు.

లోకమాన్య తిలక్ కూడా చిన్నప్పుడు చాలా బలహీనంగా ఉండేవాడు. ఆహారంలో, అలవాట్లలో మార్పు చేసుకుని మంచి బలం ప్రాప్తించుకున్నాడు. ఇలాంటి ఉదాహరణలు అనేకం కనిపిస్తాయి.

ప్రాచీన కాలంలో హనుమంతుడు, భీష్ముడు పాటించిన బ్రహ్మచర్య ఉదాహరణలు కనిపిస్తాయి. ఋషుల ప్రదేశంలో అక్కడి కష్టసాధ్య పరిస్థితులలో, లోటుపాట్లతో జీవనం చేస్తూ కూడా సంయమం యొక్క ప్రభావం వలన సుదృఢమైన దీర్ఘ జీవనం ప్రాప్తించుకున్నాడు. స్వామి దయానంద సరస్వతి బలం సుప్రసిద్ధం. ఒకసారి ఇద్దరు బలవంతులైన వ్యక్తులు కొట్టుకోవడం చూసి వారి జుట్టుపట్టుకుని బలపూర్వకంగా విడిపించారు. ఇది వారి బ్రహ్మచర్యం యొక్క ప్రతాపమే. అడవులలో ఉండే భిల్లులు సమయశీలురవడం వలన జీవించినంత కాలం బలంగానే ఉంటారు. ఆరోగ్య సూత్రాలను ఉల్లంఘించకపోతే భగవంతుడు ఇచ్చిన ఆరోగ్యాన్ని జీవితమంతా తరగకుండా చేసుకోవచ్చు.

సుకారాత్తుని ఎవరో అడిగారు. కామ సేవనం ఎన్నిసార్లు చేయవచ్చు? జీవితంలో ఒకసారి చాలు. దీనితో జీవితాన్ని నాశనం చేసుకోవడం తప్ప మరేమి జరగదని సమాధానం ఇచ్చాడు. ప్రశ్నకర్త సంతుష్టుడవలేదు. దానితో ఆయన ఇష్టం ఉన్నదో లేదో సంవత్సరానికి ఒక్కసారి మాత్రమేనని అర్థం చేసుకోవాలి అని అన్నాడు. ప్రశ్నకర్తకు ఇంకా సంతృప్తి లేదు. అధికాధికంగా నెలకు ఒక్కసారని ఆలోచించాలి అని అన్నాడు. ప్రశ్నకర్తకు ఇంకా తృప్తి లేదు. సుకారాత్ కోపంతో ఇలా అన్నాడు – "నీకు నచ్చినట్టు ఉండు కానీ చావడానికి సిద్ధంగా ఉండు".

ఈ మాటలు కేవలం కామసేవనం మీదే కాదు, అన్ని ఇంద్రియ భోగాలకు వర్తిస్తుంది. సంపాదన కంటే ఖర్చు ఎక్కువ అయితే ఆ అపవ్యయం వలన నష్టం కలుగుతుంది. చిచ్చుబుడ్డి వెలిగినట్టు వెలిగి జీవన క్షేత్రంలో ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రెండు ముఖ్య సూత్రాలు ఉన్నాయి. కఠోరమైన శ్రమ చేసి బాగా అలసిపోవాలి. గాఢంగా నిద్రపోవాలి. బాగా ఆకలివేసినప్పుడే తినాలి. అప్పుడో ఏమి తిన్నా బాగుంటుంది, బాగా జీర్ణమవుతుంది.

శారీరిక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ స్వర్ణిమ సూత్రములు అందరికీ ఉపయోగపడతాయి.

– *అనువాదం: ముక్కామల రత్నాకర్*

## యుధిష్ఠిరుని ప్రేరణ

*యుధిష్ఠిరుడు పాండవులలో పెద్దవాడు. ఆయన సర్వకాలసర్వావస్థల్లోను పెద్దలపట్ల వినయం కలిగి గౌరవంతో మెలిగేవాడు. మహాభారత యుద్ధం ఆరంభంలో కూడా ఈయన యుద్ధభూమిలో భీష్మ పితామహుని, గురువైన ద్రోణాచార్యుని కలిసి ప్రణామంచేసి వారి ఆజ్ఞను, ఆశీర్వాదాన్ని స్వీకరించాడు. కుటుంబంలో పెద్దవాడైన యుధిష్ఠిరుని ఆచరణ ప్రభావం మిగిలిన వారిపై ఎంతగా పడిందంటే వారు ఎలాంటి పరిస్థితులలోను, చివరకు ప్రాణాపాయ పరిస్థితిలో కూడా అన్న ఆజ్ఞను మీరలేదు. అందుకే అజేయులై నిలిచారు.*

– *ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**దైవశక్తితో కూడిన బుద్ధిబలము - సంఘటనా బలము తమ ప్రభావాన్ని రానున్న కాలంలో చూపిస్తాయి**

చేతనత్వ విజ్ఞానం-1

# ఆలోచనల వ్యాపకత్వం, శక్తి

ఒకే రకంగా ఆలోచించే వ్యక్తులు ఉన్న ప్రదేశంలోని వాతవరణంలో ఒక ప్రత్యేకత ఉంటుంది. సామూహిక ఆలోచనా శక్తికి ఒక విశేషమైన సామర్థ్యం ఉంటుంది.

స్మశానంలో భయం కలిగించే వాతావరణం ఉంటుంది. అక్కడ దహన సంస్కారములు జరుగుతుంటాయి. అక్కడికి వచ్చే వారిలో ఎక్కువ మంది వేదనతో, శోకంతో ఉంటారు. క్రమక్రమంగా అక్కడ ఉన్న చెట్లు చేమలు ఆ సంస్కారాలను గ్రహిస్తాయి. అక్కడికి వెళ్ళేవారికి అక్కడ ఒక విశేషమైన నిశ్శబ్దం అనుభవంలోనికి వస్తుంది. కసాయిలు జంతువులను నరుకు తుంటారు, కోస్తుంటారు. చంపబడుతున్న ప్రాణులు బాధతో విలవిలలాడుతుంటాయి. అక్కడ ఉండేవారిలో ఉద్విగ్నత కలుగుతుంది, వారు హాయిగా కూర్చోలేరు, అశాంతి అనుభవంలోనికి వస్తుంది.

సైనికులు దగ్గర ఉంటే దుర్బల మనస్సు గల వ్యక్తులకు కూడా ఉత్సాహం వస్తుంది. అశ్లీల వాతావరణంలో మంచి వ్యక్తులు కూడా కాముక దిశలో వెళ్ళేందుకు ఆలోచిస్తారు. కొంతమంది దృఢమైన మనస్సుగల వ్యక్తులు ఆ వాతావరణ ప్రభావం తమ మీద పడకుండా చూసుకోగలరు. ఆత్మవిశ్వాసం గల వ్యక్తులు ఏకాకిగా ఉన్నప్పటికి తాము ఎంచుకున్న మార్గంలో నడుస్తారు. మామూలు వ్యక్తులు గాలి ఎటు వీస్తుంటే అటు కొట్టుకుపోతారు. యుద్ధ వాతావరణంలో అప్పుడు అక్కడ ఉన్న ఆలోచనల ధారతో ప్రేరేపింపబడి అనేక మంది సైన్యంలో చేరడానికి, శత్రువులతో యుద్ధం చేయడానికి సిద్ధపడు తుంటారు. మనస్సు యొక్క నిర్దేశం ద్వారానే శరీరం యొక్క విభిన్న అవయవములు పనులు చేస్తుంటాయి.

మంచి చెడు పనులకు వ్యక్తి యొక్క ఆలోచనలే కారణం. ఈ ఆలోచనలు ఇతరులను కూడా ప్రభావితం చేస్తాయి. పిల్లలపై తల్లిదండ్రుల, అధ్యాపకుల ప్రభావం విశేషంగా పడుతుంది. ఆ ప్రభావముల ప్రేరణతో పిల్లల నడవడిక ఉంటుంది.

ఒకే రకం ఆలోచనలు గల వ్యక్తులు ఒకచోట చేరుతుంటారు. లలితా సహస్ర నామములు పారాయణ చేసేవారు ఒకచోట చేరతారు. విష్ణు సహస్రనామ పారాయణ చేసేవారు ఒకచోట చేరతారు. అలాగే పేకాట ఆడేవారు ఒక చోట చేరితే, త్రాగుబోతువాళ్ళు మరోచోట చేరతారు.

ఎవరైనా ఆదర్శవాదులు ఆలోచనా ధారలు అంతరిక్ష మంతటా వ్యాపింపచేస్తే ఏకత-సమతల వాతావరణం సహజంగానే ఏర్పడుతుంది.

## ఆలోచనల ప్రవాహంతోనే ప్రఖర వ్యక్తిత్వం నిర్మించబడుతుంది

ఆలోచనలలో, భావనలలో ఉత్కృష్టతే అభ్యుదయానికి ప్రముఖ ఆధారం ఆలోచనలు విధేయాత్మంగా (positive) లేక నిషేధాత్మకంగా (negative) ఎలా ఉంటే అలా వ్యక్తిత్వం తదను రూపంగా తయారవుతుంది. నిషేధాత్మక ఆలోచనలు మనిషి యొక్క ఆంతరిక శత్రువులు. జీవనక్రమమును అస్తవ్యస్తం చేసే ఈ ఆలోచనలను రాక్షసులుగా పరిగణించవచ్చు. బాహ్య ప్రపంచంలో ఉన్న శత్రువులు ఆర్థికమైన, శారీరకమైన హాని చెయ్యగలరు. కానీ ఆంతరిక శత్రువులు మస్తిష్కాన్ని పాడుచేస్తారు. ఈ ఆంతరిక శత్రువులు మిత్రుల వలె కనిపిస్తుంటారు, ఆనందం ఇస్తున్నట్లు భ్రమింపచేస్తారు, చివరికి పతనంలోకి చేరుస్తారు. జీవన చక్రాన్ని అస్తవ్యస్తం చేసే ఈ ఆలోచనలను దైత్యశ్రేణిలో ఉంచాలి.

విధేయాత్మక (positive) ఆలోచనలతో ముందుకు వెళ్ళగలుగుతారు, ఎత్తుకు ఎదుగగలుగుతారు. ఇలాంటివారు తమ సమస్యలకు తామే స్వయంగా సమాధానం వెతుకుతారు, పరిస్థితిని అనుకూలం చేసుకునేందుకు మానసికస్థితిని మార్చుకోవడంలో పారంగతులవుతారు. అతని ఆలోచనా పరిధి అనంతంగా ఉంటుంది.

కానీ ఆలోచనతో మానవ వ్యక్తిత్వ నిర్మాణం జరుగదు దానికి తగిన పనులు కూడా చేయాలి. చాలామంది ఉదాత్తమయిన ఆదర్శవంతమైన ఆలోచనలు చేస్తుంటారు. కానీ

సద్జ్ఞాన కర్మల సమన్వయమే ప్రగతికి మూలం

వారు దానికి తగిన పనులు చేయరు. ఆలోచనలు పవిత్రంగా ఉన్న ఆచరణ పవిత్రంగా లేకపోతే ఏమిటి లాభం? కొంతమంది సత్యవాదులుగా, ఆదర్శవంతులుగా ధర్మ పరాయణులుగా కనిపిస్తారు కానీ లోపల కలుషితమైన ఆలోచనలే ప్రవహి స్తుంటాయి. ఆలోచనలు, వ్యవహారం రెండు ఉత్కృష్టమైనవిగా, పవిత్రమైనవిగా ఉండేవారే మహనీయులుగా కీర్తింపబడతారు.

ఏ ఆచరణ అయినా ఆలోచనతోనే మొదలవుతుంది. వాటి స్థాయిని బట్టి వ్యక్తిత్వం తయారవుతుంది. రచనాత్మక ఆలోచనలను ఎంతవరకు పాటించగలిగితే అంతగా అతను సదాచారి, పురుషార్థి, పరమార్థిగా చెప్పవచ్చు. ఈ ఆధారం గానే సుఖశాంతులు లభిస్తాయి. ఆలోచనలు దిగజారితే వ్యక్తిత్వ వికాసం కుంటుపడుతుంది. ఇలాంటి పరిస్థితిలో అనౌచిత్యమైన క్రియాకలాపాలలో మునిగిపోతాడు.

ఎమర్సన్, ఐన్‌స్టీన్ వంటివారు వారి కొత్త ఆలోచనా తీరుతో ప్రపంచానికి కొత్త దిశాధార ఇచ్చారు. వీరు మానవశక్తులతో ఆలోచనా శక్తికి చాలా మహత్వం ఉన్నదని ఉద్ఘాటించారు ఒక ఆలోచనాపరుడు లక్షల, కోట్ల మందికి నాయకుడు కాగలడు. ఇలాంటి సామర్థ్యం ఉన్న వ్యక్తి సాధనములు లేనప్పటికి ప్రగతి యొక్క మర్మాన్ని తెలుసుకున్నందువలన ఉన్నతి సాధిస్తాడు. విధేయాత్మక దిశధారను స్వీకరించి మహాపురుషులతో కూడిన దేశాన్ని నిర్మాణం చేస్తారు. ఈ సామర్థ్యం వల్లనే వ్యక్తి కఠినాతికఠినమైన భవబంధనాలను దాటి ఆత్మసాక్షాత్కారం చేసుకుంటారు. స్కూళ్ళలోని కాలేజిలలోని చదువుకు వీటికి సంబంధం లేదు. తపశ్చర్య, యోగసాధనల ద్వారానే వీటిని సాధించగలుగుతారు.

స్కూళ్ళు, కాలేజీలలో చదవడం వలన కుశలత, అధిక సంపాదన లాభం ఉంటుంది. కానీ ఉచ్చస్తరీయ వ్యక్తిత్వాల నిర్మాణం ఆలోచనల వికాసంతోనే సాధ్యమవుతుంది. ఉత్కృష్ట ఆలోచనలు ఎక్కడ ఉంటాయో అక్కడ స్నేహ సౌజన్యములు, వికసిస్తాయి.

సామాన్యుల దృష్టిలో దార్శనికులు, ఆలోచనాపరులు, సంతులు, మనీషులు, కళాకారులు లేమిలో ఉన్నట్లు కనిపిస్తారు. కానీ సంపన్నుల కన్నా తృప్తితో, సుఖంగా, శాంతంగా జీవిస్తుంటారు. దీనికి ఒకటే కారణం సామాన్యులు సంపదలను కూడబెట్టడంలో నిమగ్నమయితే మహామానవులు మానసిక సాధన, లేక ఆలోచనల పెంపొందించుకొనుటలో నిమగ్నమై ఉంటారు. వికృతమైన ఆలోచనల దుష్పరిణామమును అర్థం చేసుకుని మంచి పద్ధతులను అవలంభించి కష్టములను నుంచి నివృత్తి పొందుతారు. పరమాత్మ మనిషిని సమన్వయవాది, మానవతావాది దృష్టికోణముతో సృష్టించాడు. ఇలాంటి ఆలోచనలకు మనీషులు కల్పవృక్షం అనే ఉపమానం ఇచ్చారు. ఇటువంటి వారిలో వారి అవసరాలను అన్నింటినీ తీర్చుకునే సామర్థ్యం ఉంటుంది.

శుభమైన, దృఢమైన ఆలోచనలతో సాత్విక భావములు అభివృద్ధి అవుతాయి. ఆచరణ ఉదాత్తంగా ఉంటుంది. మానసిక శక్తి యొక్క వికాసం జరుగుతుంది. సద్గుణములు ప్రాప్తిస్తాయి. సాధనా స్వాధ్యాయం, సంయమం సేవా అనే ఉపాయ ఉపాచారాలతో ప్రఖరమైన ప్రతిభాశీలుల నిర్మాణం, ఉజ్జ్వల భవిష్య నిర్మాణం జరుగుతుంది.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 22 (1.1) నుండి*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

## పూజ్యగురుదేవుల ఆలోచనల శక్తి

*యుగ ఋషి వేదమూర్తి తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్యుని ఆలోచనలు నేటి అలసిసొలసిన భయభ్రాంతులతో నిండిన మానవాళికి నూతన జీవితాన్ని ప్రసాదించెడి "సంజీవని". ఎవరైతే వీరి సాహిత్యాన్ని అనునిత్యం పఠిస్తూ మనన చింతన చేస్తూ ఉండెదరో అట్టివారి మనస్సులలో ఎల్లవేళలా ఆశను, ఉత్సాహాన్ని, వివేకాన్ని, సాహసాన్ని తరంగాలుగా వ్యాప్తి చేస్తుంది. అట్లే ఆచార్యుల వారి ఆలోచనలు స్వాధ్యాయం చేసెడివారిని నిరంతరం వివేక శీలురునుగా మరియు సంస్కారవంతులనుగా రూపొందిస్తూ అత్యంత శ్రేష్ఠ మార్గంలో ప్రథమ పంక్తిలో ఆసీనులను గావిస్తాయి. పరమపూజ్య ఆచార్య గురుదేవుల ఆలోచనల జీవన మార్గంలో పయనించెడివారికి ఇది సురక్షితం మరియు లాభదాయకం. మీరు మిక్కిలి వారిని దారితప్ప నివ్వదు – ఇది సత్యం.*

*– ప్రజ్ఞా అభియాన్, 1 ఫిబ్రవరి 2015*

*అనువాదం: ఎ. శారద*

**ఉదారత, పవిత్రత, సహకారిత ఈ ప్రపంచాన్ని సుఖంగా సమున్నతంగా, సుందరంగా చేస్తాయి**

అతీంద్రియ విజ్ఞానం-1

# అతీంద్రియ శక్తుల యొక్క పృష్ఠభూమి

అతీంద్రియజ్ఞానము ప్రస్తుతము వైజ్ఞానికముగా నిరూపించబడిన సత్యము. సాధారణముగా జ్ఞానేంద్రియముల సహాయముతోనే మనము జ్ఞానమును సముపార్జించు కుంటాము. కానీ ఇప్పుడు 'ఆరవ-ఇంద్రియము' కూడా విశ్లేషించవలసిన అంశముగా స్వీకరించబడినది. ఒక్కొక్కసారి మానవుడు ఇంద్రియ జ్ఞానమునకు సంబంధించిన పరిధిని పూర్తిగా దాటిన విషయములను కూడా తెలుసుకొనగలుగు తుంటాడు. అమెరికాదేశమునకు చెందిన మానసిక వైద్య నిపుణులు డా॥ ఎణురీనా తాను వ్రాసిన 'బియాండ్‌టెలీపతీ' అనే పుస్తకములో ఎంతోమంది వ్యక్తులు వివిధ సమయము లలో, ఎంతో దూరములో ఉన్న ప్రదేశములలో జరిగిన సంఘటనల గురించి ఎటువంటి ప్రసారసాధనాలు లేకుండానే సులభముగా తెలుసుకొనగలిగిన సందర్భములను గురించి వివరించారు.

ప్రఖ్యాత చరిత్రకారుడు 'హిరోడోటస్' క్రీ.పూ. 546-560 సంవత్సరముల మధ్యకాలమునకు చెందిన లీడియారాజైన క్రోశస్ గురించి వివరముగా లిఖించాడు. ఎవరైనా మంచి జ్యోతిష్యుని సహాయముతో శత్రువుల బారినుండి తప్పించు కొనవలెనని రాజు ఆలోచించాడు. మంచి జ్యోతిష్యుడిని వెదికే క్రమలో రాజు ఆ సమయములో ప్రముఖులైన ఏడుగురు జ్యోతిష్యవేత్తల వద్దకు తన దూతలను పంపి, వాళ్ళు ఆ ఫలానా జ్యోతిష్కుడిని కలిసిన సమయములో సరిగ్గా ఈ సమయములో రాజైన క్రోశస్ ఏమిచేస్తూన్నాడు? అని ప్రశ్నించి, వారు ఇచ్చిన సమాధానమును తనకు చెప్పవలసినదిగా ఆదేశించాడు. దూతలు జ్యోతిష్కులను కలిసిన వేర్వేరు సమయములలో ఇక్కడ అంటే రాజభవనములో తానేమి చేస్తున్నదీ వ్రాసి ఉంచు కున్నాడు.

ఆరుగురు జ్యోతిష్కులు చెప్పిన సమాధానములు 'తప్పు'గా ఋవువైనాయి. ఉత్ఫీ అనే ఏడవ జ్యోతిష్కుడు చెప్పినది అక్షరాలా నిజమైనది. దూతలు తన వద్దకు రాగానే 'క్రోశస్ ప్రస్తుతము ఒక ఇత్తడిపాత్రలో తాబేలు, గొఱ్ఱె... ఈ రెండింటి మాంసముల మిశ్రమమును వేయిస్తున్నాడు' అని చెప్పాడట. ఆ సమయములో రాజు సరిగ్గా అదే చేస్తున్నాడు కాబట్టి సంతోషముతో అతడిని పిలిపించి అతడి సలహాలు, సూచనలను పాటించి శత్రువుల బారినుండి తప్పించుకున్నాడు.

ఇటలీలోని 'ఆలోఫోన్స్‌సలిగాదరీ' అనే ఫాదర్ (పోప్) సుప్తచేతనావస్థలో ఒక పగటికల కన్నాడు. కానీ ఆ కల నిజమైనది. సరిగ్గా అతడు కలగన్న సమయములోనే రోమ్ యొక్క పెద్దపోప్ స్వర్గస్థుడైనాడు. ఆ సంఘటనను గురించి ఈక్రింది వివరణ ఇవ్వబడినది.

ఆరోజులలో అంటే క్రీ.శ. 1774లో రవాణా సౌకర్యములు గానీ, తంతితపాలావంటి ప్రసారసాధనాలుగానీ ఇప్పుడున్నంత బాహుళ్యముగా లేవు. అంత దూరంలో జరిగిన ఆ సంఘటన గురించి ఆయన తన శిష్యులకు చెప్పినప్పుడు ఎటువంటి ఆధారమూ లేకపోవడముచేత ఆ సమాచారమును ఎవ్వరు విశ్వసించలేకపోయారు. 'పెద్దపోప్ ఎలాంటి అస్వస్థతకూ లోనుకాలేదు. మరి ఇంత అకస్మాత్తుగా పోప్ మరణం ఎలా సంభవము?' అనుకున్నారు. కానీ కొన్నిరోజుల తరువాత లిగాదరీ ఎలా వర్ణించి చెప్పాడో సరిగ్గా అదే సమయములో, అదే స్థితిలో పెద్దపోప్ మరణించినట్లు అసలైన సమాచారము అందినది.

స్వీడన్‌కు చెందిన 'ఇమేనుఅల్ స్వీడన్ వర్గ్' అనే సాధకుడు అక్కడకు కొన్ని వందల మైళ్ళ దూరంలో జరిగిన ఒక భయంకరమైన అగ్నిప్రమాదము గురించి తన స్నేహితులకు వర్ణించి చెప్పాడు. అంతేకాదు ఆ అగ్నిప్రమాదములో గాయపడిన, మరణించిన వ్యక్తుల పేర్లుకూడా వెల్లడించాడు. తరువాత అతడు చెప్పిన వివరాలు అక్షరములా సంభవించినట్లు ఋజువైనది. క్రీ.శ 1859 లో జరిగిన సంఘటన ప్రామాణిక సంఘటనల జాబితాలో చోటుచేసుకున్నది.

తప్పిపోయిన మనుష్యుల గురించిగానీ, పోగొట్టుకున్న వస్తువులను గురించిగానీ అతీంద్రియశక్తి సంపన్నులైన వ్యక్తులు మనకు ఇచ్చిన సమాచారము సరియైనదే అని నిరూపించ

**స్వ-సంస్కరణ జరుగనంత వరకు దేనిని పొందజాలం**

బడినప్పుడు 'ప్రత్యక్షసాధనాలు, ఇంద్రియజ్ఞానము సహాయముతో మనము తెలుసుకొనగలిగిన విషయములు కొంతమేరకు పరిమితమని, మానవుడి రహస్యమయశక్తుల సహాయముతో సాధారణముగా అసంభవము అనిపించే విషయములను గురించి కూడా ఎంతో తెలుసుకొనవచ్చు' అని అంగీకరించ వలసి వస్తుంది.

విజ్ఞానవేత్త అయిన డా॥ మేరేబర్సటీన్-లేడీవండర్ అనే వ్యక్తిని గురించి ఒక మిత్రుని ద్వారా విన్నాడు. దీనికన్నా ముందు కొంతకాలం క్రితం డా॥ మేరే ఒక విమాన ప్రయాణములో తన సామానంతా పోగొట్టుకున్నాడు. ఆ సామానులో కొన్ని విలువైన కాగితములున్న పెట్టె కూడా ఒకటి ఉంది. విమానానికి చెందిన సంస్థ డా॥ మోరేకు పోయిన సామాను ఎక్కడా దొరకలేదనీ, అందుకు తగిన పరిహారము చెల్లిస్తామనీ ప్రకటించినది. అతను అందుకు అంగీకరించక దయచేసి తన సామానును వెదకటము ఇంకొంతకాలము కొనసాగించమని అడిగాడు.

ఇప్పుడు మిత్రుడు చెప్పిన లేడీవండర్ గురించి విన్న తరువాత డా॥ మోరేకు ఇంకా ఆలోచన పెరిగిపోయింది. లోలోపల జిజ్ఞాస అధికమైనది. వెంటనే ఆయన లేడీవండర్‌ను కలవటానికి బయలుదేరాడు. లేడీవండర్ దగ్గరకు వెడుతూనే ఆయన మొట్టమొదట 'పారిస్‌లో నేను పెంచుకుంటున్న పిల్లి పేరేమిటి?' అని అడిగాడు. లేడీ వండర్ ఆయనను ఆశ్చర్యమునకు గురిచేస్తూ 'భతినీ' అని సమాధానమిచ్చింది. తరువాత ఆయన తన సామానును గురించి ప్రశ్నించాడు. మీ సామానంతా విమానాశ్రయములో సురక్షితముగా ఉన్నది' అన్న సమాధానం వచ్చింది. ముందర మోరేకు నమ్మకము కలుగలేదు. న్యూయార్క్ విమానాశ్రయమంతా ఇదివరకే గాలించబడినది. ఐనా మోరే అక్కడి అధికారులకు ఫోన్‌చేసి 'మహాశయా! బాగా నమ్మదగిన వ్యక్తులనుండి మాకు సమాచారము అందినది. మా సామానంతా విమానాశ్రయములోనే ఉన్నదని చెప్తున్నారు. దయచేసి మరొక్క సారి వెదికించండి' అని అడిగాడు. అధికారులు వెదికారు. సామాను దొరికింది.

న్యూజెర్సీకి చెందిన ఆత్మవేత్త అయిన ఫ్లోరెన్స్ అనే మహిళ ఏ వస్తువునైనాసరే స్పృశించి దాని తాలూకు వ్యక్తికి సంబంధించిన సమాచారమునంతా చెప్పగలిగేది. అందులో 80% విషయములు సత్యమని ధృవీకరించబడేవి. తప్పిపోయిన లేదా మిస్సయినవాటిని వెదకటములోనూ, హత్యా పరిశోధన లలోనూ, ఇంకా ఇతర అన్వేషణలలోనూ రక్షకభటులు ఆమె సహాయమును తీసుకునేవారు.

భవిష్యత్తును గురించి తెలుసుకొనగలిగే ఈ శక్తి కొంత మంది వ్యక్తులలో అసాధారణరీతిలో వృద్ధిచెందుతూ ఉంటుంది. రెండవ ప్రపంచమహాయుద్ధములో ఇలాంటి వ్యక్తుల యొక్క శక్తిని రెండువైపులవారూ వినియోగించు కున్నారు. హిట్లర్ యొక్క సలహామండలిలో దివ్యదర్శులైన ఇలాంటి వ్యక్తులు ఐదుగురు ఉండేవారు. విలియ్‌క్రాఫ్ట్ వారికి నాయకుడు.

ఇంద్రియశక్తి మనకు దైనందినజీవితమును నిర్వహించు కొనుటలో ఎంతో ఉపయోగకరమైన పాత్ర వహిస్తూంటుంది. అదే కనుక లేకపోతే మనం జీవించియున్న మాంసపుముద్ద వలె అటూఇటూ తిరుగుతూ మృత్యువును చేరుకుంటాము. మానవీయ ప్రగతిలో అది సంస్కరించబడటములో జ్ఞానేంద్రియ-కర్మేంద్రియములే ప్రధానపాత్ర వహిస్తున్నాయి.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 17 (11.1) నుండి*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## పెద్దవారి బాధ్యతలు

*లోనికి నెట్టుకుంటూ వస్తోన్న ఒక త్రాగుబోతును చూచి దళాధిపతి హసన్ "మూర్ఖుడా సర్దుకో, నిలద్రొక్కుకో లేని పక్షంలో ఎన్నడూ బయట పడలేనంతగా ఇరుక్కుపోతావ్" అని హెచ్చరించాడు. దానికి త్రాగుబోతు నవ్వి "నేను ఒంటరివాణ్ణి, నావల్ల జరిగిన పొరపాటుకు శిక్షను నేను ఒంటరిగానే అనుభవిస్తాను. కానీ మీరలాకాదు. మీరు చేసేపొరపాటుకు మీతోపాటు, మీ అనుయాయులు, ఆశ్రితులు అనుభవించవలసి ఉంటుంది" అని పలికి ముందుకు సాగిపోయాడు. విజ్ఞుల బాధ్యతలు అతి ఉత్కృష్టమైనవి. సాధారణ వ్యక్తుల కంటే వారు ఎన్నో రెట్లు సావధానులై విధి నిర్వహణను చేయాలి.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**లోభమోహ వాసనా తృష్ణలు ఉన్నంతవరకూ మనిషి ఉన్నతిని సాధించలేడు**

బోధ కథ

# శ్రమ యొక్క ఫలితం

ఒకసారి స్వర్గవాస దేవతలు భూమి మీద పరిశీలించుటకు రావటం జరిగింది. వారు భూలోకవాసులు తమను గొప్పగా స్వాగతిస్తారని ఆశించారు.

ఆ రోజుల్లో పొలాల్లోని పంటలు పచ్చగా కళకళలాడుతూ కంకులు బయటకు రావటం చూసిన ప్రజలు పంట దిగుబడి ఈసారి బాగా ఉంటుందని ఎంతో ఆనందిస్తున్నారు. నలు ప్రక్కల అంతా మస్తీగా సంతోషాలు పొందుతూ, ఎక్కడ చూసినా వసంతోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

దేవతల వైపు ఎవ్వరూ కన్నెత్తి కూడా చూచుట లేదు. వారు ఆశిస్తున్న స్వాగత-సత్కారాలు ఎక్కడా అగుపడుట లేదు. వరాలు ఇద్దామని గర్వంతో వచ్చినవారు, భూవాసుల ప్రవర్తనతో మ్రాన్పడిపోసాగారు.

అభావగ్రస్తులైన మానవులు తమకు కావలసిన వరాలను తమ ద్వారా పొందుటకు ఎగబడగలరని, ఇంకా ఏదేదో కోరతారని వీరు అనుకొన్నారు. యాచకుల కోర్కెలను తీర్చేవారు ఎప్పుడూ కీర్తిని పొందుతూ మాన్యులుగా ఉంటారని అనుకొంటున్నారు. ఇటువంటి కీర్తిని పొంది ఆనందించాలనే కోరికతో ఈ దేవతలు భూమి మీదకు వచ్చారు. ఎవరికి వరదానాన్ని ఇచ్చు శక్తి ఉంటుందో, అలాంటివారు ఆశించుట ఉచితమే.

దేవతలందరికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. వారు భూదేవిని ఇలా అడిగారు. "ఇంతకూ ఈ మానవలోకంలో కూడా ఏదో ఒక దేవత నివసిస్తుందా? అది మాలాగానే సమర్థులారా? అటువంటి విషయం మాకింతవరకు తెలియదు. ఒకవేళ అటువంటిది ఉంటే దాని పేరేమి? దాని నివాసమెక్కడో చూపు?

భూమాత చిరునవ్వు నవ్వింది. ఆమె ఒక మనిషిని తన వద్దకు పిలిచి.. అతని అరచేతిని చూపుతూ ఇలా అంది. "ఆ దేవత ఇక్కడుంది. ప్రతి పంట భూమిలో దాని యొక్క విభూతియే విస్తరించి ఉంది. నా పుత్రులందరి పాలన-పోషణ దాని ద్వారానే జరుగుతుంది. సంపద, సమృద్ధి, సఫలత ఇంకా ప్రగతి అంతా కూడా దాని ద్వారానే లభిస్తుంది.

అరచేతిలో వసించేది, కనిపించకుండా ఉన్నది, ఇన్ని విభూతులకు అధిపతి అయిన ఆ దేవత ఇంతకు ఎవరై ఉంటుంది? స్వర్గం నుండి వచ్చిన అతిథులందరికి ఇదొక చిక్కు ప్రశ్నగా అనిపించసాగింది. వారికి దానిని పరిష్కరించే విధానం తెలియనందున తిరిగి భూమాతనే ఇలా అడిగారు" దేవీ కొంచెము స్పష్టపరచండి... దాని పేరు, రూపం గురించి మాకు వివరంగా చెప్పండి."

భూమాత గర్వంతో ఉప్పొంగిపోయి వారితో ఇలా అంది. ఆ దేవత ఏది అంటే "శ్రమ"! నా పుత్రులంతా దానినే ఆరాధిస్తూ దృఢంగా సంకల్పిస్తూ ఉంటారు. వారు నేడు కాకపోతే రేపు ఈ లోకంలో స్వర్గాన్ని స్థాపించగలరు. ప్రతి పొలంలో పచ్చదనంతో కూడిన పైరుని ఈ శ్రమయే తలలు ఊపేటట్లు చేస్తుంది. ఎక్కడెక్కడ ఈ దేవత అర్చన జరుగుతుందో, అక్కడక్కడ విభూతులన్నీ చేతులు కట్టుకొని నిలబడి ఉంటాయి.

ఎక్కడ శ్రమ యొక్క పూజ జరుగుతుందో, అక్కడ ఏ "లేమి-కొరత" ఉండదు. ఇందుకొరకు దేవతలు కష్టపడి ఇంత దూరం వచ్చే అవసరమనేది ఉండదు. ఈ తథ్యాన్ని సత్యాన్ని స్వర్గ నివాసులు తెలుసుకొన్నవారై, తమ నిరుపయోగ స్థితిని, ఇంకా మానవుల ఉపేక్షకు సంబంధించిన రహస్యాన్ని అర్థం చేసుకొన్న వారై తమ లోకానికి తిరుగు ప్రయాణమయ్యారు.

*- అఖండజ్యోతి, నవంబర్ 1980*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## మాతా గంగా ప్రక్షాళన అభియాన్ రద్దు

**యుగశక్తి గాయత్రి మార్చి 2015 మాసపత్రిక పేజీ నెం. 26లో ప్రకటించిన మే 11 నుంచి 13 వరకు నిర్వహించతలపెట్టిన పైన పేర్కొన్న కార్యక్రమం కొన్ని అనివార్య కారణముల వలన రద్దు గావించ బడినది. పాఠకులు దీనిని గమనించప్రార్థన.**

**- గాయత్రీ చేతనా కేంద్రం**

ఆత్మశోధనలో ఉత్తీర్ణుడైన వాడే ఆధ్యాత్మికతలోనికి ప్రవేశించగలడు

# వైదిక ధర్మరక్షణ కొరకు జీవితాన్ని ధారపోసిన శ్రీ ఆదిశంకరాచార్య

ఇప్పటికి దాదాపు 1200 వందల సంవత్సరాల క్రితం కేరళ ప్రాంతంలో ఒక బాలుడు జన్మించాడు. అతడు అసామాన్య బుద్ధిసంపన్నుడు. నాలుగు, ఐదు సంవత్సరాల వయస్సున్న బాలుడు ఎవరైనారకరకాల భాషలలో, గణితంలో, కావ్యములలో, సంగీతము వంటి అనేక ఉన్నత విద్యలలో బుద్ధికుశలతను ప్రదర్శిస్తే ఆ బాలుడిని ఈనాటి వైజ్ఞానికులు 'అద్భుతబాలుడు' అని పిలుస్తారు. అలాంటిది ఏడు సంవత్సరాల వయస్సులోనే ఈ బాలకుడు అనేక శాస్త్రములను ఔపోసన పట్టాడు. అతని యొక్క అసాధారణ ప్రజ్ఞాపాటవముల గురించి ప్రజలు చెప్పుకుంటుంటే విని దేశంలోని పెద్దపెద్ద విద్వాంసులు, విద్యల పట్ల అమితమైన ఆసక్తి ఉన్న అక్కడి రాజు అందరూ కలిసి అది ఎంతవరకు సత్యమో పరీక్షించాలని వచ్చారు. అంత చిన్న వయస్సులోనే అతనికి అంతటి ప్రజ్ఞాపాటవములు లభించడమనేది ఒక దైవీచమత్కారమని తెలుసుకొని ఆ బాలునికి గౌరవ పూర్వకంగా నమస్కరించి వెళ్ళిపోయారు.



ఈ అద్భుతబాలకుని సంగతి విని కొంతమంది జ్యోతిష పండితులు ఈ బాలునిపై ఏఏ గ్రహస్థితులు పని చేస్తున్నాయో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో వచ్చారు. ఆయన జన్మకుండలి వేసినప్పుడు అతను ఒక గొప్ప మహాపురుషుడు కాగల యోగ్యుడని తెలుసుకున్నారు. కానీ ఒక విషయాన్ని గమనించిన తరువాత వారి ముఖం చింతా క్రాంతమైంది. అది చూసిన తల్లి అనుమానిస్తూ ఎందుకలా ఉన్నారని గట్టిగా అడిగింది. విషయం చెప్పేందుకు వారు చాలాసేపు తటాపటాయించి చివరకు చెప్పారు 'అమ్మా ఈ బాలుడు దైవీజ్ఞానముతో నిండిన మహాపురుషుడు. అయితే ఇక్కడున్న గ్రహఫలితాలకు అనుగుణంగా ఈ బాలకునికి కేవలం 8 సంవత్సరాల ఆయుర్దాయమే ఉంది, ఈ బాలుడు తపస్సు చేస్తే అతని ఆయుర్దాయం మరో ఎనిమిది సంవత్సరాలు పెరుగుతుంది.'

శంకరుడనే పేరుగల ఆ బాలకుడు ముందుగా తన జీవితమును దేశము, ధర్మమునకు సేవ చేసేందుకై అర్పించాలని అనుకున్నాడు. తన యొక్క ఈ కోరికను ముందుగా తన తల్లికి తెలియచేశాడు. కానీ వారింట్లో ఉత్తరాధికారులు ఎవరూ లేకపోవడం వల్ల ఆమె అందుకు అంగీకరించలేదు.

అప్పుడు శంకరుడు ఒక ఉపాయంతో తన పని సాధించాలి అనుకున్నాడు. ఇది జరిగిన కొద్దిరోజుల తరువాత ఒక పర్వదినం రోజు అతను తన తల్లితో కలిసి నదీస్నానానికి వెళ్ళాడు. అక్కడ ఈత కొడుతూ తనను మొసలి పట్టుకుని లాక్కుపోతున్నదని కేకలు వేశాడు. అది చూసి కంగారుపడి తల్లి కూడా బిగ్గరగా అరవసాగింది. అప్పుడు శంకరుడు 'తల్లీ! నీవు నన్ను శివునికి అర్పిస్తే ఆయన నన్ను కాపాడతారు' అని చెప్పాడు. కొడుకు ప్రాణములను కాపాడుకోవాలని అలాగే ప్రమాణం చేసింది. వెంటనే శంకరుడు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి తడిబట్టలు మార్చుకొని తల్లికి ప్రణామం చేసి సన్యాస స్వీకారానికి, సద్గురుసేవకు తనను అనుమతిస్తే బయలు దేరతానని చెప్పాడు.

తల్లి భోరున విలపించింది. కానీ ధర్మము కొరకు తన జీవితాన్నే అర్పించిన శంకరుడు ఆమె జీవనానికి అవసరమైన ఏర్పాట్లు చేసి నర్మదానదీ తీరం వైపుగా సాగిపోయాడు. అక్కడి నుండి ఎన్నో వందల మైళ్ళ దూరం వ్యాపించివున్న అడవిని, కొండలను దాటాలంటే ఒక చిన్నబాలునికి అసంభవమే. కానీ ధృఢనిశ్చయం కలిగిన శంకరుడు ఎటువంటి భయము, చింతా లేకుండా తన నిరంతర యాత్రను కొనసాగించాడు. చివరకు నర్మదా నదీతీరానికి చేరుకున్నాడు. అక్కడ ప్రాచీన యోగియైన

**నాలుకను అదుపులో ఉంచుకున్నప్పుడే జీవాత్మ వశమవుతుంది**

గోవిందపాదుల ఆశ్రమం ఉంది. ఆయన వేదాంతశాస్త్రమును సంపూర్ణంగా అధ్యయనం చేసినవాడని ప్రతీతి. శంకరుడు ఆయన వద్ద సన్యాసదీక్ష తీసుకొని వేదాంతమును అధ్యయనం చేశాడు. ఆ తరువాత గురుదేవులు శంకరుని ధర్మము, వేదాంతముల గురించి ప్రచారం చేయమని చెప్పి జీవసమాధి పొందారు.

ఆ తరువాత ఆ బాలసన్యాసి వయోవృద్ధులైన తన గురుసోదరులతో కలిసి కాశీకి చేరుకుని అక్కడ వేదాంతములోని నిగూఢ రహస్యములను గురించి ప్రవచనాలు ఇవ్వడం మొదలుపెట్టాడు. దానితో నలువైపులా ఖ్యాతి గడించాడు. ఆ కారణంగా జనం ఆయనను దర్శించుకోవాలని తండోప తండాలుగా రావడం మొదలైంది. శంకరుని శరీరం బాలకునిదే కానీ ఆయన జ్ఞానము, బుద్ధి సంపూర్ణ ప్రౌఢదశకు చేరుకున్నాయి. ఆయన పెద్దపెద్ద పండితుల ప్రశ్నలకు కూడా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను తీర్చేవారు. మిగిలిన మతాలనన్నింటినీ ప్రక్కన పెట్టి వేదాంత మతమును ప్రతిపాదించాడు.

శంకరాచార్యుల వారు నిర్గుణ సిద్ధాంతమునకు అనుయాయి. వేదాంత సిద్ధాంతమును అనుసరించి ఈ జగత్తంతా మిథ్య, మాయ అనే భావము ఆయనలో ఎంతగా నాటుకు పోయిందంటే ఆయన భారత ప్రజలలో వ్యాపించివున్న సగుణోపాసన వైపు కొద్దిగా కూడా దృష్టి మరల్చలేదు. ఆయన ఆత్మస్వరూపము అనే భావన గురించి ఎప్పటికప్పుడు ఇలా చెప్తుంటారు.

**నిర్గుణో నిష్క్రియో నిత్యో నిర్వికల్పో నిరంజనః ।**
**నిర్వికారో నిరాకాలో నిత్యం ముక్తోఽస్మి ॥**
**అహమాకాశవత్ సర్వం బహిరంతర్గతోచ్యుతః ।**
**సత్యం జ్ఞాన మనన్తం యత్సర్వం బ్రహ్మమేవ తత్ ॥**

అనగా నేను సత్త్వగుణ, రజోగుణ, తమోగుణ రహితుడను. నేను శరీరము, ఇంద్రియాలు, ప్రాణము, అంతఃకరణ క్రియా రహితుడను. మూడు కాలాలలోను నా అస్తిత్వమున్నది. సమస్త వికల్పాలు, కామ-క్రోధరహితుడను, నిరాకారుడను, అవిద్యా రూపరహితుడను. నేను ఆకాశతత్త్వముతో సమానముగా అన్ని ప్రాణులయందు వ్యాపించివున్నాను. దేశ, కాల, వస్తువుల పరిధి లేని పరబ్రహ్మ ఏదైతే ఉందో అదే నేను.

ఆ నిర్గుణ-భావన ఆయనలో ఎంతగా ధృఢపడిందంటే నిర్వికల్ప సమాధి గురించి తప్ప మిగిలిన భక్తి, ఉపాసన వంటి సాధనల గురించి ప్రస్తావించేవారే కారు. విశ్వకళ్యాణ భావన చిత్తములో అప్పుడప్పుడూ ఉత్పన్నమౌతూనే ఉండేది. కానీ జగత్తు అనేది 'అసత్యము' అనే భావన దానిని అణిచి వేసేది. గురువు యొక్క ఆజ్ఞను స్మరించుకుంటూ శిష్యులకు, ప్రజలకు వేదాంత-సిద్ధాంతము ఉపదేశిస్తుండేవారు. కానీ ఆయన ఆ పనిని యాంత్రికంగా చేసేవారు. ముముక్షువు దృష్టితో చూస్తే ఈ భావము ప్రశంసించదగినదే. కానీ ఇది ఆయన చేయవలసిన సత్య-ధర్మ ప్రచారము, రక్షణ అనే కార్యములకు ఆటంకముగా మారింది.

కాశీ గొప్ప జ్ఞానకేంద్రము. అక్కడ ఎల్లప్పుడూ శాస్త్రచర్చలు జరుగుతూనే ఉంటాయి. అన్ని రకాల ధర్మములలోను ప్రతిపాదన చేసేవారంతా రకరకాల ధర్మాలను ప్రతిపాదిస్తూ ఉంటారు. ఒకసారి ఆయన సమక్షంలోనే జరిగిన ఒక సంఘటన వల్ల ఆయన వేదాంత సిద్ధాంతమునకు ఒక రూపాన్ని ఇవ్వవలసి వచ్చింది. ఆయన జీవితములోని ఒక ప్రసిద్ధ సంఘటన గురించి అందరూ చెప్పేది – ఒకసారి శంకరులవారు గంగానది ఒడ్డుకు వెళుతుంటే ఆయనకు ఒక ఛండాలుడు ఎదురువచ్చి నిల్చున్నాడు. ఆయనతో పాటు నాలుగు పెద్ద కుక్కలు కూడా ఉన్నాయి. అతను మద్యం మత్తులో ఊగుతూ, తూలుతూ వస్తున్నాడు. అతను తనకు తగులుతాడేమో అనే అనుమానంతో శంకరులు 'నేను వెళ్ళేందుకు దారి వదిలి ఒక ప్రక్కగాపో' అన్నారు. ఛండాలుడు ఆయన మాటలు పట్టించు కోకుండా నడుస్తూనే ఇలా అన్నాడు-'ఎవరు ఎవరికి తగులుతారు? సర్వత్రా ఉన్న ఒకే వస్తువు తప్ప మరేముంది ఇక్కడ? దేని స్పర్శకు భయపడి నీవు తప్పుకొని పోతున్నావు? ఆత్మను ఎవరూ స్పృశించలేరు. ఏ ఆత్మ నీలో ఉన్నదో అదే ఆత్మ నాలోను ఉన్నది. మరి నువ్వు దేనిని దూరంగా పొమ్మంటున్నావు, నా దేహమునా? నా ఆత్మనా?' ఈ మాటలు విన్న శంకరునిలోని బ్రహ్మజ్ఞానము వెంటనే అసలైన సత్యస్థితికి చేరుకుంది. ఆయన మనస్సులోనే ఆ ఛండాలుని తన గురువుగా భావించి నమస్కరించారు. ఈ సంఘటన విన్న వారంతా సాక్షాత్తూ ఆ కాశీవిశ్వనాథుడే ఛండాలుని రూపంలో వచ్చి శంకరులకు ఉపదేశం చేశారని చెప్పుకున్నారు. కేవలము సిద్ధాంతమునే అంటిపెట్టుకొని ఉండకుండా ప్రజాభిప్రాయమును

**స్వాదేంద్రియమును నియంత్రించిననాడు దశేంద్రియములు మనస్సు, మీ వశంలో ఉంటాయి**

కూడా స్వీకరించి ధర్మస్థాపనా కార్యము చేయగలిగే మార్గమును ఆ ఛండాలుడు ఆయనకు చూపించాడు.

ఈ సంఘటన జరిగిన వెంటనే ఆయన తన జీవిత లక్ష్యమును చేకూర్చే పనిని ప్రారంభించారు. ఆయన తన ప్రముఖ శిష్యులతో పాటు బదరికాశ్రమమునకు చేరుకున్నారు. అక్కడ బ్రహ్మసూత్రాలకు భాష్యమును రచించారు. వాటితోపాటే పదకొండు ప్రముఖ ఉపనిషత్తులకు, భగవద్గీతకు కూడా భాష్యము వ్రాశారు. ఈ మూడు గ్రంథాలు కలిపి 'ప్రస్థాన త్రయము' అనే పేరుతో ప్రసిద్ధిచెందాయి. ఇంతేకాదు ధర్మ ప్రచారకులు ఎవరైనా ముందుగా ఈ మూడింటిపై విద్వత్తుతో కూడిన భాష్యమును రచించి తమ అభిప్రాయమును ప్రతిపాదించగలిగితే వారు 'ఆచార్య' అనే పదవికి అర్హులని భావిస్తారు.

అప్పటికే భారతదేశమంతటా వ్యాపించియున్న బౌద్ధ, జైనములనే అవైదిక మతములను ఖండించాలనే నిర్ణయానికి శ్రీశంకరులు వచ్చారు. అయితే అంతకుముందే శ్రీకుమారిల భట్టు ఆ పనికి శ్రీకారం చుట్టారని తెలిసి వారిని కలవాలనే ఉద్దేశ్యంతో ప్రయాగకు వెళ్ళారు. అక్కడ కుమారిలభట్టు శ్రీశంకరుల వారిద్వారా ప్రభావితులైనప్పటికీ అక్కడి పరిస్థితుల కారణంగా ఆయనకు సహకరించలేకపోయారు. ఆ వెంటనే ఆయన దేహత్యాగము చేశారు. దేహత్యాగము చేసేముందు ఆయన మహిష్మతీ నగరములో ఉంటున్న తన శిష్యుడు మండనమిశ్రుడు తనకంటే గొప్ప విద్వాంసుడని, శంకరులు వెళ్ళి అతనిని కలిస్తే అతను వారికి సహకరించగలడని కూడా తెలిపారు. మండనమిశ్రుడు ఆ కాలంలో భారతదేశంలోనే ప్రసిద్ధికెక్కిన గొప్ప విద్వాంసుడు. శంకరులవారు అతనితో శాస్త్రచర్చ చేసి ఆయన తన సిద్ధాంతమును ఒప్పుకునేలా చేశారు. ఆ తరువాత ఆయన చివరివరకు వారితోనే ఉంటూ గొప్ప సహాయకుడిగా తయారైనాడు.

బౌద్ధులను పరాజితులను చేసి వైదికమతము యొక్క గొప్పతనాన్ని, ఉన్నతిని చాటిచెప్పేందుకు శ్రీశంకరుల వారికి పాశుపత, తాంత్రిక, శైవ, మహేశ్వర, వైష్ణవముల వంటి ఎన్నో సంప్రదాయాల వారిని ఎదుర్కోవలసి వచ్చింది. వారంతా ధర్మానికి ఒక వికృతరూపాన్ని కల్పించి ప్రజలలో ప్రచారం చేసి జనబాహుళ్యమును చెడుమార్గములోకి మళ్ళించారు. ఇలా తయారైన వారిలో ఉగ్రభైరవుడనే కాపాలికుడు ఒకడు. అతను ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో మారువేషంతో కపటంగా శంకరుల వారి శిష్యునిగా చేరాడు. చేరిన తరువాత అవకాశం కోసం ఎదురుచూశాడు. ఒకరోజు అవకాశం రాగానే శంకరుల వారిని కొట్టడం మొదలుపెట్టాడు. అయితే అతని వాలకాన్ని ముందు నుండి గమనిస్తున్న శంకరుల వారి శిష్యులు అతనితో అప్రమత్తంగానే ఉంటున్నందువల్ల వారు వెంటనే అతనిని ఎదుర్కొన్నారు. ఇంతలో శంకరుల వారిని కాపాడాలని పరుగున వచ్చిన పద్మపాదుడు ఆ కాపాలికుడిని వధించాడు. ఈ విధంగా యాత్రలు చేస్తూ సుధన్వుడనే రాజుతో కలిసి ఆయన ప్రచారం చేస్తుండగా కర్ణాటకలో ఉండే కాపాలికులకు మహంతు అయిన కుచక్రుడు తనకున్న వేలాదిమంది శస్త్ర ధారులైన అనుయాయులతో శంకరుల వారిపై ఆక్రమణ చేశాడు. అయినప్పటికీ రాజైన సుధన్వుడు తోడుగా ఉండడం వల్ల, ఆయన తన సైన్యంతో వారిని తరిమికొట్టారు.

ఈవిధంగా ఆయన భారతదేశమంతటా ధర్మ ప్రచారం చేసి అస్సాం చేరుకోగానే అక్కడ ఆయనకు శాక్తమతాచార్యులైన అభినవగుప్తునితో తలపడవలసి వచ్చింది. ఆ చర్చలో ఓడిపోయిన అభినవగుప్తుడు పైకి శంకరుల వారి శిష్యునిగా చేరినప్పటికీ లోలోపల రగులుతున్న ప్రతీకారాన్ని తీర్చుకోవాలని రహస్య ప్రయోగాలు చేసి శంకరుల వారి శరీరంలో భగందరవ్యాధిని ప్రవేశపెట్టాడు. వారి శిష్యులు వారికి చికిత్స, ఉపచారాలు చేస్తామంటే శంకరుల వారు ఒప్పుకోలేదు. అది తన ప్రారబ్దముగా స్వీకరించి ఎటువంటి చికిత్సా ప్రయత్నాలు చేయనివ్వలేదు. కానీ అప్పటినుండి తను చేయవలసిన కార్యములన్నీ వీలైనంత త్వరత్వరగా పూర్తిచేసి ధర్మమార్గములో ప్రసన్నతాపూర్వకంగా జీవించే విధానానికి శ్రీకారం చుట్టారు. ఆ సందర్భంగా ఆయన తన శిష్యవర్గమునకు అంతిమ ఉపదేశమిస్తూ ఇలా చెప్పారు–

'శిష్యులారా! మీరంతా దైవత్వమును పొందుటయందు, ముముక్షువులకు ఉపదేశములిచ్చుటయందు సావధానులై ఉండడి. మీ ప్రయత్నాలు చేస్తూ ఉండండి. త్రోటకుడు ఉత్తరదిశ యందు జ్యోతిర్మఠమును, పద్మపాదుడు తూర్పుదిశయందు గోవర్ధనమఠమును, హస్తామలకుడు పశ్చిమదిశయందు శారదామఠమును, సురేశ్వరుడు దక్షిణదిశయందు శృంగేరీ మఠమును స్థాపించి ఎటువంటి భేదములేని తమతమ అద్వైత జ్ఞానమును ధైర్యముతోను, దృఢనిశ్చయముతోను నిరంతరము

**వజ్రం సంస్కరింపబడిన బొగ్గు తప్ప మరేమీ కాదు**

ప్రచారము చేస్తూ ఉండాలి. మిగిలిన శిష్యులంతా ఈ నలుగురిని గౌరవించాలి. అధికారము చేతిలో ఉన్నవారంతా వైదిక మార్గమును అవలంభించాలి. దురాచారములకు అలవాటు పడిన వారిని సంస్కరించాలి.'

శంకరులు ఒకరోజు ప్రాతఃకాలమునే లేచి నదిలో స్నానము చేసి తిరిగివస్తుండగా సహసా అనే ఛండాలుడు ఆయనకు తగిలాడు. ఆ స్పర్శ తగలగానే శంకరాచార్యుల వారు కుపితులై తనను అపవిత్రం చేసిన దోషాన్ని ఆరోపించి కోపగించారు. ఆయన రోషమును చూసిన ఛండాలుడు నవ్వుతూ, "మహానుభావా! సన్యాసి నుండి మొదలుపెట్టి మహాపురుషుడి అయ్యావు. వేదశాస్త్రములు చదివి పండితుడివి అయ్యావు. కానీ తుచ్ఛమైన దేహాభిమానమును మాత్రము వదలలేకపోయావు. అటువంటప్పుడు మిమ్మల్ని మీరు సంపూర్ణ సాధువు అని ఎలా అనుకుంటున్నారు. అది ఉచితంగా అనిపించడం లేదు. అందరి శరీరాలలోను ఒకే ఆత్మ ఉంటుంది. ఈ సత్యమును నిరూపించని మీ సన్యాసములో పరిపూర్ణత లేదు. ఇది ఒక ఆడంబరమే" అన్నాడు.

ఛండాలుడి మాటలతో శంకరాచార్యుల వారి కళ్ళు తెరుచుకున్నాయి. ఆయనకు తనలోని అసంపూర్ణత ఏమిటో అర్థమైంది. దాన్ని పూర్తి చేసుకునేందుకై తిరిగి ఘోరతపస్సును ప్రారంభించారు. ఈసారి ఆయన అధ్యాత్మము యొక్క సత్యస్వరూపమును హృదయంగమం చేసుకొని వెంటనే తన కర్తవ్యమార్యములో సాగిపోయారు. ఆయన అటక్ నుండి కటక్ వరకు, కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకు కాలినడకన యాత్ర సాగించారు. ఆ యాత్రా సమయంలో ఆయన ఎన్నో వ్యాఖ్యానాలు ఇచ్చారు. ఉద్దండులైన గొప్పగొప్ప విద్వాంసులతో శాస్త్రచర్చలు చేసి ధర్మము యొక్క సత్యస్వరూపమును అర్థము చేసుకునేందుకు, అర్థమయ్యేలా చెప్పేందుకు వీలుగా సభలను నిర్వహించారు. ఆయన ధర్మప్రచారము కొరకు చిద్విలాసుడు, విష్ణుభక్తుడు, హస్తామలకుడు, సమితిపాణి, జ్ఞానవృద్ధుడు, భానుగర్భికుడు, బుద్ధిలో బ్రహ్మవంటి త్రోటకాచార్యులు, పద్మనాభుడు, సుస్థిర కీర్తివంతుడైన మండమిశ్రుడు, కృష్ణ దర్శనుడు వంటి దేశమునందలి ఉద్దండ పండితులను సంఘటితపరచి ఒకే త్రాటిమీదకు తీసుకువచ్చారు. దానితో వేదధర్మ అనుయాయులతో కూడిన ఒక విశాలమైన ధర్మసైన్యం తయారుచేయబడింది. వారి ద్వారా సంపూర్ణ భారతదేశములో ధర్మమును సంస్కరించడమనే కార్యము ఊపందుకుంది. వారంతా కలిసి దేశాన్ని ఒక ఊపు ఊపారు. వారియొక్క అఖండ ప్రయత్నముల ఫలితముగా ప్రజల మనస్సులలో ధర్మమునకు సంబంధించి ఉన్న భ్రాంతులన్నీ తుడిచి వేయ బడ్డాయి. దేశమంతటా వైదికధర్మము యొక్క శంఖ నాదము మారుమ్రోగింది.

శ్రీశంకరాచార్యుల వారు కర్మనిష్ఠ కలిగిన ధర్మవీరులు. అయినా ఆయనలో ఉన్న భగందరము పగిలిపోయి వెలుపలికి వచ్చింది. వైద్యులు ఆయనను ఎక్కడికీ కదలవద్దని, లేదంటే చాలా ప్రమాదమని చెప్పారు. కానీ శంకరాచార్యుల వారు విశ్రాంతి తీసుకోవడానికి సిద్ధంగా లేరు. ఆయన తన శరీరము కంటే తన తన కర్తవ్యమే మహత్వపూర్ణమైనదని, ఆ కర్తవ్యమే అసంపూర్ణంగా ఉంటే విశ్రాంతి తీసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. ఎంత కష్టం కలిగినా ఆయన నిరంతరము పని చేస్తూనే ఉండేవారు. చివరికి 30 సంవత్సరాల చిన్న వయస్సు లోనే ఆయన జగద్గురు పదవిని పొంది ఈ ప్రపంచం నుండి నిష్క్రమించారు.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 50 (1.95) నుండి*
*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## మన దోషాలను ఎత్తిచూపుట మన మంచికే

*సామ్రాట్టు వృషమాతంగ శీలుడు మంచి నడవడిక గల శ్రేష్ఠమైన వ్యక్తి. అతని సేవ కొరకు ఒక పరిచారిక వస్తుండేది. "ఒకరోజు మీ నుండి దుర్వాసన వస్తున్నది, నేను మీకు సేవ చెయ్యలేను" అని అన్నది పరిచారిక. సామ్రాట్టుకు కోపం వచ్చినా దానిని అణచుకొని ఆయుర్వేద వైద్యులను పిలిపించాడు. వారు పరీక్ష చేసి వృషమాతంగుని దంతములలో ఉన్న వ్యాధికి చిగుళ్ళు కుళ్ళిపోవడం వలన దుర్గంధం వస్తున్నదని నిర్ధారించి చికిత్స చేశారు. తరువాత సామ్రాట్టుకు ఆ దుర్గంధం పోయి మంచి ఆరోగ్యం ప్రాప్తించింది.*

*మన దోషాలను ఎత్తిచూపే వారి మీద ఎప్పుడు కోపం తెచ్చుకోకూడదు. అది మన మంచికే అని తెలుసుకోవాలి.*

*– అఖండజ్యోతి, మార్చి 2010*
*అనువాదం: ముక్కామల రత్నాకర్*

## మానవుడు దారి తప్పిన దేవత

వ్యక్తి నిర్మాణం

# సాధన చేస్తూ సాగిపోతే సాధించలేనిదేముంది?

*అనగ నసగ రాగ మతిశయిల్లుచునుండు*
*తినగ తినగ వేము తియ్యనుండు*
*సాధనమున పనులు సమకూరు ధరలోన*
*విశ్వదాభిరామ వినురవేమ.*

"విశ్వదాభిరామ వినురవేమ" అను మకుటంలోనే వేమన తన విశ్వ దృష్టిని చూపించాడు. తాను విశ్వమంతా వ్యాపించిన వాడట. అంటే తాను చెప్పిన నీతులు వర్తించని వారు ఎవరూ లేరని, మూర్ఖులను, సుబుద్ధులను, హీనులను, ఉత్తములను, రాజులను, పేదలను, స్థానబలిమిగలవారిని, లేనివారిని అందరినీ, అన్ని విధాల తట్టి లేపి హితబోధ చేసే వేమన చెప్పిన పద్యాలలో ఆణిముత్యం లాంటి పద్యమిది. ఎందుకంటే ఈ పద్యం యొక్క భావం మనకి అందరికీ, అన్ని వేళలా పనికి వస్తుంది.

దీని ప్రభావమేమిటంటే పాడగా పాడగా గొంతు విప్పారి. తినగా తినగా చేదు తియ్యనైనట్లే కష్టపడితే సాధించలేని పనులు లేవు. దృఢ సంకల్పం ఉన్నప్పుడే, ఏ పనైనా చేసి తీరాలన్న పూనిక ఉన్నప్పుడే, అది సమకూరుతుంది.

అయితే విజయమనేది ఒక్క రోజులో రాదు. ఒక్కరోజులో అద్భుతాలు జరిగిపోవు. రోమ్ ఒకరోజులో నిర్మింపబడలేదు. ఎంతో కఠోర శ్రమతో ఎన్నో గంటల సాధనతో నిర్మింపబడింది. సాధన మనిషిని నిష్ణాతుని గావిస్తుంది. సంగీత ప్రపంచంలో వయోలిన్‌తో విశ్వవిఖ్యాతి గడించిన ఫ్రిట్జ్ క్రిస్లర్‌ని ఒక ఇంటర్వ్యూలో ఒక పాత్రికేయుడు 'మీరు వయోలిన్‌ని ఇంత బాగా ఎలా వాయించగలుగుతున్నారు? మీ చేతుల్లో ఏదో మాయ ఉందనుకుంటా. మీరు నిజంగా అదృష్టవంతులు... లేకపోతే ఆ వేళ్ళు అలా ఎవరికీ కదలలేవు...' అని ప్రశ్నించాడు. అప్పుడు క్రిస్లర్ జవాబిస్తూ... 'నేను నిజంగా అదృష్టవంతుణ్ణే. ఎందుకంటే ఆ అదృష్టమే లేకపోతే నాకు ప్రతిరోజూ సాధన చేయాలనే సంకల్పం ఉండేది కాదు. నేను వయోలిన్ మీద సాధన చేయని రోజున నాకు నిద్ర పట్టదు. నేను ఎందుకు అదృష్ట వంతుణ్ణి అయ్యానంటే నేను కొన్ని వందల గంటలు వయోలిన్ మీద సాధన చేశాను కాబట్టి, ఇప్పటికీ కూడా సాధన చేస్తాను. ఇప్పటికీ కూడా నా సాధన కొనసాగుచున్నది.

నేను ఒక్క నెల రోజులు సాధన చేయకపోతే తేడాని ప్రేక్షకులు గుర్తించగలరు. నేను ఒక్క పక్షం రోజులు సాధన చేయకపోతే నా జట్టులో ఉన్నవారు తేడాని గమనించగలరు. ఒక్క వారం నేను సాధన చేయకపోతే, నా భార్య నా సంగీతంలోని తేడాను ఇట్టే పసిగట్టగలదు. అట్లే నా సంగీతంలో తేడాను నేను స్వయంగా గమనించగలను. కాబట్టి నా విజయ రహస్యం నా అదృష్టం కాదు, అది నా నిత్యసాధన వల్లనే అని అన్నాడు.

ఇంకో సందర్భంలో ఫ్రిట్జ్ క్రిస్లర్ (Fritz Kreisler)ని తన ప్రదర్శన అయిపోయిన తరువాత ఒక అభిమాని కలిశాడు. అతడు క్రిస్లర్ ప్రదర్శన ముగిసిన వెంటనే వేదిక వద్దకు వెళ్ళి క్రిస్లర్‌తో "మీరు వయోలిన్ మీటెడి పద్ధతి పరమాద్భుతం... మీలా వయోలిన్ వాయించే స్థితికి నేను చేరుకోవాలంటే నా జీవితాన్నంతా ధారపోయాలి" అని అన్నాడు. దానికి క్రిస్లర్ "నేను కూడా నా జీవితాన్నంతా ధారపోశాను" అని సమాధాన మిచ్చాడు.

ప్రతి గొప్ప విజయానికి శ్రమ చాలదు, కఠోర పరిశ్రమ కావాలి. సరస్సులో విహరించెడి బాతును గమనించినచో అది ఎంతో ప్రశాంతంగా, నిశ్చలంగా నిలచి, తన చుట్టూ ఉన్న పరిసరాలను ఆనందంగా అనుభవిస్తున్నట్లు మనకి కనిపిస్తుంది. వాస్తవంగా అది తాను ఉన్న చోటున నిశ్చలంగా ఉండేందుకు తన కాళ్ళను తరచుగా నీటిలో కదిలిస్తూ ఉంటుంది.

ఒక కళలో నిష్ణాతుడగుటకు కావలసినది అదృష్టం కాదు, కఠోర శ్రమ. ఎన్నో కోట్ల ప్రయత్నాల ఫలమే విజయం. దీనికి ఉదాహరణగా ఇటలీకి చెందిన ప్రఖ్యాత చిత్రకారుడు, శిల్పి, కవి మరియు ఇంజినీరు అయిన మైఖేలాంజెలో. తాను చేపట్టిన అన్ని రంగాలలోను అద్భుతమైన ప్రతిభ కనబరచాడు. 16వ శతాబ్దంలో ఇతనికి లభించిన ప్రాచుర్యం మరే ఇతర కళాకారునికి లభించలేదు. ఎంతో సుప్రసిద్ధమైన పేటా మరియు డేవిడ్ అనే శిల్పాలను తన 30 యేళ్ళ వయసులోపే సృజించాడు.

**మనుష్యుని అంతఃకరణ సౌందర్యం ముందు బాహ్య సౌందర్యం వెలవెలపోతుంది**

అతనిని సభలో సన్మానిస్తూ అందరూ వేనోళ్ళ పొగుడుతూ అతనిని ఇంద్రుడు, చంద్రుడు, బ్రహ్మలాంటి సృష్టికర్త అని పొగిడారు. దీనికి సమాధానంగా మైఖేలాంజిలో "వినమ్రత ఉట్టిపడుతూ "నా చేతిలో, నా మెదడులో ఏవేవో శక్తులు దాగి ఉన్నాయని మీరు ఊహించుట సరికాదు. నన్ను మీరు కీర్తించుచున్న దానికి ఇది నా పూర్వజన్మ సుకృతమని భావిస్తున్నాను. నేను అహర్నిశలు శ్రమించి ఈ చిత్తరువును మరియు శిల్పాలను తీర్చిదిద్దాను. ఇదేరీతిలో మీరు శ్రమించినచో నా శిల్పాల, చిత్తరువుల కన్నా మించిన వానిని సృజించగలరు. నా చేతులు అలుపెరుగకుండా ఉలిని, కుంచెను పట్టుకొని నేను ఊహించిన శిల్పం, చిత్తరువు పూర్తి అగునంత వరకు విశ్రమించవు. ఉలిని, కుంచెను పట్టుకున్నప్పుడు నా చేతులు పూర్తిగా నా మనస్సు ఆధీనంలోనే ఉంటాయి. నా మనస్సు నేను చేసిన పనికి నూటికి నూరు మార్కులు ఇచ్చేంతవరకు నా చేతులు నొప్పి పెట్టవు. అదేవిధంగా నా మెదడు, మనస్సు విశ్రమించవు. నా మనస్సులో కల్పన చేసిన కళాఖండానికి కించిత్తు తేడా వచ్చిన నా మెదడు అంగీకరించదు. అవసరమైతే మొత్తం కళాఖండాన్నే తిరస్కరిస్తుంది. అనుకున్న రీతిలో చిత్తరువు రానిచో నా మనస్సు ఎన్నటికీ సంతృప్తి చెందదు. ఇదే ప్రఖ్యాత శిల్పులు, చిత్రకారుల వెనుక ఉన్న విజయ రహస్యం."

600 సంవత్సరాల క్రితం జీవించిన 'మైఖేలాంజిలో'ని ఇప్పటికీ ఈ ప్రపంచం గుర్తుంచుకొని అతని విజయాలను స్మరించుచున్నది.

'మైఖైలాంజిలో' ని గురించి మరొక ఉదాహరణ: కొత్తగా ఐపిఎస్ పదవులకు ఎంపికైన వారికి శిక్షణనిచ్చెడి సంస్థ సర్దార్ వల్లభభాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (SVPNPA) హైదరాబాదులో ఉన్నది. దీని ప్రవేశద్వారం వద్ద ఆహ్వానిస్తూ తళతళ మెరుస్తూ నల్లని మార్బుల్ శిల రహదారిని రెండుగా చీలుస్తూ దర్శనమిస్తుంది. ఈ శిలకు నిర్దిష్టమైన ఆకృతి లేదు, సుమారు అయిదు అడుగుల పొడవు, రెండు అడుగుల వెడల్పు గల ఆ శిల నల్లగా నిగనిగలాడుతూ ఒక సందేశాన్ని ఇస్తూ ఉంటుంది. ఆ శిల క్రింద ఈ విధంగా చెక్కబడి ఉంది.

"మైఖేలాంజిలో" ని ఒకరు ఈవిధంగా ప్రశ్నించారు. "మీరు అద్భుతమైన శిల్పాలను ఎలా చెక్కగలిగారు? మీరు చెక్కిన ప్రతి శిలలో జీవం ఉట్టిపడుతుంది. ఇది కేవలం మీకు మాత్రమే ఎట్లు సాధ్యమైనది" అని ప్రశ్నించారు. దీనికి జవాబుగా మైఖేలాంజిలో "నేను చెక్కడానికి ముందుగానే ఆ శిలలో నా ఊహలలోని శిల్పం దాగి ఉంది. దానిని వెలికితీయుటయే నేను చేసిన పని" అన్నాడు. 'మైఖేలాంజిలో' డేవిడ్ పేరుగల శిల్పాన్ని చెక్కేటప్పుడు ఒక బాలుడు వచ్చి ఈ రాయిని ఎందుకు కొడుతున్నావని అడుగగా జవాబుగా మైఖేలాంజిలో "ఈ రాయిలోపల ఒక దేవదూత బంధింపబడి ఉన్నాడు. తాను ఆ దేవదూతను విడుదల చేస్తున్నానని" చెప్పాడు.

పై సందేశానికి జతచేసి పోలీసు శిక్షణ అకాడమీ వారు ఈ క్రింది వాక్యాలను చెక్కించారు.

"మీలో కూడా (ఐపిఎస్ శిక్షణ పొందెడివారిలో కూడా) ఒక మంచి ఐపిఎస్ అధికారి దాగి ఉన్నాడు. ఆ మంచి అధికారిని వెలికి తీయుటకు మాకు అవకాశం ఇవ్వండి"

అట్లే మనలో కూడా నిద్రావస్థలో ఒక విజేత ఉన్నాడు. ఆ విజేతను మేల్కొల్పుటయే మన ముందున్న సవాలు. మనలో ఉన్న మత్తును వదిలించుకొని ప్రేరణాత్మకంగా మనం ముందుకు సాగాలి. మనం విజేతలమవ్వాలంటే అందరికన్నా ఎక్కువ కష్టపడాలి. మనలో దాగి ఉన్న అంతరవాణి మనలను సదా హెచ్చరిస్తూ ఉంటుంది. అది మనలను మన బాధ్యతల గురించి ఎప్పటికప్పుడు ఉద్బోధిస్తూ ఉంటుంది.

ఒకనాడు డేవిడ్ పేరిట ప్రసిద్ధి చెందిన శిల్పం 18 అడుగుల ఎత్తుగల శిల. ఎందరో దానిని శిలగానే చూసారు. ఒక్క మైఖేలాంజిలో మాత్రమే దానిలో దాగి ఉన్న డేవిడ్ అనే దేవదూతను దర్శించగలిగాడు. తదనుగుణంగా దానిని శిల్పంగా మార్చాడు.

విజేతలైనవారు అదృష్టం పట్టటం వల్ల విజేతలైనారనెడిది సత్యదూరం. వారిని అదృష్టం వరించేంతగా వారు శ్రమించారు అనెడిది సత్యం. వెలుపలి నుంచి చూస్తే విజేతల జీవితాలు ఎంతో అదృష్టంతో కూడి ఉన్నవనీ మనం భావించవచ్చు. కానీ విజయం కోసం వారు పడిన శ్రమ, తపన మాటల కందనిది. ఒక్కటి మాత్రం యదార్థం – శ్రమించెడి వారినే అదృష్టం వరిస్తుంది. మైఖేలాంజిలో మరియు క్రిస్లర్ వంటివారి జీవితాలు దీనికి నిలువెత్తు ఉదాహరణలు.

*– మీరు "శ్రీ"లు పుస్తకం నుండి*

*శ్రీ అద్దంకి శ్రీధర్‌బాబు, ఐ.ఎ.ఎస్. సౌజన్యంతో*

**మానవుడు తనకు తానే శత్రువు, తనకు తానే మిత్రుడు**

# సర్వోత్తమ ఐశ్వర్యము (విభూతి) - విద్య

మనిషిలోని అన్నింటికన్న గొప్ప విశిష్టత ఏమిటి? మనిషికి నిజమైన గౌరవమని దేనిని చెప్పుతారు? మనిషికి గల దైవీ (విభూతి) సంపద వాస్తవంగా ఏమిటి?

శాస్త్రకారులు పై ప్రశ్నలకు జవాబును ఈ క్రింది పదాల ద్వారా అందించారు.

**గతేఽః వ్యసి గ్రాహ్యా విద్యా సర్వత్మనా బుద్దైః ।**
**యద్యపి స్తయాన్న ఫలదా, సులభా సాఙ్న్యయన్మని ॥**

అర్థము: ఓ! మానవులారా! వయస్సు మళ్ళిన తదుపరి కూడా విద్యనభ్యసించుటకై ప్రయత్నించినచో, మీరు నిశ్చితంగా బుద్ధిమంతులే. (ఏలనన విద్య మానవునికి గల సర్వోత్తమ ఐశ్వర్యము). విద్య ఈ జన్మలో ఫలితాలనివ్వనప్పటికి మరు జన్మలో తప్పక మీకు అది సులభతరమవుతుంది".

విద్యా రూపంలో ఎవ్వరి వద్దనైతే ధనమున్నదో వారే నిజమైన మనుజులు. జ్ఞానహీనుడు జంతువులతో సమానం.

అతడు నరపశువే. విద్యవలన మానవ జీవన సార్థకమవుతుంది. ఆత్మవికాసానికి తోడ్పడుతుంది. ప్రపంచంలో విద్యకు మించిన నేస్తము అవిద్యకు మించిన శత్రువు లేరు. విద్యవలన మనుష్యునికి సమాజంలో, పరివారంలో మరియు జీవితంలో ఆనందం, ఉల్లాసం, గౌరవం మున్నగు సుఖ సంతోషాలు లభించుటేగాక చివరలో మోక్షాన్ని సిద్ధింపచేస్తుంది.

అవిద్య లేక అజ్ఞానం అన్ని అపజయాలకు మూలం. జన్మతః మనుష్యులు కొద్దిపాటి తేడాలతో పుడతారు. కాని విశిష్ట క్షేత్రాల ద్వారా జ్ఞానలబ్ధి పొంది శిక్షణ మరియు విశిష్ట అధ్యయనంతో మనిషి తనతోటివారిని అధిగమించి ముందడుగు వేస్తాడు.

ఒక విచారశీలుని మాటలలో "విద్య నవయువకునికి సహాయకారిగా నిలచి ధనవంతుని, కీర్తిమంతుని చేసి దృఢమైన వ్యక్తిత్వ సుఖాన్ని అందించెడి సాధనగా నిలుస్తుంది. విద్యార్జనతో మనిషి చక్కని ఆలోచనాపరునిగా ఎదిగి, ఏకాగ్రతతో శ్రమశీలుడవుతాడు. విద్య మన సమృద్ధికి ఆభరణం, ఆపదలలో రక్షణగా మరియు అన్ని సమయాల్లో మనోల్లాసాన్ని అందించెడి సాధన. విద్య యొక్క అంతిమ లక్ష్యం పరమాత్మను తెలిసికొనుటే.

మనుష్యుని జీవిత పరీక్షలో గెలిపించెడి గీటురాయి అతనికి పూర్వీకుల నుండి లభించిన ధన, సంపద, లేక భూములు వగైరాలు కావు. అట్లే అతనికి గల రూప సౌందర్యాలు కానేరవు.

కేవలం అతనికిగల బుద్ధి, సద్జ్ఞానం, సద్బుద్ధి మరియు వివేకములు తోటివారిలో అతనిని ప్రత్యేక శ్రేష్ఠ వ్యక్తిత్వంగల వానినిగా నిలబెడతాయి. నిజం చెప్పాలంటే మనిషికి గల యోగ్యత, విద్వత మరియు ప్రతిభలే అతనికిగల గొప్పతనానికి గీటురాయిగా నిలుస్తాయి.

### విద్యాదానం ఒక గురుతర బాధ్యత

అధ్యాపక వృత్తి అన్నింటికన్న కఠినమైన పని. ప్రాచీన కాలంలో ఎవ్వరైనా అన్ని విధాలా ఉత్తమ విద్వాన్‌గా రూపొందుటకు సాహసించవచ్చును. ఎవ్వరైతే అక్షర జ్ఞానంతోపాటుగా మనిషిలోని ప్రతిభను వికసింపజేయగల సమర్థత కలిగి ఉండెదరో అట్టివానికి శిక్షణ ఇచ్చెడి బాధ్యత అప్పగించుట జరుగుతుంది. మనుష్యుని శ్రేష్ఠునిగా చేసి ఉన్నత స్థానానికి ఎదిగేలా చేసెడిదే విద్య.

కౌరవులకు మరియు పాండవులకు బాల్యంలో అస్త్రశస్త్ర విద్యలలో శిక్షణ నిచ్చుటకై సమర్థుడైన ఆచార్యుని అవసరం ధృతరాష్ట్ర మహారాజుకు కలిగింది. రాజగురువుగా సమర్థుడైన వ్యక్తి రాజుకు కనిపించలేదు. కేవలం శస్త్రవిద్యను నేర్పించుటకు, ఎవ్వరైనా సరిపోతారు. కాని నైతికంగా ఉన్నతిని ప్రదర్శిస్తూ, సద్జ్ఞానాన్ని, విద్వతను మరియు ప్రతిభాపాటవాలను ఒకదాని వెంట ఒకటిగా అన్నింటిని మేళవించగలిగిన వ్యక్తిత్వంగల వ్యక్తి కావలసి ఉంది. ఒకరోజు ద్రోణాచార్యుడు, రాజుగారి కొలువులోనికి ప్రవేశించుట జరిగింది. ధనుర్విద్యలో ద్రోణాచార్యునికి గల ప్రతిభాపాండిత్యాలను గుర్తించిన మహారాజు ముగ్ధుడై, ఆయన వద్ద ఉంచినచో రాజకుమారులు బహుముఖ ప్రజ్ఞావంతులయ్యెదరని భావించాడు.

### ఇది విద్య కాదు - అవిద్య

ఆధునిక విద్య యొక్క స్వరూపం పూర్తిగా మారిపోయింది. దీనిలో నైతిక శిక్షణ మరియు వ్యక్తిత్వ నిర్మాణానికి స్థానమే

**మనిషి యొక్క ఒక గుప్పిటలో స్వర్గం మరియొక గుప్పిటలో నరకమున్నది**

లేకున్నది. బుద్ధిమాన్యతను పెంచెడి ప్రయత్నం శూన్యం. విద్యార్థులలో బలమైన వ్యక్తిత్వ నిర్మాణానికి, శ్రమశీలత నిర్మాణానికి, ఆత్మ విశ్వాస నిర్మాణానికి, ఉత్సాహం, సాహసం, ఓర్పు మరియు సాత్వికతల పెంపొందించెడి శక్తి నేటి విద్యా విధానానికి లేకున్నది.

స్వతంత్ర ఆలోచన శక్తిని, వివేకశీలతను, బుద్ధిని, పరిస్థితులను ఎదుర్కొని పోరాడి గెలువగల సామర్థ్యాన్ని అందించజాలని విద్య నిస్తేజం మరియు ప్రాణశక్తిహీనమైనది.

నేటియుగం విద్యార్థులకు ఇటువంటి విద్యనందించుట చాలా బాధాకరం. ఈ రీతిగా మన అసంఖ్యాకమైన విద్యార్థులు కళలు, శాస్త్ర మరియు వాణిజ్య పట్టాలను (డిగ్రీలను) పొంది సమాజంలో అడుగిడుచున్నారు. ఇట్టి వీరిలో మోసం, కపటం, ధూర్తత, దుష్ట చరిత్ర, ఫ్యాషన్లపై మోజు, విలాసాలు , ద్వేషం మరియు అహంకారాలు తప్ప మరేమి ఉత్తమమ్మైనవి కనిపించకపోవుట మిగుల విచారించదగ్గ విషయం.

నేటి కలియుగ విద్యార్థుల నైపుణ్యం దేనిలో దాచబడ్డాయి. చిన్న చిన్న విషయాలకై హడ్తాల్ చేయుట, హింసకు దిగుట, లూటీలకు అల్లర్లకు దిగుట, తగాదాలకు పోవుట, పరీక్షలలో నకిలీ విద్యార్థులు హాజరగుట స్త్రీల పట్ల అసభ్య ప్రవర్తన, అశ్లీల పద ప్రయోగానికి పాల్పడుట. శక్తికి మించి భారీగా ధనాన్ని ఖర్చు చేయుట, సినిమాలకు, షికార్లు ధూమపానం, ఇత్యాది పనులు నిత్య దర్శనాలు కృత్యాలుగా మారాయి. స్వతంత్ర ఆలోచనలకు హద్దులు లేకుండా పోయాయి. ఆలోచనలలో పరాధీనతకు స్థానం కలుగుట అవిద్యకు సంకేతమే.

ఏ జ్ఞానమైతే మనుష్యులలో ఉత్తమ సంస్కారాలను జాగృత పరుస్తుందో, మనుష్యులలో సర్వోత్తమ తత్త్వాలను వికసితం చేస్తుందో, వారిలోని అత్యుత్తమ వృత్తులను పెంపొందింప జేస్తుందో, అట్టి విద్య కావలసి ఉన్నది. జ్ఞానం మనుష్యులను సాహసికుల గావిస్తుంది. స్వావలంబులనుగా చేస్తుంది. దీనిని మాత్రమే విద్య అని పిలచుటకు తగినది.

### ఆధ్యాత్మికత యొక్క దివ్య ప్రకాశము

మనుష్యునికి సరియైన దిశానిర్దేశాన్ని చూపుతూ, ఉన్నతికై సరియైన మార్గాన్ని చూపుతూ, జీవితానికి సరియైన ప్రకాశాన్ని అందించెడిదే ఆధ్యాత్మికత. ఇట్టి ఆధ్యాత్మికతను జాగృతి గావించెడి పనిని మొదటి నుండే ప్రారంభించవలసి ఉన్నది. వివేకాన్ని మేల్కొల్పని విద్య, పతితులనుగావిస్తుంది. దీనినే స్వభావంగా మార్చుతుంది. మనుష్యులలోనున్న పశుత్వం, చెడులను దూరం చేసెడిది కేవలం విద్య మాత్రమే. జీవితం సాత్విక మార్గాన్ని పట్టనిచో, గుణకర్మ, స్వభావాలలో, సత్వగుణాలు ప్రతిఫలించవు. మనుష్యునిలోని జడత్వం మరియు పశుత్వం దూరం కావు. కావున ఆధ్యాత్మిక విద్య సుఖప్రదమైన జీవితానికి ప్రధాన ఆవశ్యకతగా ఉన్నది.

మనుష్యులలో సర్వోత్తమ విభూతి (ఆభరణం) అయిన విద్య, విద్వత్ మరియు సద్జ్ఞానాన్ని అధికాధికంగా పెంపొందింపవలసి ఉన్నది. ఏ విద్య ద్వారా మనిషి స్వయంగా తన యోగ్యతలను పెంపొందించుకొని, తద్వారా తన జీవన ఆధారాన్ని పండించుకుంటూ ఉంటాడో, అప్పుడు ప్రపంచం సుఖ సంపత్తులతో నిండి పోతుంది. దీనికై సత్యాన్ని ప్రేమించుట మరియు లోతుగా ఆలోచన చేయవలసి ఉన్నది. విద్య ఆత్మ యొక్క దాహాన్ని తీర్చుతుంది. జీవన లక్ష్యాన్ని పూరించేది విద్యయే. కఠోర శ్రమతో విద్యను ప్రాప్తించుకొనవలయును.

*హిందీమూలం: వాఙ్మయ భాగము ఆత్మోత్కర్ష్ కా ఆధార్-జ్ఞాన, పుష్ప 1:6-66 నుండి సంకలనం-సంపాదితం*
*ప్రజ్ఞా అభియాన్, 1 ఫిబ్రవరి 2015*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## పంట రహస్యము

*ఇటలీకి చెందిన క్రేసిన్ అనే రైతు పండించేపంట మిగిలిన రైతులు పండించే పంటకంటే అనేకరెట్లు అధికంగా దిగుబడి అయ్యేది. ఈర్ష్యాపరులు అతను మాయలు తెలిసిన వాడని. తమ పంటలు అపహరిస్తున్నాడనీ కోర్టులో ఫిర్యాదు చేశారు. క్రేసిన్ నాగలి, రైతులు, కుమారులు, కుమార్తెలతో సహా కోర్టుకువెళ్ళి సవినయంగా కోర్టువారికి నమస్కరించి తనతో సమంగా శ్రమించే తన పరివారాన్ని కోర్టు ముందు హాజరుపరిచి తన మాయలు, చమత్కారాలు అన్నీ ఇవేనని వారికి తెలియజేశాడు. కోర్టు పెద్దలు ఆ శ్రామిక పరివారాన్ని అభినందించి, సత్కరించారు.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**రోగాలకు కారణం సంయమము లేకపోవుటే**

# జీవితము చాలా అమూల్యమైనది! దానిని అందముగా తీర్చిదిద్దుకోండి!

జీవనశైలి అనగా జీవించే పద్ధతి, ప్రవర్తించే తీరు! జీవనశైలి మనకు వరదానముగాను ఉండవచ్చును లేదా అభిశాపముగాను మారవచ్చును. ఒకవేళ మనము మన జీవనశైలిని శ్రేష్ఠమార్గము దిశగా మున్ముందుకు సాగేటట్లుగా తీర్చిదిద్దుకుంటే, అది మనలను ఆధ్యాత్మిక అనుదానములతో ముంచెత్తి పరిపూర్ణులను చేస్తుంది. అలాకాక మనము జీవితమును భౌతికమైన కోర్కెలను తీర్చుకొనుటలో నిమగ్నము చేస్తే మనకు భౌతికమైన సుఖ-సౌకర్యములను అందిస్తుంది. కానీ మనము మన జీవనశైలిని సువ్యవస్థితముగాను, సంయమనముతోను మలచుకొనకపోతే మన మనస్సు, శరీరములు స్వచ్ఛముగాను, సుదృఢముగాను ఉండే బదులు రోగగ్రస్థం అవుతాయి. అంతే కాకుండా మనలో ఉండే ప్రాణశక్తి, జీవనశక్తి క్షీణించి పోతుంటుంది.

నిశ్చయముగా సరైన జీవనశైలే మన మనస్సు, శరీరములను శక్తివంతముగాను, స్ఫూర్తివంతముగాను రూపొందిస్తుంది; జీవితములోని నూతన ఆయామముల తలుపులను తెరుస్తుంది. అందరి జీవనవిధానము ఒకేలాగా ఉండదు. శరీర పరిస్థితిని అనుసరించి జీవనశైలిలో భిన్నత్వం ఉంటుంది. అయితే ఈ జీవనపద్ధతిలో అందరూ దృష్టిలోపెట్టుకోతగిన అనివార్యమైన విషయములు కొన్ని ఉన్నాయి. **అవి-సరిపడినంత నిద్ర, శుభ్రత, నిత్యకృత్యములకు తగినంత సమయమును కేటాయించుట, శారీరక వ్యాయామము మరియు పరిశ్రమ, మనస్సు నిలబడుటకు స్వాధ్యాయం, నియమితమైన ఉపాసన, సంతులిత ఆహార స్వీకరణ, సువ్యవస్థితమైన ప్రవర్తనా నియమావళి!!**

అయితే ఉరుకులు పరుగులతో కూడిన జీవితములో చాలా ముఖ్యమైన ఎన్నో విషయములు మరుగునపడి పోతాయి. ఉదాహరణకు: ఉపాసన, సాధన మరియు స్వాధ్యాయములకు తగు సమయమును కేటాయించలేకపోవడము. తమ పనులను చక్కబెట్టుకొనుటలో ఎంత లోతుగా మునిగిపోతారంటే తగినంతగా నిద్రపోలేరు. లక్ష్యపూర్తి కొరకు మనిషి కొంత ఒత్తిడిని ఎదుర్కొన వలసి ఉంటుంది. అతని జ్ఞాపకశక్తిమీద దీని ప్రభావము పడుతుంది. బాగా పొద్దుపోయాక భోజనము చేసి పడుకుంటారు. **అర్ధరాత్రివరకు ఇలా మేల్కొని ఉండటము ఆరోగ్యమును బాగా దెబ్బతీస్తుంది.** ఈనాడు మనిషి ఇటువంటి జీవితమునే సాగిస్తున్నాడు కానీ సార్థకమైన ఏ లాభమును మూటగట్టు కోలేకపోతున్నాడు.

మనిషి ఆలోచనలు సకారాత్మకముగాను, సృజనాత్మకముగాను ఉన్నప్పుడే సార్థకమైన ప్రయోజనము చేకూరుతుంది. కొంగ్రొత్త ఆలోచనలను, భావనలను తన జీవితపు అభిన్న అంగములుగా మలచుకున్నప్పుడే సార్థకమైన ఉపలబ్ధి చేకూరుతుంది. చక్కని సృజనాత్మకమైన ఆలోచనలతోనే మనిషి మహత్కార్యములను పూర్తిచేయగలడు. ఆధ్యాత్మిక జీవనశైలిని చక్కగా అనుసరించినప్పుడే ఇదంతా సాధ్యపడుతుంది.

బీహార్‌కు చెందిన మిథిల్‌లోని దర్భంగా రాజ్యమునకు రాజు 'రమేశ్వర్ ప్రతాప్‌సింహ్!' ఇతని జీవనశైలి ఆధ్యాత్మికమైనది. ఆ జీవిత విధానమే అతనికి ఆధ్యాత్మికపథములోని దివ్య జీవన ద్వారములను తెరచినది. మహారాజు రమేశ్వర్ సింహ్ ప్రతిదినము అర్ధరాత్రి 2 గంటలకు నిద్ర మేల్కొనేవాడు. శయ్యమీద అలాగే కూర్చుని శ్రీదుర్గాసప్తశతిని ఒకసారి సంపూర్ణముగా పారాయణ చేసేవాడు. ఆ తరువాత 3 గంటలకు స్నానాదికములను ముగించుకొని వైదికరీతిలో సంధ్యా వందనము మరియు సహస్ర గాయత్రీ జపము చేసేవాడు. పిమ్మట రోజూ పిండ ప్రదానము చేసేవాడు. ఆ తరువాత బ్రాహ్మీముహూర్తములో శివ లింగమునకు పూజను పూర్తిచేసి, వెంటనే భగవతికాళి మందిరమునకు చేరుకునేవాడు. అక్కడ రమేశ్వర్ తాంత్రిక సంధ్యా వందనము చేసి, తంత్రవిధానములోనే కలశస్థాపన చేసేవాడు. వెనువెంటనే భగవతిమహాకాళికి పూజ చేసి, కొంత జపము పూర్తి చేసేవాడు. అక్కడే ఉండి పంచాంగ శ్రవణము చేసేవాడు. కకారాది బీజాక్షరములతో కూడిన సహస్రనామములను జపిస్తూ పుష్పాంజలి సమర్పించేవాడు. తదుపరి కుమారి, ముత్తైదువ, బ్రహ్మచారి మరియు సాధుసన్యాసులను యథావిధిగా పూజించి, దానము, తర్పణము వంటివి సమర్పించి చివరగా భగవంతుని ప్రసాదమును స్వీకరించి రాజప్రాసాదమునకు తిరిగి వచ్చేవాడు. అప్పటికి సమయము ఉదయము 10 గంటలు అయ్యేది.

**ఆహారాన్ని, అలవాట్లను సవ్యంగా నిర్ధారించుకుని పాటిస్తే రోగాలు వాటంతటవే నివారింపబడతాయి**

రాజమందిరములో 11 గంటల వరకు విశ్రాంతి తీసుకునే వాడు. 11 గంటలనుండి మధ్యాహ్నము 3 గంటల వరకు రాచ కార్యములను చక్కబెట్టేవాడు. మరల స్నానము చేసి వైదిక సంధ్యావందనము మరియు సహస్రగాయత్రీ జపము పూర్తిచేసే వాడు. దానివెనుకనే ప్రదోషకాలములో శివలింగమునకు అభిషేకమును ముగించేవాడు. ఇంతలో రాత్రి మరింత దట్టమయ్యేది. ఆ నిశిరాత్రిలో యథావిధిగా భగవతి అర్చనను పూర్తిచేసేవాడు. రాజు ఇవన్నీ చేస్తున్న సమయములో సమాంతరముగా ఒకవైపు 108 మంది బ్రాహ్మణులు నిరంతరము శ్రీదుర్గాసప్తశతి పారాయణ చేస్తుంటే, మరోవైపు 108 బ్రాహ్మణులు రుద్రాభిషేకమును చేస్తుండే వారు. అలాగే భగవతి మహాకాళి ఆలయమున దుర్గాసప్తశతి పారాయణ, దానితోపాటే వైదిక-తాంత్రిక రీతులలో గాయత్రీ జపము, శివాలయములో అభిషేకము నిరంతరముగా జరుగుతూనే ఉండేవి. తన సంపూర్ణజీవితమును 'మహాఅనుష్ఠానము'నకే అంకితము చేసిన రమేశ్వర్‌సింహ్ విద్యావంతుడు, మహా విద్వాంసుడు! ఆయన ఆంగ్లము, హిందీ, సంస్కృతము, ఫ్రెంచ్, బెంగాలీ భాషలలో నిష్ణాతుడు. అంతే కాకుండా తంత్రశాస్త్రముమీద చాలామంచి పట్టున్న పండితుడు కూడా! ఆయనకు వేదాంతము, సాంఖ్యము, యోగము మరియు వ్యాకరణముల మీద కూడా అంతులేని జ్ఞానము ఉన్నది. వాటిలో నిష్ణాతుడు! ఇవన్నీ ఆయన పొందగలిగాడు అంటే దానికి కారణము ఆయన యొక్క విశిష్టమైన జీవనశైలే!! మనందరకు మన ఆధ్యాత్మిక జీవితపు ఆయామములను గురించి తెలియదు. మనలో ఉన్న రహస్యమయమైన, దివ్యమైన శక్తులను గురించిన జ్ఞానము లేదు. శక్తి-సామర్థ్యములను గురించిన జ్ఞానముకూడా శూన్యమే. మిరుమిట్లు గొలిపే బాహ్య జీవితము, అది అందించే ఉపలబ్ధులనెన్నింటినో ఉపార్జించు కొనుటలోనే మనము మన జీవితములోని 80 శాతం ప్రాణశక్తిని వెచ్చిస్తున్నాము. మిగిలిన ఆ 20 శాతం శరీర నిర్వహణలో దానికదే ఖర్చయిపోతున్నది. ఈ కారణముగానే మనకు మన జీవితము యొక్క వాస్తవిక ఉపలబ్ధులు మరియు అనుభవములు, అనుభూతు లను గురించి అణుమాత్రము కూడా తెలియకుండా పోతున్నది.

ఒకవేళ మనము మన జీవితమును గురించి అర్థము చేసుకోవాలి, తెలుసుకోవాలి అని అనుకుంటే సాధన చెయ్యవలసి ఉంటుంది. సాధన చేస్తేనే జీవితపరమార్థం బోధపడుతుంది. అన్ని పక్షములను స్పృశించే రీతిలో మనలను మనము ఒక విశేషమైన జీవనశైలి అనే చట్రములో ఇముడ్చుకోవాలి. ఒక ప్రత్యేకమైన దానిని పొందటానికి కొంత త్యాగం చేయవలసి ఉంటుంది. అదే రీతిలో ఒకవేళ ఆంతరంగికముగా మనకు కొన్ని విశేషములను సాధించాలనే ప్రబలమైన కోరిక ఉంటే కనుక మనము మన అంతరంగము యొక్క ఆ పిలుపును ఆలకించి, ఆ దిశగా ముందడుగు వెయ్యవలసి ఉంటుంది. ఆ తరువాత లక్ష్యమును చేరుకునేందుకు ఇతర విషయములను త్యజించవలసి వచ్చినా వెనుకాడకుండా విడనాడి ముమ్ముందుకు సాగిపోవాలి. మనము మన లక్ష్యమును చేరుకొనుటలో మనకు అడ్డంకిగా నిలువకుండా, సహాయమును అందిస్తూ పురోగమింప జేసేదే సరైన జీవనశైలి. అదే దివ్యమైన జీవనశైలి!! చక్కని జీవన వ్యవస్థలో ఒక పద్ధతి ప్రకారము సమయమును విభజించుకుని అమలుపరచాలి. అంటే కాలనిర్ణయపట్టిక (టైమ్‌టేబుల్) రూపొందించుకొని, దాని ప్రకారము పనులను చక్కబెట్టుకోవాలి. అంతేకాదు చక్కటి కార్యనైపుణ్యశైలి కూడా ఉండాలి. ఇవి మనిషి తన జీవితములో ప్రగతిని సాధించుటలో సహాయపడే మహత్త్వ పూర్ణమైన అంశములు. మన జీవనశైలిని బట్టే మన వ్యక్తిత్వము మలచబడుతుంది, ఆవిష్కరించబడుతుంది. మంచి జీవన విధానమును ఆసరాగా చేసుకుని మనము మన జీవితమును అందముగా తీర్చిదిద్దుకొనగలమా లేదా వికృతముగా మలచు కొనగలమా అనే నిర్ణయము మనిషి చేతిలోనే ఉన్నది. 'మనము నిజముగా సరైన దిశలోనే ప్రయాణిస్తున్నామా?' అని మనము మన జీవన శైలిని గురించి నిరంతరము సునిశితముగా విమర్శ చేసుకొనవలసిన ఆవశ్యకత ఉన్నది.

జీవనశైలి ఏవిధముగా ఉండాలి అన్న ప్రణాళికను చక్కగా రూపొందించుకొనుటలో ఆవశ్యకమైనది ఏమిటంటే -ముందుగా మనిషి తన జీవితలక్ష్యమును నిర్ధారించుకోవాలి. అలా నిర్ధారించుకున్న తక్షణమే మిగిలిన జీవనమార్గము స్వయముగానే సరళముగా ముమ్ముందుకు సాగిపోతుంది. లక్ష్యమును నిర్ధారించు కున్న పిమ్మట ధైర్యసాహసములు, దృఢసంకల్పము, నిష్ఠ, సమర్పణలతో ఆ మార్గములోనే ముందడుగు వేస్తుంటే జీవిత లక్ష్యమును చేరుకొనుటలో ఎంత మాత్రము ఆలస్యము జరుగదు. అయితే జీవనశైలిని సంస్కరించుకున్నప్పుడే ఈ సుదీర్ఘ యాత్ర ఆరంభమవుతుంది. ఇదే జీవన ప్రణాళిక. మనిషిని ఉన్నతునిగా నిలబెట్టుటలో ఇదే చక్కని ఆలంబనగా నిలుస్తుంది.

*- అఖండజ్యోతి, డిశంబరు 2013*

*అనువాదం: శ్రీమతి లక్ష్మిరాజగోపాలు*

**మనిషి త్వరగా చనిపోవుటకు కారణం అతని నాలుకే**

# ఆత్మసత్తాలో నిహితమైన విభూతుల రహస్యోద్ఘాటన

ఆధ్యాత్మవేత్తల, ప్రవక్తల నిరంతర ఉద్బోధన, 'ఆత్మను తెలుసుకో', నిన్ను నీవు తెలుసుకో, నిన్ను నీవు గుర్తించు, లేచి నిలబడు అనెడి సంకేతాలనుబట్టి, ఆత్మిక ప్రగతిపథంలో ముందుకెళ్ళడానికి, వ్యక్తికి తన శరీరపంజరంలో ఉన్న అనేక రహస్యాల గురించి తెలియదని స్పష్టమౌతున్నది. ఈ సూక్ష్మ పొరల బోధపడగానే అతడు జీవన్ముక్తస్థితిని పొందుతాడు. సిద్ధార్థుని ఉదాహరణ సాధన ద్వారా బుద్ధత్వాన్ని ఎలా పొంద వచ్చో తెలుపుతుంది. కానీ వ్యక్తికి తన గురించి తెలుసుకొన వలసినది ఇంకా ఉన్నదనెడిది స్పష్టం. అతని గురించి అడిగినప్పుడు తక్షణమే పేరు, గోత్రము, వంశము మొదలైనవి చెప్పేస్తాడు. చాలామందికి శరీరము వేరని, దాన్ని నియంత్రించెడి ప్రాణము, ఆత్మ వేరని తెలుసు. దీనిని అర్థము చేసుకొనటానికి అనేక పురాణకథలు, శాస్త్రములు వింటారు, వాదించుకుంటారు. కానీ దీనివలన ఆత్మబోధ అవుతున్నదా అనెడిది ప్రశ్నార్థకమే?

నిజానికి మనిషి జన్మతః అజ్ఞానియే. క్రమముగా తన జీవితాన్ని ఏదోవిధంగా నడిపించుకొనుటకు, ఉదర పోషణకు, సమాజంలో పరస్పర సంబంధములకు అవసరమయ్యే విద్యలు మాత్రమే నేర్చుకుంటాడు. ఈ వ్యవహారిక జ్ఞానము వాతావరణము నుంచి లభిస్తుందని అనుకోవచ్చు. సుసంస్కారాలు, పూర్వజన్మల కర్మల ఫలస్వరూపముగా కొంతమంది అంతవరకే పరిమితమైపోకుండా ఇంకాస్త పైకి ఎదిగే చేతనత్వస్థాయిలో ఆలోచించడము మొదలెడతారు. వీరికి సరైన మార్గదర్శనము లభించినప్పుడు అజ్ఞానాంధకారాన్ని, జ్ఞానజ్యోతితో పోగొట్టు కుంటారు. ఇటువంటి వ్యక్తులే నరపశుస్థాయిని దాటి, భవబంధనములను త్రెంచుకొని బ్రాహ్మీచేతన ఆనంద రసాస్వాదనము చేస్తారు. వీరినే జీవన్ముక్తులు అంటారు.

తమగురించి తాము తెలుసుకోలేని విచిత్ర పరిస్థితిలో అనేకమంది వ్యక్తులుంటారు. కంటికి ప్రత్యక్షంగా కనిపించినదే సత్యము అనే మూఢులు, అన్య జీవప్రాణులకన్నా భిన్నం కాదు. నలుగురు గ్రుడ్డివారి కథ ప్రసిద్ధమేకదా! వారిలో ప్రతివొక్కరు తమ తమ అనుభవ అనుభూతులపరంగానే, ఏనుగును గుర్తించారు. వారి 'ఏనుగు' వారి ఊహలకు అనురూపంగా ఉంటుంది. ప్రతి మనిషియొక్క ఊపిరితిత్తులలో విస్తృతమైన క్షేత్రం ఉంటుంది. లోతైన శ్వాస తీసుకొనకపోవడం వలన సంపూర్ణంగా ఊపిరితిత్తులను ఉపయోగించకపోవడం వలన ఆ స్వల్ప క్షేత్రాన్నే ఉపయోగించుకొని జీవిస్తుంటారు. కానీ, దీనివల్ల క్షయ, ఆయాసము మొదలగు రోగములతో బాధ పడుతూ ఉంటారు. మస్తిష్కము యొక్క అపరిమిత సామర్థ్య సంపదలోని పదమూడు శాతము మాత్రమే బుద్ధిమంతులు సైతం ఉపయోగించుకుంటున్నారు. కానీ దీని అర్థము మిగతాదాని అస్థిత్వము లేదని కాదు.

ఇక్కడ మనుష్యుని యొక్క ఆత్మవిస్మృతి తద్వారా అతని యొక్క సూక్ష్మ పొరలు, వాటి వైభవ సామ్రాజ్యాల గురించి తెలుసుకోలేకపోవుట చర్చిస్తున్నాము. వీటిని వికసింప చేసుకొన గలిగితే వ్యక్తి 'అసామాన్య'స్థాయికి ఎదుగుతాడు. కాని దీనికి అడ్డంకి ఏమిటంటే స్థూలజగత్తుకు మాత్రమే ప్రాముఖ్యతనిచ్చే అతని దృష్టికోణము మారకపోవడమే. అనగా ప్రత్యక్షంగా కనిపించే దానికి మాత్రమే అస్థిత్వము (ఉనికి) ఉన్నది. కనిపించని దానికి విలువ లేదు అన్న భావన మారాలి.

అనాటమీలో శరీరంలోని భాగాల గురించి చెప్తారు. కాని ఈ శరీర భాగాలలోని చేతనత్వము యొక్క అనాటమీ గురించి తెలుపుట లేదు. శరీర అంతరాళాలలో ఉన్న పంచకోశములు, షట్చక్రములు, ఉపత్యికల వైభవసంపద కనిపించనప్పుడు ఫలానా స్థానములో వాటి ఉనికి ఉన్నదని ఎలా గుర్తిస్తాము? ఉపరసస్రావములు, శరీర అవయవ సంచాలన మొదలగు కంటికి దృగ్గోచరమయ్యేవాటినే సమగ్రం అనుకుంటారు. శరీరములో ప్రవహించే విద్యుత్‌ధార, జీవ అయస్కాంత క్షేత్రములను కొలవగలిగే ఉపకరణాలు కూడా కొంతవరకు మాత్రమే ఉపయోగపడుచున్నవి.

ఆధ్యాత్మికవేత్తలు తాము శరీరము యొక్క బంధనాలలో పరిమితమైనట్లు భావించరు. వారు పరోక్షజగత్తు యొక్క ఉనికిని స్వీకరిస్తారు. వ్యష్టి-సమిష్టిలలో సంవ్యాప్తమైన ఈ బ్రాహ్మీ చేతనత్వమును అత్యున్నత శక్తియొక్క క్షేత్రంగా గుర్తిస్తారు. వీరు 'ఆత్మసత్తా' యొక్క ప్రయోగశాలలో యోగ సాధనములు,

**ఎంత ఆకలిగా ఉన్నా ఒక ముద్ద తక్కువ తిన్నచో రోగాలు దరిచేరవు**

ధ్యానధారణ మొదలగు వాటితో స్వయంగా తన అంతరాళాలలో నిశిత పరిశీలన చేసి, ప్రకృతి యొక్క సూక్ష్మ అంతరాళాలకి మధ్య ఇచ్చిపుచ్చుకొనుటకు వీలైన మార్గములను అన్వేషిస్తారు. శాస్త్రము యొక్క నిష్కర్షములు, ఆప్తవచనములలో ఈ రోమాంచం కలిగించే రహస్యమైన ఉద్ఘాటన చేయబడినది. ఈ ప్రత్యక్ష దృశ్యమాన బ్రహ్మాండము, సౌరమండలము ఎంత సత్యమో, సూక్ష్మజగత్తుకూడా అంతే సత్యము.

స్థూలశరీరమును ఉపయోగించుకున్నప్పుడు దాని బరువుతో అది త్వరగా అలసిపోతుంది. కానీ సూక్ష్మశరీరము బరువులేనిది. అది కాంతి వేగము కంటే తీవ్రమైన వేగముతో తరంగాల సముదాయ రూపంలో సూక్ష్మజగత్తులో నిరంతరము పరిభ్రమిస్తూ స్థూలశరీరము ద్వారా ప్రత్యక్షముగా చేయలేని అసంభవాలను సంభవమయ్యేటట్లు చేస్తుంది. అందువల్లనే అన్ని ఆయామముల (Dimentions) పరిధికి ఆవల ఉన్న విభిన్న లోకాంతరములలో నిరంతరము భ్రమణము చేస్తున్న సూక్ష్మశరీరము ధరించిన దేవాత్ములు, అంతుపట్టని అనేక ప్రయోజనాలు సాధించడము జరుగుతుంది. చాలాసార్లు ఇటువంటి సంఘటనలను సంయోగమని (chance) లేక దైవానుగ్రహమనీ అనుకొని సరిపెట్టుకొంటారు. ఆత్మసత్తాయొక్క ఈ సూక్ష్మీకరణ విధానము చాలా అద్భుతమైనది. ఋషులు, దేవమానవులు, మహామానవుల స్థాయిని పొందిన ప్రజ్ఞావంతులు ఈ శరీరంలో ఉంటూనే అసంభవమైన పురుషార్థములు చేయుటను గమనించవచ్చు. జీవన్ముక్తస్థితిలో సశరీరముగా ఈ ధరిత్రిమీద ఉన్న మహాపురుషులకు ఆయువు ప్రతిబంధకము కాదు. కొంతమంది దేవపురుషులు దేహమును త్యజించిన తరువాత కూడా సూక్ష్మరూపంలో మానవ కళ్యాణ కార్యక్రమాలు సాగిస్తూనే ఉంటారు.

ఈ చర్చ నా యొక్క సూక్ష్మీకరణ సందర్భంలో అవసరమే కనుక చేస్తున్నాను. ప్రత్యక్షంగా, ఈ స్థూలశరీరముతో, నా ద్వారా చేయబడిన పనులయొక్క మూల్యాంకనము (evaluation) ఇప్పుడు జరుగదు. రాబోయే కాలంలో జరుగుతుంది. ఈనాటి యుగసంధియొక్క విషమపరిస్థితులలో 'ఆస్థా సంకటము' (విశ్వాస రాహిత్యం) యొక్క నిర్మూలన కొరకు, ఆత్మశక్తినే ఉపయోగించితీరాలి. నేను, నాయొక్క 24 సంవత్సరముల ఉచ్చస్థరీయ గాయత్రి సాధన, దైనందిన ఉపాసన, ఆరాధనల వలన ప్రత్యక్షంగా చేసిన కార్యక్రమాలలో అనేక అధ్యాయములు పూర్తయ్యాయి. కొద్దిగా మాత్రమే మిగిలి ఉన్నది. ఇదే నాయొక్క అత్యంత గొప్ప పురుషార్థమై వర్తమానంలో సమగ్రమైన మార్పు తీసుకువస్తుంది. ఆత్మసత్తా యొక్క సూక్ష్మీకరణ రూప ప్రత్యక్షీకరణములో ఎట్టి చమత్కార పూర్ణమైన మార్పులు రాబోతున్నాయో, అందరు త్వరలోనే స్పష్టంగా చూడగలుగుతారు.

ఒక ప్రశ్న ఉదయించవచ్చు. ప్రత్యక్షంగానే, స్థూల శరీరంతోనే ఇన్ని అసంభవమనిపించే కార్యక్రమాలు చేయగలిగితే పరోక్షస్థితికి దిగవలసిన అవసరము ఏమి ఉన్నది? దీనికి ఒక్కటే జవాబు. ఈనాటి విపత్కర, విషమ, విరాట్ స్వరూపాలు చూసి ఆ దైవీచేతనత్వము, వాటి నివారణ సూక్ష్మశరీరంలో ఉన్న అనేక దేవాత్మల ద్వారా చేయదలచింది. స్థూలజగత్తులో సమాజ తంత్ర వ్యవస్థ ఎలా ఉంటుందో, సుమారు అటువంటిదే పరోక్ష జగతిలో కూడా ఉన్నది. అక్కడ నిరంతరము, అదృశ్య సహాయకులు, పితృగణాలు, సూక్ష్మశరీరధారి ఆత్మలు దేశకాలాతీతులై పరిభ్రమిస్తూ ఉంటారు. కంటికి కనిపించక పోయిన వారు తమ క్రియాకలాపాలతో సమిష్టి జగత్తును ప్రభావితం చేస్తూ ఉంటారు. సూక్ష్మీకరణ సాధన చేసిన సాధకుడు ఆ శ్రేణిలోనే చేరి పృథ్వీమీద శరీరము ధరించి ఉన్నప్పటికి, వారితో ప్రత్యక్ష సంబంధము ఏర్పరచుకుంటాడు.

భౌతికంగా శరీరధారులై ఉన్నప్పటికీ, తంత్రశాస్త్రవేత్తలు తమయొక్క అదృశ్యఅణువులను తయారుచేసుకొని తద్వారా పిల్లల కథలలో అల్లాఉద్దీన్ అద్భుతదీపము యొక్క భూతంవలె పనులు చేయించుకుంటారు. సోక్రటీస్ యొక్క డెమన్ (demon) సంభవతః అలాంటిదేనేమో. సూక్ష్మశరీర జాగృతి నిజానికి ప్రత్యక్ష, అప్రత్యక్ష జగత్తుల మధ్య ఇచ్చి-పుచ్చుకొనే ప్రక్రియను ఏర్పరచుతుంది. అంతేకాక ఆత్మసత్తా మానవునికి తెలియని అనేక రహస్యాలను తెరబయటికి తెస్తుంది.

సూక్ష్మశరీర జాగరణ కొరకు సాధకుడు తన యోగాభ్యాసంలో అనేక రకాల ధ్యానధారణలను చేసుకొనవలసి వస్తుంది. షట్చక్రములు, పంచకోశములు, మూడు గ్రంథులు, ఇడా, పింగళా, సుషుమ్నానాడులు ఏ స్థాయిలో ఉంటాయో వాటి అవిజ్ఞాత వైభవాలు జాగృతమైనప్పుడు సాధకుడు అనంత వైభవములకు స్వామి అవుతాడు. కుండలినీ మహాశక్తి గురించి

**కఠోర శ్రమ, బాగా ఆకలిగా ఉన్నప్పుడే తినుట, గాఢ నిద్ర ఈ మూడు ఆరోగ్యానికి మూలసూత్రాలు**

నేను విస్తారంగా వివరిస్తూనే ఉన్నాను. ఈనాడు సమస్త ప్రపంచములో ప్రచారంలో ఉన్న అతీంద్రియశక్తులన్నీ 'సూక్ష్మీ కరణ' యొక్క అత్యంత సూక్ష్మ వ్యక్తీకరణ మాత్రమే. అంతేగాక ఉచ్ఛస్థరీయ అనేక తలాలలో (planes) సిద్ధులకు గాక ఆత్మ యొక్క విభూతులకే ప్రాధాన్యత ఉంటుంది. మనస్సు చేతనత్వం శక్తుల ఉపయోగంతో సిద్ధ సాధకులు ప్రత్యక్షంగా శరీరములో అసంభవమనిపించే కార్యములు సాధించ గలుగుతారు. ఈ చమత్కారములన్నీ సూక్ష్మీకరణ జన్యములే.

కారణశరీరము, దేవస్థరీయ ఆత్మలు కార్యరతులై ఉండే చేతనత్వం (Consciousness) యొక్క ఆయామము (Dimensions). సూక్ష్మీకరణ ప్రక్రియయొక్క చరమస్థితిలో మానవుని వ్యష్టిచేతన-సమిష్టిగత దేవచేతనతో సమన్వయము స్థాపించుకొనుటయే కారణశరీర జాగృతి. ఈ స్థాయికి చెందిన మహాపురుషులకు తమకంటూ వ్యక్తిగతమైన కోరికలు ఉండవు. అంతఃకరణ యొక్క సూక్ష్మపొరలతో నిర్మితమయ్యే కారణ శరీరము ఆధ్యాత్మిక ఫిజియాలజీ ప్రకారము ధరాతలంకంటే పైకి లేచిన చేతనత్వము, సమిష్టి చేతనత్వంతో తాదాత్మ్యము చెందుట యొక్క ఒక విశిష్ట ప్రక్రియ మాత్రమే. ఈ జాగరణ వల్ల లోపల ఉన్న దేవశక్తులు జాగృతమవుతాయి. ఏ పంచ దేవతలను, శరీరస్థ పంచదేవతాశక్తుల ప్రతినిధులు అంటారో, అవి పంచకోశములవలె శరీరములోనే ఉన్నాయి. నిజానికి ఇవి మానవ చేతనత్వము యొక్క 5 పొరలు. చివరి స్థితిలో ఇవి దైవీచేతనత్వములో కలిసిపోతాయి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ పేర్లతో సంబోధించబడే చేతనత్వము యొక్క ఐదు ఆయామములు నియంత్రణలోనికి తెచ్చుకున్న సాధకుడు దేవపురుషుల శ్రేణిలో చేరుతాడు. పదార్థవిజ్ఞానులు మూడు ఆయామములతోనే పరిచితులు. ఐన్‌స్టీన్ దేశ-కాలముల రూపంలో చేతనత్వము యొక్క చతుర్థ ఆయామము గురించి కల్పనలను చేశాడు. అక్కడ ప్రతి పదార్థము (anti matter) ప్రతికణములు (anti particles) యొక్కఉనికిని ఊహిస్తున్నారు. ఈ నాలుగవ ఆయామము మీద ఐదవ ఆయామము ఉన్నది. దీని ఉనికిని గురించి వైజ్ఞానికులకు ఏవిధమైన ఊహా లేదు. ఆధ్యాత్మవేత్తలు ఈ అంతిమ ఆయామములోనే చేతనసత్తాయొక్క ఉనికి ఉందని చెబుతారు. ఇక్కడ సూక్ష్మీకృత వ్యష్టిచేతనత్వం వ్యాపించి ఉంటుంది.

మానవుని శరీరంలో పరోక్షజగత్తుయొక్క సూక్ష్మశరీరమును విధాత చాలా దక్షతతో అల్లాడు. ఈ సూక్ష్మశరీరమును జాగృతము చేసుకొని బహుముఖ ప్రజ్ఞలు సాధించగలిగే స్వాతంత్ర్యము కూడా ఇచ్చాడు. సిద్ధపురుషులు ఇదే చేస్తారు. స్థూలమునుండి సూక్ష్మశరీరము, అక్కడనుండి కారణశరీర జాగృతి కొరకు సాధనా పురుషార్థము చేసి, ఆప్తవచనాల ప్రమాణికతను ఋజువు చేస్తారు. ఏ పనిని రాగరహిత, స్ఫూర్తి, ఉత్సాహాలతో కూడిన భౌతికశరీరము చేయగలదో దానికి అనేకరెట్ల ఆలోచనల, భావనల క్షేత్రంలో సూక్ష్మ, కారణ శరీరాలు పని చేయగలుగుతాయి.

నిజానికి సూక్ష్మీకరణ సాధన ఆత్మజాగృతి యోగసాధన. దీనివలన వ్యక్తి స్వయంగా అనంత విశాలత్వము పొందటమే కాక పరోక్షముతో సంబంధము ఏర్పరచుకొని అనన్య వ్యక్తులకు, వాతావరణమునకు, సమస్త సముదాయానికి లాభము చేకూర్చుట కూడా సంభవమే. నా సాధన ఈ ఉచ్ఛస్థరీయ లక్ష్యములను సాధించే నిమిత్తమే చేయబడుతున్నది.

*- అఖండజ్యోతి*

## 9 రోజుల సంజీవనీ సాధనా శిబిరం

*గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో ప్రతి సంవత్సరం జరిగెడి 9 రోజుల సంజీవని సాధనా శిబిరం తెలుగు భాషామాధ్యమంగా 11 మే నుండి 19 మే 2015 వరకు జరుగును. ఈ శిబిరంలో పాల్గొనదలచినవారు ఈ క్రింది సమాచారాన్ని తెలుపుచూ శాంతికుంజ్‌నకు లేఖను వ్రాసి వారి స్థానాన్ని ఖరారు చేసికొనవలసిందిగా కోరడమైనది.*

*1. పూర్తిపేరు మరియు చిరునామా; 2. విద్యార్హతలు; 3. వయస్సు & పుట్టినతేది*

*శిబిరంలో పాల్గొనెడివారు శాంతికుంజ్‌నకు 10వ తేది ఉదయానికి తప్పక చేరుకొనవలయును.*

*లేఖను వ్రాయవలసిన చిరునామా:*
*శ్రీ వేదమాతా గాయత్రీ ట్రస్టు, శాంతికుంజ్,*
*సౌత్‌సెల్, హరిద్వార్ (ఉత్తరాఖండ్)*

**ఆత్మవిశ్వాసం గలవారు, ఒంటరిగా ఉన్నప్పటికీ తాము ఎంచుకున్న మార్గంలో నడుస్తారు**

## పూజ్య గురుదేవుల అమృతవాణి

# లోకశిక్షకుల జీవనోద్దేశ్యం, లక్ష్యం - 4

***తమ జీవితాలనుండి అజ్ఞానమును, అంధకారమును తొలగించుకొని, తమను తాము లోభమోహముల నుండి విముక్తి కలిగించుకొనుటయే జీవితములోని ఏకైక లక్ష్యమూ, గమ్యముగా ఉండాలని భావికాలపు లోకశిక్షకులను సంబోధిస్తూ పరమపూజ్యగురుదేవులు తమ యొక్క ఈ విశిష్టమైన ప్రబోధము ద్వారా లోకశిక్షకులకు బోధిస్తున్నారు. 'ఈ అంశములను తమ జీవితములో ఆచరించనిదే, ఇతరులను ప్రభావితం చెయ్యటం సాధ్యం కాదు' అనికూడా ఉద్ఘాటిస్తున్నారు. ఉపన్యాసాలు చెప్పటం ద్వారా ప్రజలను ఆకర్షించగలమేమో కానీ, వారి వ్యక్తిత్వాలలో శాశ్వతమైన మార్పును తీసుకురాజాలము. జీవితములో త్యాగము, బలిదానములు ప్రవేశించుటయేకాక, ఆలోచన, వ్యక్తిత్వము, ప్రవర్తన.... మొదలైన అంశములలో ప్రామాణికత(ఋజుత్వము)ను తీసుకురాగలగటమే 'ఆధ్యాత్మికత' అని చెప్పబడుతుంది. తమ జీవితములో ఆధ్యాత్మికతను ఆచరించగల్గినవారే లోకశిక్షకులుగా పనిచెయ్యగలిగే బాధ్యతను నిర్వహించగలరు. ఈవిధమైన ఆచరణ ద్వారానే తాము లక్షలాదిమంది ప్రజల జీవితాలను ప్రభావితము చెయ్యగలిగినామనీ, ఇలా చెయ్యటమే మనందరి కర్తవ్యమనీ గురుదేవులు ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!***

### మేము నాటాము- కోసుకున్నాము

మిత్రులారా! లోభమును, త్యాగము చెయ్యటము ద్వారా అంతరంగములో ఉత్పన్నమయ్యే ఆకర్షణ, అయస్కాంతముల సహాయముతో ప్రజలను ప్రభావితులను గావించి, వారిని కూడా లోభమోహములను త్యాగము చెయ్యమని ప్రబోధించడములో మేము సఫలీకృతుల మయ్యాము. మిమ్మల్నికూడా అందుకోసమే తయారుచేశాము. ఇంకా మరింత మందిని తయారుచెయ్యబోతున్నాము. బుద్ధ భగవానుడు ఈ రీతిలోనే అసంఖ్యాకమైన యువతీయువకులను తమ తమ గృహాలను, సుఖములను పరిత్యజించి పరివ్రాజకులుగా మారటానికి సంసిద్ధులయ్యేవిధంగా ప్రభావితం చెయ్యగలిగాడు. ఆయన ఎక్కడికి వెడితే ప్రజలు అక్కడికి అనుసరించారు. అదేవిధంగా వివేకానందుడిని అనుసరించి సోదరి నివేదిత మొదలుకొని వేలాదిమంది వ్యక్తులు కార్యరతులై ఆయనను అనుసరించారు. గాంధీగారి వాక్కుల ద్వారా ప్రేరణ పొందిన అసంఖ్యాక ప్రజానీకం వారితోపాటు కారాగారవాసమును అనుభవించటానికై సంసిద్ధులైనారు.



ఇటువంటి ఆకర్షణనే మీరుకూడా ఉత్పన్నము చేసుకోవాలి. ఉపన్యాసము చెప్పటమో, కథాగానము చెయ్యటమో మీరు నేర్చుకొనవలసిన అవసరము లేదు. 'ఈ కళలను నేర్చుకొని మేము ప్రజాసేవ చేస్తున్నాము. ప్రజాసేవ చేస్తున్నాము' అని మీరు అనుకుంటే అది చాలా పొరపాటు. **అందుచేత పసుపు వస్త్రములను ధరించిన వెంటనే మీరు చెయ్యవల్సిన మొట్ట మొదటి పని-మీరు మీ జీవనవిధానమును అనగా రీతి నీతులను మార్చుకొనటము.** అందుకోసము మీరు ఏయే పరిస్థితుల నెదుర్కొనవలసి ఉంటుందో మాకు తెలియదు. 'ఆధ్యాత్మిక జీవితములో ప్రవేశించేందుకు శక్తి ఉండాలంటే, మీరు విరాగి కావలసి ఉంటుంది' అన్న అంశము మీకు స్పష్టముగా బోధపడాలి.

చేతిలో దండమూ, కమండలమూ పట్టుకొని, మెడలో మాల, నుదుటున తిలకమూ ధరించినంత మాత్రమున విరాగులు కాలేరు. దృష్టికోణమును వంద శాతం సంస్కరించుకున్నప్పుడే విరాగి అవుతారు. ఇక ఇప్పుడు డబ్బు సంపాదించడమనే ఆలోచన అంతగా పెట్టుకొనకూడదు. ఉన్న ధనమును

**మంచి చెడు పనులకు మూలం వ్యక్తి ఆలోచనలే**

వీలైనంత తక్కువగా ఖర్చుపెట్టగలిగే మార్గమేది?' అనే ఆలోచించాలి. తగ్గించే దారి ఏమాత్రము కనిపించినా తక్షణమే దానిని అమలుచెయ్యండి. త్రికరణశుద్ధిగా సాధుజీవితమును గడిపే ప్రయత్నము చెయ్యండి. ఇంటిలోనే ఉంటూ 'సాధు జీవితము' వంటి జీవితమును గడపటానికి మీ ప్రయత్నమును ఆరంభించండి.

### సాధువులు పేదవారే కానీ దరిద్రులు కారు

సన్యాసులు(సాధువులు) పేదవారే కానీ దరిద్రులు కారు. పేదవాడికీ, దరిద్రుడికీ మధ్య భూమ్యాకాశముల మధ్య ఉన్నంత తేడా ఉంటుంది. బాగా తెలిసి తెలిసీ తక్కువ ఖర్చుతో జీవితమును గడపాలనే యోచన ఉన్నవారు, ఆవిధంగా జీవించేవారు పేదవారు. ఎక్కడినుండో అనవసరమైన ధనమొచ్చి మీ వద్ద జమపడినదనుకోండి, తక్షణమే దానిని ఒక 'వ్రణమును' తొలగించేవిధంగా తొలగించి వెయ్యండి. ఇది మీకు కష్టమును, బాధనూ కలిగించినాసరే, తప్పదు. అనవసరమైన ధనమును కూడబెట్టడమనేది సాధుసన్యాసులకు తగినది కాదు. వ్రణమును శరీరమునుండి కోసి తొలగించకపోతే అది లోలోపల కుళ్ళుతుంది. శరీర భాగములనన్నింటినీ నాశనము చేస్తుంది. ఇదేవిధంగా అనవసరముగా కూడబెట్టిన సంపద మీకు, మీ భార్యా బిడ్డలకే కాదు, మీ వంశస్థులందరికీ కూడా హానికరమే అవుతుంది.

ప్రజలకు బోధించటానికి మీకు నేర్పించబడే యోగమూ, తపస్సూ ఇక్కడనుండే ప్రారంభమౌతాయి. ఇందులోనే అసలైన విలువ తెలుస్తుంది. మీ నిజాయితీ గీటురాయిపైన పరీక్షింప బడుతుంది. లోభమోహములను తొలగించుకున్నప్పుడే భగవంతుడు దర్శనమిస్తాడు.

లోభమోహములను తొలగించుకొనడమనే రెండు పరీక్షలలో మనము విజయమును సాధించగలిగినప్పుడు భగవంతుడు మనకు లభిస్తాడు. మన శక్తినంతటినీ ఈ ఇద్దరు రాక్షసులు హరించివేస్తుంటారు. కాబట్టి ముందుగా వీరిని నిర్మూలించాలి.

భగవంతుడిని సేవించాలనే కోరిక, మనస్సు మీకున్నాయా? అసలు మనస్సే లేనప్పుడు ఇక సేవించడమనే ప్రసక్తి ఎక్కడ! మనస్సు మీకు బానిస అయిపోతుంది. అది ఎప్పుడో తాకట్టు పెట్టబడింది. ఇక మనస్సును ఎవరిపట్ల లగ్నము చేస్తారు? ఏవిధంగా లగ్నము చేస్తారు? మిమ్మల్ని మీరు చక్కదిద్దు కొనడానికి భగవంతుడిని మాధ్యమముగా చేసుకోండి.

మీ లోపల ఆకర్షణను ఉత్పన్నము చెయ్యదలచుకుంటే మోహమును త్యాగము చెయ్యవలసి ఉంటుంది. మేము ఇక్కడినుండి వెళ్ళేటప్పుడు మా దగ్గర 80 సెంట్ల భూమి మిగిలింది. 'మీరు హిమాలయములకు వెళ్ళిపోతున్నారుకదా, ఆ 80 సెంట్ల భూమిని ఎవరో ఒకరికి ఇవ్వటమో, వ్రాయటమో చేసి వెళ్ళండి' అని మా బంధువులందరూ అన్నారు. నేను ఆ తప్పు చెయ్యను. మా కుటుంబములోనివాళ్ళు, మా పిల్లలు లేదా మా బంధువులు, వంశస్థులూ... కుంటివాళ్ళో, గుడ్డివాళ్ళో అయితే ఇచ్చేవాడినేమో. పిల్లలు పసివాళ్ళయితే వాళ్ళ ఆలనా పాలనా, చదువుసంధ్యలు మొదలగు బాధ్యతలు పూర్తి కావాలి కాబట్టి ఇచ్చేవాడినేమో. కానీ మా కుటుంబములోని వారందరూ కుంటితనము లేదా గుడ్డితనము లేకుండా సక్రమముగానే ఉన్నారు. మా పిల్లలిద్దరూ ఎమ్.ఎస్.సిలో ఉత్తీర్ణులై, వివాహములు చేసుకొని స్థిరపడ్డారు. ఇక ఇప్పుడు నాకు వారికి సంబంధించిన ఏ బాధ్యతా లేదు. మా తాత తండ్రులు, పెద్దవాళ్ళు మా కిచ్చిన సంపదను ప్రజాహితం కోసం, సమాజానికివ్వడం ద్వారా కలిగే మేలు ఎంతో గొప్పది. కుటుంబసభ్యులకో, వంశీకులకో ఇవ్వవలసిన పనిలేదు.

### ప్రజాహితము కోసము చెయ్యబడినవే చట్టాలు

ప్రభుత్వం మాకు గనుక అధికారమును అప్పగిస్తే, 'ఎలాంటి బాధ్యతలూ మిగిలిపోకుండా ఎవరైనా వ్యక్తి మరణిస్తే, అతని సంపదను అతని వారసులకు ఒక్క రూపాయి కూడా అప్పగించకుండా, మొత్తము ఆస్తిని వేలం వేసి ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాలో జమచేసేవిధంగా చట్టమును తయారు చేస్తాము.'

ప్రజలకు మీ పట్ల ఆకర్షణ ఉత్పన్నము కావాలంటే అలాంటి అయస్కాంతశక్తి మీలో ప్రోదిచేసుకోవలెనంటే మీరు లోభమోహముల మీద అంకుశమును ఉపయోగించవలసిన స్థితినుండి ప్రారంభించండి. మావద్ద మిగిలిన 80 సెంట్ల స్థలమును తమకు అప్పగించలేదని మా బంధువులందరికీ మామీద కోపం వచ్చింది. వచ్చినాసరే, మేము వాళ్ళ కోప తాపాలను పట్టించుకోకుండా ఆ స్థలమును ప్రభుత్వోన్నత పాఠశాలకు ఇచ్చివేశాము. ఇప్పుడు కూడా 'మాతాజీ' పేరిట

**ఒక చక్కని ఆలోచనాపరుడు లక్షల కోట్ల మందికి నాయకుడు కాగలడు**

అది నడుస్తున్నది. ఇంతకుముందు మా చిన్నపల్లెటూరులో కేవలం ప్రాథమికపాఠశాల వరకే ఉండేది. అది ముగించాక ఉన్నతపాఠశాలకు వెళ్ళలేక ఎక్కువమంది విద్యార్థులు చదువు ఆపివేశారు. ఇప్పుడు అదే పల్లెలో మెట్రిక్, ఇంటర్‌వరకూ కళాశాల ఉన్నది. ప్రతి సంవత్సరము 50, 60 మంది ఆడ పిల్లలు మెట్రిక్ ఉత్తీర్ణులవుతున్నారు. మగపిల్లల విషయానికి వస్తే బి.ఎ. చదవని వారే లేరు. చదువుకోసం ఒక వ్యవస్థ ఉండటమనేది అవసరమే కాదు, అనివార్యము కూడా. అక్కడి ప్రజలు ఇప్పుడు 'గ్రామములోని బాలబాలికలందరూ గురువు గారి పిల్లలే!' అని అంటుంటారు.

## మా ప్రేమయే ఆ కుటుంబానికి ఆధారము

'మా ఇల్లు, మా కుటుంబము' అనే చిన్న పరిధినుండి లోభమును లాగివేసి, ప్రేమరూపములో పంచుతూ సాగి పోయాము. చదువు ముగించిన ఆడపిల్లలను తీసుకు పోవటానికి వాళ్ళ తల్లిదండ్రులు వస్తే, ఆ పిల్లలు మమ్మల్ని వదలలేక వదలలేక వెక్కివెక్కి ఏడుస్తూ వెళుతుంటారు. అత్త వారింటికి వెళ్ళే ఆడపిల్ల వలె వాళ్ళు మావద్ద కన్నీళ్ళతో వీడ్కోలు తీసుకుంటుంటారు. ఈవిధంగా లక్షలాదిమంది పిల్లలతో మా ప్రేమనూ, మోహమునూ పెంచుకున్నాము.

మీరుకూడా ఇటువంటి ప్రేమను పెంపొందించుకొన గలరా? తప్పకుండా పెంపొందించుకొనగలరు. అయితే దానికి కావలసిన షరతు ఒక్కటే. మీ ప్రేమను చిన్నకుటుంబమనే దాని నుండి లాగి, బయటకు తీసుకువచ్చి, దానిని విశ్వవ్యాప్తం చెయ్యటానికి ప్రయత్నించండి. అప్పుడు మీరు ఎక్కడకు వెడితే ప్రజలు అక్కడకు మీ వెన్నంటి వస్తారు.

ప్రజల మనస్సులను మార్చవలసి ఉన్నది. నిజానికి చెప్పాలంటే వాళ్ళ మెదడును మార్చే పనిని మీరు చెయ్య నవసరము లేదు. మెదడును మార్చేపనికోసము మేము చాలా సంవత్సరముల నుండీ 'అఖండజ్యోతి, యుగనిర్మాణయోజన'ల ద్వారా ప్రయత్నము చేస్తూనే ఉన్నాము.

పుస్తకాలు ప్రచురించడము ద్వారా, వాక్కు ద్వారా (వ్యాఖ్యానములు చెప్పడం ద్వారా) ప్రయత్నములన్నీ ఇదివరకే జరిగినాయి. దానివలన చెవులకు, కన్నులకు ఆనందము కలుగుతుంది. మన విజ్ఞానము పెరుగుతుంది. మన నేటికీ మనము చెయ్యవల్సినదేమిటంటే మనిషిలోని నిజాయితీని జాగృతము చెయ్యటము. మెదడును మార్చాలనే ప్రయత్నము ఎప్పుడూ చెయ్యలేము. ఎందుకంటే మెదడు చాలా తెలివైనది. దానికి పరీక్షలు, శిక్షలు, ప్రవచనాల అవసరము లేదు. మనిషిని ప్రభావితము చెయ్యగలిగే తత్త్వముల మీద ప్రోద్బలము, ప్రేరణలను అందించగలిగితే చాలు.

మానవుడి లోపల ఒక ప్రత్యేకత నిండియుంటుంది. దానికి ఇతర మనుష్యులను అనుకరించడము తెలుసు. ఒక వేశ్య తన జీవిత కాలములో తనవంటివారిని కొన్ని వందలమందిని తయారుచేస్తుంది. అలాగే ఒక త్రాగుబోతు తన మిత్రులందరినీ దాదాపుగా త్రాగుబోతులుగా తయారుచేస్తాడు. కానీ ఒక సన్యాసి, ఒక పండితుడు, ఒక గురువు, ఒక జ్ఞాని తనవంటి ఒక గురువును లేదా జ్ఞానిని తయారుచేయలేడు. వారు ఆధ్యాత్మికతను వాక్కుకు, మెదడుకు మాత్రమే పరిమితము చేస్తారు. జీవితములోకి క్రియలోకి దానిని ప్రవేశించనివ్వరు.

## అంతరంగములోకి ఆధ్యాత్మికతను ప్రవేశించనివ్వండి

'ఆధ్యాత్మికతను హృదయములోకి ప్రవేశింపజేసినట్లయితే మన లోభమోహములకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంటుంది' అని వారి భావన. అందుచేత ఈ రెండింటినీ నాలుక కొనవరకూ మాత్రమే పరిమితము చేద్దాము. భాగవతము, సత్సంగము, కథాకీర్తనలు వింటాము. అంతకు మించి ముందుకు పోరాదు అని భావిస్తుంటారు. ఆధ్యాత్మికశక్తి అనేది చెవులకు, మెదడుకు సంబంధించినది కాదు. శక్తి అనేది అంతరంగములో ఉంటుంది. దానిలోనికి ఆధ్యాత్మికతను ప్రవేశించనివ్వండి. వానప్రస్థజీవితానికి సంబంధించిన శిక్షణ, ఉద్దేశ్యమూ ఇదే!

మేము ఇక్కడినుండే మీకు దిశానిర్దేశము గావించినాము. ఇక్కడినుండే మీకు గమ్యమును, లక్ష్యమును ఏర్పరచినాము. మీరు ఇక్కడినుండి మానసికపరమైన వైరాగ్యభావముతో వెళ్ళటానికి సంసిద్ధులు కావాలి. కుటుంబపరమైన బాధ్యతలు, కర్తవ్యాలు మీకు ఎంతవరకు ఉన్నాయో మాకు తెలియదు. మేము మిమ్మల్ని వదిలిపెట్టాలని అనుకోవడము లేదు. మిమ్మల్ని మరింత శక్తివంతులను గావించడానికే మేము ప్రయత్నిస్తున్నాము. మీరు ఇక్కడినుండి మానసికముగా వైరాగ్యమును అలవరచుకొని వెళ్ళమని మేము కోరుతున్నాము. సంపూర్ణమైన విరాగి

**ఉచ్ఛస్తరీయ వ్యక్తిత్వాల నిర్మాణం ఆలోచనల వికాసంతోనే సాధ్యపడుతుంది**

జీవితమును గడపటానికి పరిస్థితులు మీకు అనుకూలించి నప్పుడు 'మేము వ్యక్తిగత జీవనానికి ప్రాధాన్యత నివ్వము. వ్యక్తిగతమైన సుఖసంతోషములు, ఆకాంక్షలకోసము మేము జీవించము. వ్యక్తిగతజీవితానికి ముగింపు పలికి, సామాజిక-సామూహిక జీవనాన్ని ప్రారంభిస్తున్నాము' అనే దృఢమైన నిర్ణయము తీసుకొనవలసి ఉంటుంది. పరిస్థితులు అనుకూలించినప్పుడు మీ సమయమునంతటినీ లోకహితము కోసము, సంస్కృతీసంప్రదాయముల కోసము, దేశం కోసం, ధర్మం కోసం పూర్తిగా వినియోగించండి. ఆ పరిస్థితులు రేపే మీకు అనుకూలమైతే, ఎల్లుండివరకూ ఎదురుచూడవద్దు. సమయానుసారం పరిస్థితులకనుగుణముగా మీ బంధనాలను సడలించుకుంటూ, పూర్తి సమయమును సమాజశ్రేయస్సు కోసము, ప్రజాహితము కోసము వెచ్చించండి.

## జీవితమును తపోమయము, జ్ఞానమయము గావించుకోండి

మీ మనోభూమినుండి లోభమోహములను కూకటివేళ్ళతో సహా పెకలించి వెయ్యండి. ఆత్మపరిశీలన, విమర్శ గావించు కుంటూ ఉండండి. లోభమోహముల కోసము మనకు అవసరమైన శక్తులను అనవసరముగా ఖర్చుచేస్తున్నామా? అని దినదినము ఆత్మపరిశీలన గావించుకుంటూ ఉండండి. సత్సంగము కోసము మీ శక్తులను వెచ్చిస్తూ ఉన్నట్లయితే మీ కర్తవ్యపాలనకు, శరీర పోషణకు, గృహనిర్వహణకు కూడా అవసరమయ్యే శక్తి మీకు లభించగలదని మేము ఆశీర్వదిస్తు న్నాము. మీ తెలివితేటలు, మానసికశక్తులు, ప్రభావవంతమైన శక్తులు, ఒకవేళ ధనలోభములకోసము వినియోగించబడు తున్నవని మీరు గమనిస్తే సాధ్యమైనంత త్వరగా వాటిని ఖండించ టానికి ప్రయత్నించండి. ఈవిధంగా మీరు జీవితమును భక్తిమయముగా, తపోమయముగా, యోగమయముగా, జ్ఞానమయముగా తీర్చిదిద్దుకొనవలసి ఉన్నది.

జ్ఞానవంతులు కావటానికి జీవితములో మేము ఆచరించిన దానినే, ప్రతి ఒక్క సాధువు ఆచరించినదానినే మీరు అనుసరించవలసి ఉంటుంది. ఇక్కడినుండి మేము మిమ్మల్ని పంపించే శాఖాకార్యాలయములకు, క్షేత్రములకు మీరు తేజోవంతులై, ప్రభావశాలురుగా వెళ్ళండి. బుద్ధుని శిష్యులు వెళ్ళిన ప్రతి ప్రదేశములోనూ బౌద్ధధర్మపతాకమును ఎగుర వేయగలిగారంటే అందుకు కారణము వారి వారి విద్య, వాక్కు కాదు; ఇందులో ముఖ్యమైనది వారి వ్యక్తిత్వము మాత్రమే! లోభమోహములనే కుంభకర్ణుడిని ఓడించి పారద్రోలగలిగి నపుడు మీకు మీరు శాంతిని పొందగలగటమేకాదు, ఆత్మ నిర్మాణము, విశ్వనిర్మాణమును కూడా గావించగలరు.

*- అఖండజ్యోతి, ఆగస్టు 2014*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## దైవత్వమా? రాక్షసత్వమా? ఏది కావాలి

*మూర్ఖత మరియు మోహవశులైన వారు రాక్షస వర్గానికి మరియు లోకమంగళకరపనుల సాధనలో నిమగ్నమైన వారు దేవతా వర్గానికి చెందుతారు. రానున్న రోజులలో ఈ రెండు వర్గాలు, తమ తమ వ్యవహార పద్ధతులలో, ఆచరణలలో నికృష్టత-శ్రేష్ఠతల ఎంచుకొనే అవసరం కలుగుతుంది. పైన పేర్కొన్న రెండు విధానాల యొక్క సత్పరిణామాలను మరియు దుష్పరిణామాలు బేరీజు వేసుకొని, వానిని చూసి అవగాహన చేసికొని భావితరం ఏది ఉపయుక్తము, ఏది అనుపయుక్తం అనే దానిని విచారించుకొని దేనిని స్వీకరించాలి, దేనిని తృణీకరించాలి అనే దానిపై ఒక నిర్ణయానికి రావలసి ఉంది.*

*రానున్న రోజులలో పై రెండు వర్గాల్లో ఏదియో ఒకదానితో కలవవలసి ఉంటుంది, అట్లుకాక తటస్థంగా ఉండజాలం. మహాకాలుని మార్గానికి లేక విధానాలకు ఆటంకాలు కలిగిస్తూ విరోధించే మూర్ఖులు తమ పద్ధతులను మార్చుకొని సహకరించినచో ఆనందపారవశ్యాన్ని పొందుతారు. అట్లు కానిచో మహాకాలుని భయంకరమైన దండనను భరించుటకు సంసిద్ధులుగా ఉండవలసి ఉన్నది.*

*- హిందీమూలం: అఖండజ్యోతి, సెప్టెంబర్ 2013*

*అనువాదం: ఎ. శారద*

**పాఠశాల, కళాశాల చదువులతో కుశలత, అధిక ధనార్జన మాత్రమే సాధ్యం**

నా వారితో నా మాట

# ఇది పరివర్తన గురించి చాటి చెప్పే సంవత్సరం



2015 సంవత్సరము యుగ సాహిత్యమును విస్తారముగా వ్యాపించ చేయవలసిన సంవత్సరము గా కార్యకర్తలకు పిలుపు ఇవ్వబడినది. దీనికి సంబంధించిన వివిధ కార్యక్రమములు. 2016 వసంత పంచమి వరకు జరుగుతూనే ఉంటాయి. యుగశక్తి గాయత్రి (అఖండజ్యోతి) పాఠకులు మరియు మన గాయత్రీ పరివార్ సభ్యులు దీని కొరకు మనస్సు పెట్టి పనిచేయవలసి ఉంటుంది. యుగసాహిత్యమును ఇంటి ఇంటికి, ప్రతి ఒక్క వ్యక్తి దగ్గరకు చేర్చటమే కాక ఆ సాహిత్యములోని ఆలోచనలు వారి మనస్సులలోకి చేరే విధముగా ప్రచారము చేపట్టవలసి ఉంటుంది. దీనివలన జనజీవనములో గొప్పమార్పు వస్తుంది.

మన పరిజనులకు అందరికీ తెలుసు. పరమపూజ్య గురుదేవులు యుగద్రష్ట ద్వారా తమ సాహిత్యములో వ్యక్తి, కుటుంబము, సమాజము యొక్క జటిలమైన, కఠినమైన ప్రశ్నలకు, చిక్కులకు అర్థవంతమైన సమాధానములను చెప్పారు. ఎప్పుడు, ఎక్కడ, ఏమిటి మరియు ఎలా అనే ప్రశ్నలకు సమాధానము కేవలము గురుదేవుల యొక్క యుగ సాహిత్యములోనే దొరుకుతుంది. సిక్కులకు గురు గ్రంథ్ సాహెబ్ ఏ విధంగా అమూల్యమైనదో అలా గురుదేవుల సాహిత్యము మనకు అమూల్యమైనది. గురుదేవుల సాహిత్యం ఆయన వ్యక్తిత్వము యొక్క ఆలోచనల స్వరూపము. దీనిలో సమస్త మానవకోటికి సరైన దిశా నిర్దేశం చేయబడినది.

### భోగవాదము యొక్క దుష్పరిణామము

నిరంకుశమైన భోగవాదము, ప్రత్యక్షవాదము వలన ఆధ్యాత్మికత సామాన్యప్రజలకు దూరం అయ్యింది. మనిషి కూడా మిగతా ప్రాణులవలె తన జీవితాన్ని సాగిస్తున్నాడు. జీవితము ఉన్నంతవరకు తిని తిరిగి మజా చెయ్యాలనెడి దానిని లక్ష్యంగా గొని జీవిస్తున్నాడు. తానే మొదలు మరియు తానే అంతం అని అనుకుంటున్నాడు. పరలోకము, పునర్జన్మ, కర్మఫలములాంటి మాటలు ప్రమాణరహితములుగా మారాయి. కర్మఫలమును నమ్మకపోవడం వలన పరలోకము, పునర్జన్మలపై విశ్వాసం లేకపోవడం వలన ఏ పనులైతే చెయ్యకూడదో ఆ పనులు చేస్తున్నాడు. ఇలాంటి పనులు చెయ్యడం వలన వచ్చే పరిణామాల గురించి కించిత్తు అయిన యోచించుట లేదు. ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. ఎవరైతే సమస్త మర్యాదలను తోసిపుచ్చి సుఖాలను అనుభవించ దానికి ఆతృతలో ప్రకృతి ఇచ్చిన, నిర్దేశించిన కనీసమర్యాదలను కూడా లక్ష్య పెట్టడం లేదో వారికి శారీరిక, మానసిక శాంతి దూరమై అశాంతితో జీవిస్తున్నారు.

అధికులు వ్యాధుల కోరలలో చిక్కుకోవడానికి ఈ భోగవాదము ఒక కారణము. శరీరము డొల్లగా మారుతోంది, మానసిక సంతులన కోల్పోతున్నాడు దీనివలన మనుష్యులు చింత వ్యాకులతలలో మునిగిపోతున్నారు. శరీరము దుర్బలమై రుగ్మతలకు బలైపోతున్నది. ఆధునిక వైద్యవిధానము ద్వారా ఇవ్వబడిన చికిత్సావిధానము కూడా రోగములను నివారించుటకు తోడ్పడుట లేదు. కేవలం వివేకవంతమైన జీవనశైలి మాత్రమే జీవితాన్ని చక్కదిద్దగలదు. ఈ జీవనశైలిని యుగఋషి యొక్క యుగసాహిత్యము మాత్రమే అందించగలదు.

### క్షీణించిపోతున్న సమాజపు విలువలు

మనిషి తనువు మనస్సు ఏ స్థితిలో ఉంటాయో సమాజము కూడా ఆ స్థితిలోనే ఉంటుంది. ప్రస్తుతము సమాజము ఏది అనుభవిస్తోందో అది మరింత దుఃఖదాయకమైనది. అపకారము ఒకరకముగా గొప్పకార్యముగా భావిస్తున్నారు. విలువలను పాటించనివారిని కూడా అభినందిస్తున్నారు. ఎందుకంటే దీని నుండి అప్పటికప్పుడు లాభం పొందడంలో వారు సఫలత పొందారు. ఈ ప్రవాహము ప్రాచీన ఋషులు, మునులు, మహామానవులు నిర్మించిన విలువల సౌధాన్ని శక్తిహీనం గావిస్తున్నది.

మంచితనము, మంచి ఆలోచనల ఆచరణ చేసెడి వారికి బాధలు కలుగుతుంటే సామాన్య మానవులు మానవీయ విలువలను ఎలా ఆదరిస్తారు? ఇట్టి పరిస్థితుల వలన

**సామాన్యులు సంపదలకు నిలయాలవుతారు - మహా మానవులు ఆదర్శాలకు నిలయాలవుతారు**

నిరంకుశులు మరియు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించేవారికి భౌతిక లాభాలు చేకూరుతున్నాయి. చతురుడు దీనిని ఉపయోగించు కొని కొంతవరకు లాభాన్వితుడు అవుతున్నాడు. కానీ ఇటువంటి వారి మూలముగా సమాజములో ప్రేమ, విశ్వాసము, సద్భావన, సౌజన్యము, ఆత్మీయభావనలు కనుమరుగై పోతున్నాయి. ఇలాంటిస్థితిలో మంచి విలువలను పాటించ డానికి ఎవరూ సంసిద్ధులుగా ఉండటం లేదు. మనుష్యులను పరస్పరం కలిపి ఉంచే విలువలు, ఆచార వ్యవహారాలు క్రమంగా నశించిపోతున్నాయి.

ఇంటింటా ఈ స్థితి వ్యాపించింది. కుటుంబ విలువలు క్రమంగా క్షీణిస్తున్నాయి. భార్య-భర్త, తండ్రి-కొడుకు, సోదర-సోదర, సోదర-సోదరి మొదలైన పవిత్ర బంధములు లాభ నష్టాల బేరీజులో వాని విలువలను కోల్పోతున్నాయి. ఉపయోగ పడనివారితో, సహాయం చెయ్యలేనివారితో, దుర్బలులతో బంధము నిలుపుకోవటానికి ఎవరు ఇష్టపడటం లేదు. వారి పోషణ భారమును భరించడానికి కూడా ఎవరు సిద్ధముగా ఉండటం లేదు. పిల్లల, వృద్ధుల, రోగగ్రస్తుల, దుర్బలుల, కురూపుల, వికలాంగుల, మందబుద్ధుల, పనిచేయలేని లేదా తక్కువ పనిచేసే వారి యొక్క పోషణ, వారితో సంబంధ బాంధవ్యాలు, స్నేహపూరితవాతావరణము భారంగా మారింది.

## ప్రాధాన్యతను కోల్పోతున్న సామాజిక విలువలు

కంటికి కనిపించే, చెవులకు వినిపించే, ఆలోచనల ఆధారముగా ఏర్పడిన దానిని సమాజము అని పిలుస్తున్నామో అది ఇప్పుడు వికృతరూపము దాల్చి ధ్వంసమైపోతున్నది. మనం చిక్కుల వలలో ఉన్నాము. వినడానికి, చూడటానికి చాలా కనిపిస్తాయి. కొన్ని చాలా ఆకర్షణీయముగా కనిపిస్తాయి కానీ అవి ఏవి మనవి కావు. నిజము ఏమిటంటే అసలు ఏవి ఎవరివి కావు. పనికిమాలిన మర్యాదలు ఇప్పుడు సభ్య సమాజములో చోటు చేసుకున్నాయి. థాంక్యూ, ప్లీజ్, ఓకే, సారీ, నమస్తే, గుడ్ మార్నింగ్, గుడ్‌నైట్ మొదలైన పదాలు అందరినోళ్ళలో నానుతున్నాయి. ఈ మాటలు ఎంత నీరసముగా, ఎంత అసహజముగా ఉంటున్నాయంటే ఈ మాటలన్నీ నిజంగా గుండెలోతుల నుండి రావలసినవి నేడు పెదవుల నుండి జాలువారుతున్నాయి.

వరుసలో నిలబడుట, సమయపాలన, శుభ్రత పాటించడం వంటివి వికసిత సభ్యతకు గుర్తులు. కానీ వీటిని ఎవరు పాటించడానికి సిద్ధంగా లేరు. అంతరంగములో కోపము, అనుమానము, అవిశ్వాసము, ఏకాకితనము ప్రతి వ్యక్తిని చుట్టేస్తున్నాయి. ఎక్కడ తనవారు అంటూ లేరో అక్కడ కష్ట సమయాలలో సహాయం అందించెడివారి కోసం ఆశగా మనిషి ఎదురుచూస్తున్నాడు.

## అందరు అపరాధులే

మంచి ఆలోచనలు కొరవడినందున సమాజములో అపరాధులు పెరిగిపోతున్నారు. చదువుకోనివారు ఏదో ఒక విధముగా పనిచేస్తుంటే చదువుకున్నవారు అతి తెలివితో వివేక హీనంగా పని చేస్తున్నారు. తినేవాటిని, త్రాగేవాటిని కల్తీ చేయడం, తక్కువ తూయడం, కొంత దాచటం, దొంగతనం చేయడంలాంటి పనులు నిమ్నస్థాయి మనుషులు చేస్తారు. ఎక్కువ మంది ఉన్నత స్థాయి వ్యక్తులు ఇలా చేయడం లాభం కంటే అవమానకరంగా భావిస్తారు. వీరు ఒక్కొక్క చేపను వల పన్ని పట్టడం తెలివితక్కువగా భావించి ఎక్కువ లాభాలు పొందడానికి ఎక్కువగా మోసాలు చేస్తున్నారు. ఈ కాలములో మోసము (అపరాధము) ఒక అలవాటుగా మారింది. దీనికి ఎవరు సిగ్గు పడుట లేదు. పైపెచ్చు ఎదుటివారిని మోసం చెయ్యడం తమ తెలివికి నిదర్శనముగా చాటుకుంటున్నారు. మోసం చెయ్యలేని వారిని తెలివి తక్కువవారుగా, పలాయన వాదులుగా, పిరికివారినిగా ముద్రిస్తున్నారు. వీరిని అసమర్థులుగా విమర్శిస్తూ ఉంటారు.

## మంచి మనుషులను గుర్తించడమే నిజమైన మానవత

ఎప్పుడైతే మన దృష్టికోణమును మార్చుకొంటామో అప్పుడు మనఃస్థితులు, ఆచరణలు సంస్కరింపబడి సమాజ గౌరవం పెరుగుతుంది. అప్పుడు సమాజములోని మనుష్యులు కర్తవ్య పరాయనులుగా, మంచిపౌరులుగా, ఆదర్శవాదులుగా, కపటములేనివారుగా మారి మహామానవులుగా ఎదుగుతారు. అప్పుడు సర్వతోముఖ ప్రగతి, సుఖశాంతులుగల సత్యయుగపు వాతావరణము నిర్మించబడుతుంది. చెడు ఆలోచనలతో కూరుకుపోయి ఉన్న వ్యక్తి మాత్రమే అవాంఛనీయ పరిస్థితులను కల్పించగలడు.

ప్రస్తుత సత్యము ఏమిటంటే అందరు గొప్ప వ్యక్తులుగా మారుతున్నారే కానీ మహామానవులుగా ఎదుగుట లేదు.

**శుభ్రమైన, దృఢమైన ఆలోచనలతో సాత్విక భావములు అభివృద్ధి చెందుతాయి**

నిజంగా మంచి మనుషులు అని అనుకునేవారిని వెతకడం కష్టమైపోతున్నది. చూడటానికి అందరు మంచి మనుషులే కానీ ధూర్తులు, దుష్టులు, విలాసవంతులు, అపరాధ ప్రవృత్తి కలవారే ఎక్కువగా ఉన్నారు. కానీ వీరి స్థితి ఎంత దయనీయముగా మారబోతోందో మనం చాలా మందిని ఇప్పటికే ప్రత్యక్షముగా చూసాము మోసం చేసి విలాసాలని అనుభవించి ఇప్పుడు జైలులో గడుపుతున్నారు. వీరు చేసే పనుల మూలముగా లాభమైనా నష్టమైనా వ్యక్తికంటే కుటుంబము, సమాజమే ఎక్కువ అనుభవిస్తున్నది.

**సుఖం ఇచ్చే సాధనాలు చాలా ఉన్నాయి**
**కానీ శాంతి కొరవడింది**

రాచరికాలు సమాప్తమైపోయాయి కానీ రాజకీయవాదుల వలన కులము, మతము పేరిట విశృంఖలత చోటుచేసుకుంది. విజ్ఞానము అనేక భౌతిక లాభాలను ప్రసాదించుటతోపాటు సుఖ సాధనాలను ఇబ్బడిముబ్బడిగా మన ముందు ఉంచింది. మతాలు, ఆశ్రమాలలో కూడా ధర్మవ్యవస్థ అధికముగా విస్తరిస్తున్నది. వారు చెప్తున్నది ఏమిటంటే నిశ్చయముగా కాలనేమి రామనామము గానంచేస్తూ హనుమంతుడు పాలించడానికి స్వర్గమును తయారు చేస్తున్నాడు అని. అందరము భువిపై స్వర్గమును నిర్మించుటలో భాగస్వాములం అవుదాం రండి.

– *అఖండజ్యోతి, మార్చి 2015*
*అనువాదం: శ్రీమతి వినపాముల అరుణ*

## ఔత్సాహిక నిరుద్యోగులకు, గాయత్రీ పరివార్ కార్యకర్తలకు చక్కని అవకాశం

*మిత్రులారా!*

*ఆధ్యాత్మిక పరిజ్ఞానంతోపాటు, ఆర్థిక పరిపుష్టిని పొందుటకు ఒక చక్కని అవకాశం.*

*భూమిపై సత్యయుగ పునరాగమన ప్రక్రియ వేళ్ళూను కొనుచున్నది. ఇప్పటివరకు ప్రేమశక్తి జ్ఞానశక్తి, మానవాళి ఆలోచనలను, నడవడిని ప్రేరేపించి, ప్రగతి పథంలో పయనింపజేశాయి. ఈ యుగంలో సంకల్పశక్తిని ప్రేరణాగా గొని మానవాళిని సత్యయుగం వైపు నడిపించుటకై కల్కి అవతారం మనమధ్య పరమ పూజ్య పండిత శ్రీరామశర్మ రూపంలో తన ముద్రలు వదలి సూక్ష్మ-కారణ శరీరాలతో తన పనిని ప్రారంభించింది. దీని ఛాయలు నేడు భౌతిక జగత్తులో ప్రధానంగా మనదేశంలో మనకు దృగ్గోచరమవు తున్నాయి. ఇదే "స్వచ్ఛభారత్, స్వదేశీ తయారీ, వృత్తి నైపుణ్యాల పెంపుదల, నల్లధనం నియంత్రణల రూపంలో" మనకు అనుభవంలోనికి వచ్చుట ప్రారంభమైంది.*

*పై ప్రక్రియను వేగిరపరచుటకై ప్రజలకు తగిన జ్ఞానాన్ని తగిన జీవన విధానాన్ని, తగిన ఆలోచనల అందించవలసిన బాధ్యత మనందరిపైనా ప్రధానంగా ఔత్సాహికుల/యువతపైన ఉన్నది. ఇది యుగశక్తి గాయత్రి మాస పత్రిక ద్వారా సాధించ గలం. దీనికై "యుగశక్తి గాయత్రి" మాసపత్రిక పాఠకుల సంఖ్యను ఇబ్బడి ముబ్బడిగా పెంచవలసి ఉన్నది. రోజులో ఒక్క 100 మిల్లీలీటర్ల తేనీటికై ఖర్చు చేసెడి డబ్బుతో ఈ "యుగశక్తి గాయత్రి" మాసపత్రికను ఖరీదుచేసి దాని ప్రభావంతో 30 రోజులపాటు ప్రతినెల పాఠకుడు మరియు అతని కుటుంబం, సుఖశాంతులను, ఆనందాన్ని పొందుతూ ప్రగతి మార్గంలో పయనించగలరు.*

*పై బృహత్కార్య సాధనలో నిరుద్యోగ యువత / ఔత్సాహిక గాయత్రీ పరివార్ కార్యకర్తలు భాగస్వాములై పుణ్యంతోపాటు పురుషార్థాలలో మొదటి రెండైన "ధర్మ-అర్థా"లను పొంద వీలున్నది. దీనికై మీరు రోజులో "ఒకటి లేక రెండు" గంటల సమయాన్ని వెచ్చించినచో విజయం మీ స్వంతం. ఆకాశమే హద్దులా ఫలితాల పొందగలరు.*

**వివరాలకు ఈ క్రింది చిరునామాను సంప్రదించండి:**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ – 500 018.
ఫోన్ నెం: 040-23700722, 9949111175

**ఉదాత్తమయిన ఆచరణతో మానసిక శక్తులు వికసిస్తాయి**

యుగ నిర్మాణ చిత్రావళి-1

# పరశురాముని ద్వారా అత్యాచారాల శిరచ్ఛేదన (నిర్మూలన)



ఒకానొక కాలములో ఈ దేశంలో అసుర ప్రవృత్తులు ఒక వరదలా వ్యాపించి, అన్ని రంగాలను కలుషితం చేసింది. దీనిని ఎదిరించి నిలువరించెడి ధైర్యం ఎవ్వరికి లేకున్నది. అన్యాయం మరియు అత్యాచారాలు పెచ్చు మీరిపోతున్న ప్రజలు దీనిని గ్రుడ్లప్పగించి (కంటితో) చూస్తున్నారే గాని, సిగ్గుతో మ్రాన్పడి పోవుచున్నారేగాని ఎదిరించి తమకు జరిగెడి అన్యాయానికి తమలో తామే కుమిలిపోవుట పరిపాటిగా మారింది.

పరశురాముడు ఒక ఋషి కుమారుడు. ఆయన పరాక్రమం మరియు తేజస్సు విశ్వ విఖ్యాతి గాంచాయి. అయినప్పటికీ ఆయన కూడా తన కర్తవ్యాన్ని మరచి సామాన్యునిలా ఉండిపోయాడు. మానవతపై తన కళ్ళెదుట ఆక్రమణ జరుగుతూ ఉంటే చూస్తూ ఉండిపోయాడే కాని, ఆ క్షణంలోనైనా ఎదిరించెడి ధైర్యాన్ని ప్రదర్శించలేదు. ఎంతోమంది గుణవంతులు, నమ్మకస్తులు, సాహసికులు మరియు బలవంతులు ఉన్నప్పటికీ వారు కూడా పరశురామునిలా క్రియాశూన్యులయ్యారు.

ఇట్టి సమయమందు ఒకానొక రోజున సహస్రబాహువు అనుపేరుగల రాక్షసుడు పరశురాముని తండ్రి అయిన జమదగ్ని ఆశ్రమంలో ప్రవేశించాడు. ఆ దుష్టుని దృష్టి పరశురాముని తల్లి రేణుకపై పడింది. ఆమెను అపహరించాలనెడి కోరిక ఆ రాక్షసునిలో కలుగగా, ఆమె భర్త అయిన జమదగ్నిని హత్య చేశాడు. ఈ వార్త పరశురాముని చెవిన పడగానే తన అచేతనకు మిగుల చింతితుడైనాడు. అప్పుడు పరశురామునికి తెలిసి వచ్చింది. తాను మొదటి నుండి, అనాచారాన్ని వ్యతిరేకించి ఎదురొడ్డి సంఘర్షించినచో, నేటి దుస్థితి దాపురించేది కాదుగదా అనెడిది స్పష్టమయింది. తనకు సంభవించిన దుస్థితికి కారణం కూడా తెలిసి వచ్చింది.

పరశురాముడు తన పరశువును (గొడ్డలిని) చేబూని బయలుదేరాడు. యావత్ భూమండల పైనున్న అన్యాయాన్ని, అత్యాచారాలను చేసెడివారి శిరస్సులు ఖండించాడు. ఖండించిన వానిని ధ్వంసం చేశాడు. ఈ విధ్వంసాన్ని ఒక్కసారి కాదు, ఇరువది ఒక్కమార్లు చేసి అనాచారుల శిరస్సులను ఖండించాడు. ఇట్టి వర్ణన పౌరాణిక గాథలలో కనిపిస్తుంది. ఇది ఒక విధంగా అలంకారికమైన వర్ణనయే.

సంస్కృత భాషలో “పరశు” పదానికి ఒక అర్థము లోతైన జ్ఞానాన్ని అందించుట, అట్లే అనాచారుల శిరస్సుల ఖండించుటకు అర్థము అనాచారుల మస్తిష్కములోని వికృతుల తొలగించుట అని. ఆ కాలమందు ప్రజలలో సామాజిక భావన కొరవడింది. అట్లే అందరిలో అలౌకిక స్వార్థం పేరుకు పోయి ఉంది, ప్రజలు తమ సుఖాలకై ఇతరుల హితాన్ని పణంగా పెట్టుటకు అలవాటుపడ్డారు. ఈ రీతిగా అనాచారులు, అత్యాచారులుగా మారారు. అప్పుడు ఈ స్థితిని మార్చుటకై పరశురాముడు ఒక సంకల్పాన్ని తీసికొని, జనుల మస్తిష్కాలను (ఆలోచలను) సంస్కరించుట మార్గంగా ఎంచుకొని దీని కొరకై ఆలోచనలలో కాంతిని నింపెడి కార్యక్రమాన్ని చేపట్టారు.

శిరస్సు ఖండించుట అనెడిది ఒక నీచమైన పని. అన్యాయాన్ని మరియు అమానవీయతల నిలుపుదలకై చేసెడి హింసకు భయపడవలసిన పనిలేదు. ఇది హింసకానేరదు. కాని దీనివలన సంపూర్ణ సఫలత లభించనేరదు. ఋషి పరశురాముడు భగవత్ స్వరూపుడు – ఇట్టి హింసను ఎట్లు చేస్తాడు? యావత్ పృథ్విలోని దుష్టుల శిరస్సుల ఖండించుట సాధ్యము కాని పని. జనుల మస్తిష్కంలో వికృతుల ఛాయను (ఆలోచనలను) తొలగించి పారమార్థిక ఆలోచనల లేక భావనలతో నింపుట ఒక్కటే మార్గం. భగవాన్ పరశురాముడు దీనినే ఆనాడు చేశాడు. ఆయన ఆలోచనలలో పరివర్తన కలిగించెడి ప్రణాళికను అమలుపరచెడి ప్రక్రియ ద్వారా ప్రపంచస్వరూపాన్ని మార్చాడు.

**అన్ని దృష్టికోణాలలో పురుషార్థమే శ్రేష్ఠమైనది**

నేడు కూడా పూర్వము వలె అటువంటి అనాచారాలు తిరిగి తలెత్తుట జరుగుచున్నది. జనుల మనస్సు మరియు మస్తిష్కం తృష్ణ మరియు కోరికలతో, స్వార్థవిద్వేషాలతో నిండాయి. వీనిని నిరోధించుటకు ప్రజలు భయపడుచున్నారు. దీనితో తమంతట తాముగా పాపకర్మల పెంచి పోషించుకొను చున్నారు. ఇట్టి చెడులను నిర్మూలించాలి. జనుల స్వార్థం మరియు వాసనల (కోర్కెల) తొలగించుటకై హింసాత్మక పద్ధతులు ఆశించిన ఫలితాలనందించజాలవు. జనుల ఆలోచనల సరిదిద్దుట ద్వారా మాత్రమే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. దీనికై ఇప్పుడు పరశురాముని మాదిరి తిరిగి జ్ఞానమనెడి పెద్దగొడ్డలితో పనిని ప్రారంభించాలి.

పరశురాముడే రీతిలో గొడ్డలిని (జ్ఞానాన్ని) చేబూని ఆలోచనల సంస్కరించ బయలుదేరాడో అదే రీతిలో సమాజం లోని ప్రతి బుద్ధిశాలి, జనుల మానసంలో తిష్ఠవేసియున్న చెడ్డ ఆలోచనల మరియు వికృతుల ఉన్మూలన గావించుటకై నడుం బిగించి బయలుదేరాలి. పృథ్విపైనున్న ప్రతి ఒక్కరి మానసాన్ని సంస్కరించి, సద్బుద్ధుల నింపేంతవరకు బుద్ధి శాలురు విశ్రమించరాదు.

*హిందీమూలం: యుగనిర్మాణ చిత్రావళి మొదటి భాగము*

*అనువాదం: శ్రీమతి ఎ. శారద*

## సత్ప్రవృత్తుల పెంపు

*నెపోలియన్ తన మిత్రులను వెంట పెట్టుకుని వెళుతూ ఉండగా, ఎదురుగా బరువు నెత్తిన పెట్టుకుని ఒక కూలివాడు రావడం ఆయన కంటపడింది. తక్షణం ఆయన మిత్రులను ప్రక్కకు లాగి, ఆ శ్రమ జీవికి దారి ఇస్తూ, "శ్రమను గౌరవించటం నేర్చుకోండి. రోడ్డంతా ఆక్రమించి విలాసంగా నడవటం కాదు" అని హెచ్చరించాడు. ఏ సత్ప్రవృత్తులను మనం మన రాజ్యంలో వృద్ధి చేయాలను కొంటున్నామో, వాటిని ముందుగా మనం గౌరవించి ఆచరించి తీరాలి. అప్పుడే ప్రజలు వాటిపట్ల శ్రద్ధను, ఉత్సాహాన్ని చూపిస్తారని నెపోలియన్ పదేపదే తోటివారికి గుర్తుచేస్తూ ఉండేవారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

# సంస్మరణ - శ్రద్ధాంజలి



**జననం: 01.04.1971**

**మరణం: 08.03.2015**

**కీ॥శే॥ శ్రీమతి చతుర్వేదుల విశాలాక్షి**

*శ్రీమతి చతుర్వేదుల విశాలాక్షి ఉరఫ్ రమ్య, భర్త భావ నారాయణగారు, ఏప్రిల్ 1వ తేది 1971లో జన్మించారు. వీరి తల్లి శ్రీమతి ఇందుమతిగారు, గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్త–నాగార్జున సాగర్ నివాసి. శ్రీమతి విశాలాక్షి ఉరఫ్ రమ్యగారు సంస్కృతాన్ని పాఠ్యాంశంగా తీసికొని బి.ఇ.డి. కోర్సు పూర్తిచేశారు. వీరి వివాహం 1996లో శ్రీచతుర్వేదుల భావనారాయణగారితో జరిగింది. వివాహానంతరం భర్త ప్రోత్సాహంతో సంస్కృతం ఎమ్.ఎ. కోర్సును అభ్యసించి ఉత్తీర్ణులైనారు. అప్పటి నుండి ఒక ప్రైవేటు కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయినిగా పనిచేస్తుండేవారు. చిన్న నాటి నుండి రమ్యగారికి ఆధ్యాత్మిక చింతన మెండు. దీనితో ఆమె పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని రుచి చూచి, ఆకర్షితులై, గాయత్రీ యజ్ఞాన్ని మరియు సంస్కారాలను, శ్రీమతి నేమాని గౌరీసావిత్రి–మూర్తి దంపతుల ద్వారా నేర్చుకొని, తరువాత స్వతంత్రంగా యజ్ఞాలు సంస్కారాలు చేయుట ప్రారంభించారు. తనువు చాలించే నాటికి దాదాపు 549 యజ్ఞాలు పూర్తిచేశారు. దీనితోపాటు ఆమె సత్సంగాలు చేస్తూ, శ్రోతలలో భావ పరివర్తనల తెచ్చుట లక్ష్యంగా పెట్టుకొని, శ్రోతలలో తిష్టవేచి ఉన్న వ్యసనాలైన మద్యపానం, ధూమపానం, గుట్కా సేవనం, మాంసభక్షణ, జూదం వగైరాల మాన్పించుటలో ప్రశంసా పూర్వకమైన కృషిని చేశారు. శ్రీమతి రమ్యగారు తనువు చాలించినారని తెలియగానే రమ్యగారి సత్సంగాల ద్వారా పరివర్తన చెందిన వ్యసన విముక్తులలో అనేకులు వచ్చి ఆమె సేవలకు కృతజ్ఞతాపూర్వకంగా అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటించుట దీనికి తార్కాణం. గాయత్రీ తీర్థ్, శాంతి కుంజ్ హరిద్వార్‌ను మూడుసార్లు సందర్శించి, గురుయుగ్మ కృపకు పాత్రులైనారు. ఇట్టి సేవానిరతి కలిగిన రమ్యగారు చిన్న వయస్సులో తనువు చాలించుట మిక్కిలి బాధాకరము. శ్రీమతి రమ్యగారి ఆత్మకు శాంతిని కలిగించవలసిందిగా పూజ్య గురు యుగ్మాన్ని "యుగశక్తి గాయత్రి" మరియు గాయత్రీ పరివార్ ప్రార్థించుచున్నది.* ❖❖❖❖❖

**ప్రతి గొప్ప విజయం వెనుక కఠోర శ్రమ దాగి ఉంటుంది**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 11

## మున్నంగి అంజిరెడ్డి, కొత్తపాలెం



మున్నంగి రామస్వామిరెడ్డి, రాఘవమ్మ దంపతులకు, చెరుకూరు పంచాయితి శివారు కొత్తపాలెం గ్రామం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో 1940వ సం॥లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అంజిరెడ్డిగారు ప్రాథమిక విద్యతోనే (5వ తరగతి) విద్యాభ్యాసం పూర్తి చేశారు. చురుకైన విద్యార్థిగా పేరు పొందాడు. బాల్యం నుండి అంజిరెడ్డిగారు సాధు స్వభావం కలిగిన శాంతమనస్కుడు. పూర్వజన్మ సుకృత ప్రభావం కలిగిన వాడగుటచే బాల్యం నుండి రామాయణ, భారతాలు మరియు భగవద్గీతలు చదువుటలో చాలా శ్రద్ధ కనపరచేవాడు. గ్రామములో లేక గ్రామ చుట్టుప్రక్కల ఎక్కడైనా రామాయణ భారత, భాగవత కథలపై కథాశ్రవణం జరుగుతుంటే తప్పక హాజరయ్యేవాడు. చిన్ననాటి నుండి వివేకానందుని జీవిత చరిత్ర, ఆయనను గురించి వ్రాసిన రచనలు వీరిని ఎంతో ప్రభావితం చేశాయి. అలనాటి దేశనాయకుల జీవన విధానం వీరిని ఎంతగానో ఆకర్షించింది.

దీనితో అంజిరెడ్డిగారితో పేదవారిని చూచినప్పుడు, పేదల జీవన విధానాన్ని చూచి చలించిపోయేవారు. వారి బాధల నివారణకై తనవంతు సాయాన్ని అందించాలనెడి తపన తనను శాంతంగా ఉండనిచ్చేది కాదు. అవకాశం లభించినప్పుడల్లా తన ఇంటిలోనున్న తినుబండారాలను, ఆహార ధాన్యాలను, మూడవ కంటికి కనరాకుండా పేదలకు ఉడుతాభక్తిగా అందజేసి వాళ్ళ ఆకలిని తీర్చుటలో తృప్తిని, ఆనందాన్ని పొందేవాడు. అంజిరెడ్డి మేని నల్లనిది కాగా మనస్సు పాలవలె తెల్లనిది.

తాను అవగతం చేసికొన్న రామాయణ, భారత, భాగవతాల జ్ఞానాన్ని పదిమందికి అర్థమయ్యే రీతిలో చెప్పవలయుననెడి తపన ముప్పిరిగొనగా, ఏకలవ్యుడు ద్రోణుని బొమ్మను పెట్టుకొని విలువిద్యను అభ్యసించిన రీతిలో, అంజిరెడ్డి గారు ఒక రాయిని తన ఎదురుగా పెట్టుకొని దానిని ప్రజా సమూహంగా భావించి తన ఇతిహాస గ్రంథాల జ్ఞానాన్ని ప్రవచిస్తూ తన పాండిత్యాన్ని పరీక్షించుకొనెడివాడు. తనకు తెలిసిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పదిమందికి ఈ విధంగా తెలియజేస్తూ సత్సంగాన్ని చేయుట అలవాటు చేసికొన్నాడు. రోజు వ్యవసాయ పనులు పూర్తి చేసికొని, ఇంటికి చేరి రాత్రివేళలలో భోజనానంతరం, తోటి గ్రామస్థులకు రాముని, కృష్ణుని కథలు వినిపించేవాడు. కథాగానాన్ని వింటూ, కథలో లీనమై ఆనందభాష్పాలు రాల్చేవాడు. బొగ్గు నల్లనిది కాని వజ్రంగా మారి దృఢంగా మారుతుంది. అట్లే అంజిరెడ్డిగారి నల్లని శరీరం మృదువైనది కాగా దానిలోని ఆత్మ వజ్ర సంకల్పం గలది. తుమ్మూరి శివరామకృష్ణారెడ్డిగారి నుండి గాయత్రీమంత్ర దీక్షను 2006 ప్రాంతంలో తీసికొనుట జరిగింది. దీనితో పూజ్య గురుదేవులకు మరింత దగ్గరై గాయత్రీని ఉపాసించుట అలవర్చుకున్నాడు. 2011లో గాయత్రీ శక్తిపీఠం కొత్తపాలెంలో నిర్మించుటలో తనవంతు అంశదానాన్ని ఇచ్చి ప్రోత్సహించాడు. నేటికి తనకున్న దానిలో కొంత సంపదను ప్రతి ఏట గాయత్రీ మందిర నిర్వహణకు ఖర్చు చేస్తూ తన వంతు సహకారాన్ని అందిస్తున్న వితరణశీలి. అన్నింటికన్నా మించి, అర్థ సంయమనాన్ని గాయత్రీ మందిర కమిటీ పాటించుటలో సమయానుకూల సూచనలు, సలహాల నిచ్చి ఒక క్రమపద్ధతిలో క్రమానుగతంగా మందిర అభివృద్ధికి తోడ్పాటునందించుచున్న చాణక్యుడు.

## శ్రీమతి భవనం పిచ్చమ్మ, కొత్తపాలెం



శ్రీమతి భవనం పిచ్చమ్మగారు, శ్రీ రామి రెడ్డి పార్వతి దంపతులకు కొత్తపాలెం, చెరుకూరు పంచాయతి శివారు గ్రామం లో 1945వ సం॥లో జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఆ కాలంలో 5వ తరగతి వరకు చదువు కున్నది. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలచి వ్యవసాయ పనులలో వారికి తోడ్పడుతూ ఎదిగింది. యుక్త వయస్సులో తల్లిదండ్రులు వివాహము చేయగా మెట్టినింట అడుగిడి శ్రమైక జీవనం సుఖానికి వారధి

**గెలవాలన్న ప్రతివానిలో ఒక్క విజేత దాగి ఉన్నాడని మరువకండి**

అనెడి పూజ్య గురుదేవుల సాహిత్యానికి నిలువెత్తు ఉదాహరణగా నిలచింది ఈ పరమ సాధ్వీమణి. ఈమె తల్లిదండ్రులు ఆమెకు పిచ్చమ్మ అని నామకరణం చేయుట వెనుక ఏమి ఉద్దేశ్యం దాగి ఉన్నదో తెలియదు కాని, ఆమె శ్రమను "పిచ్చి" పట్టినట్లుగా ప్రేమిస్తుంది. పనిలో నిమగ్నమైతే ఆకలి దప్పుల మరచి పోతుంది. ఏకాగ్రతతో పనిచేస్తుంది. చేతిలోనున్న పని పూర్తియగునంతవరకు దానిని విడచిపెట్టదు. ఇదే "పిచ్చమ్మ" గుణగణాలకు చిరునామా. తన సంతానానికి వివాహం చేసి కుటుంబ బాధ్యతలను పూర్తిచేసింది. తనకు 50 సంవత్సరాల వయస్సులో సాకార శరీరంలోనున్న దేవుడు (భర్త) శాశ్వతంగా దూరం కాగా, మార్గదర్శనం కొరవడింది. దీనితో నిరాకారుడైన దైవం వైపు పిచ్చమ్మగారి దృష్టి మరలింది. పూజ్యగురుదేవుల ప్రాతఃకాల మూడుశరీరాల ధ్యానంలో చెప్పినట్లు తనకు తెలియకుండగనే, మనస్సుకు శాంతి (మన్‌శాంత్), సంస్కారాలు శాంతించుట (వాసనాశాంత్), తీవ్రమైన కోరికల శాంతి (తృష్ణ శాంత్) శాంత శరీరం (శరీర శాంత్) అహంకారం శాంతించుట (అహంకార్‌శాంత్) ఇవి ఆమెలో క్రమక్రమంగా ఎదగసాగాయి. ఇట్టి సమయంలో కొత్తపాలెం గ్రామ ప్రజలకు గాయత్రీ మంత్రము, గాయత్రీ జపం, గాయత్రీ యజ్ఞం పరిచయం చేయబడ్డాయి. 2000 సంవత్సరంలో అందరితోపాటు తాను కూడా గాయత్రీ మంత్రదీక్ష తీసికొని, తనకు చేతనైన రీతిలో దానిని జపించసాగింది. 2006 నాటికి రెండుసార్లు గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌ను సందర్శించింది. ఈవిధంగా తనలోని నిగూఢ ఆత్మ పిలుపు మేరకు గాయత్రీపట్ల పూజ్య గురుయుగ్మం పట్ల మానసికంగా క్రమక్రమంగా ఆకర్షితురాలు కాసాగింది. తోటివారికి పిచ్చమ్మగా కనిపిస్తూ ఆత్మికంగా, మౌనంగా మానసికంగా గురుచేతనత్వానికి దగ్గర కాసాగింది. దీని ఫలితమే కొత్తపాలెంలో 2011లో గాయత్రీమాత విగ్రహ ప్రతిష్ఠ జరిగిన నాటి నుండి పిచ్చమ్మగారు గాయత్రీ మందిరాన్ని తన నివాసంగా మార్చుకొని అహర్నిశలు మందిర సేవకే అంకితమయింది. ఉదయం బ్రహ్మ ముహూర్తవేళ (3.30కే) తదుపరి యజ్ఞంలో పాల్గొని మందిర ప్రాంగణమంతా శుభ్రపరుస్తుంది. అటుపిమ్మట మందిరానికి ఎదురుగా ఉన్న పూలమొక్కలకు, వృక్షాలకు, కూరగాయల చెట్లకు, నీరు, ఎరువును అందిస్తూ, పాదులు చేస్తూ తోటమాలిలా పనిచేస్తుంది. అందరికన్న చివరగా భుజిస్తుంది. రాత్రి 9 గంటల తరువాత విశ్రమిస్తుంది. శారీరిక శ్రమ, మానసిక జపం, ఆమె నిత్య కృత్యాలు. ఈమె జీవితం అక్షరాల అందరికి స్ఫూర్తిదాయకమే.

ఈమెకు ఆ గాయత్రీమాత, పూజ్యగురుయుగ్మం ఆయురారోగ్యాల ప్రసాదించవలసినదిగా యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

---

## ఆచార్య మీసే

*బొంబాయి విశ్వవిద్యాలయంలో పట్టాపుచ్చుకొన్న తర్వాత ఏమి చేయాలా అనే ప్రశ్న 'మీ సే' ను వేధించసాగింది. సాధారణంగా అందరూ చేసుకొనే వివాహం, పిల్లలను కనటం, వారిని పెంచి పోషించటానికి అనేక మార్గాలను చేపట్టి డబ్బు సంపాదించడం ఈయనకు నచ్చలేదు. ఇది చాలా మూర్ఖమైనవిగా ఈయనకు అనిపించింది. ఆచార్య మీసే ఘోకలే ఎడ్యుకేషన్ సొసైటీతో సంపర్కం ఏర్పరుచుకొని, ఆదివాసులు నివసించే ప్రాంతాలలో పనిచేయాలని నిశ్చయించుకొన్నారు. పిల్లలకు చదువు చెప్పే పని ఈయనకు అప్పగించబడింది. కానీ పెద్దవాళ్ళ మానసిక స్థితి పిల్లల కంటే అధ్వాన్నంగా ఉండటం వల్ల ఈయన తనకు అప్పగించబడిన పని, పిల్లలకు చదువు చెబుతూనే, ఒక చోట కూర్చోక, యుగానుకూలమైన ఆలోచనలను, శక్తిసామర్థ్యాలను మహారాష్ట్రంలోని మొత్తం ఆదివాసి ప్రజలకు అందించాలనే సంకల్పం తీసుకొని, తెల్లబట్టలు ధరించిన సన్యాసిగా ఆ ప్రాంతాలన్నీ సాగాడు. ఏ ప్రాంతంలో ఎన్ని దినాలు ఆగవలసిన అవసరం ఉంటే అన్ని దినాలు ఆగుతూ, తరువాత ముందుకు సాగిపోతూ ఈవిధంగా 65 సం॥లు జీవితకాలాన్ని ఆదివాసీ ప్రజల ఉద్ధరణ కోసం వినియోగించారు. వారిలో ఒకడుగా మారి, వారితో ఆత్మీయతను పంచుకొంటూ వారిని ఉద్ధరించటం కోసం వారి భాషను, వారి అలవాట్లను నేర్చుకొని, తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు ఆచార్య మీసే.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

---

**కష్టించి పనిచేసెడి వారినే అదృష్టం వరిస్తుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## చీరాలలో

స్వైన్‌ఫ్లూ అంటువ్యాధి ప్రబలుతున్న తరుణంలో గాయత్రీ పరివార్ చీరాల పట్టణం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ శాఖ సభ్యులు వెంటనే స్పందించి, హోమియో వైద్యులు డా॥ శ్రీనివాస్ మరియు డా॥ తేజస్విల మార్గ దర్శనంలో దాదాపు ఒక లక్ష ఇరువది ఐదువేలమందికి చీరాల మండలంలోని పలు గ్రామాలలో మరియు చీరాల పట్టణంలో ఉచితంగా హోమియో మందును అందజేశారు. దీనిలో గాయత్రీ పరివార్ ప్రముఖులైన శ్రీ డి.వి.ఆర్. మూర్తి, శ్రీమన్నారాయణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## కర్నూలులో

కర్నూలు పట్టణము, ఆంధ్రప్రదేశ్‌లో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము 2015 మార్చి 1వ తేది ఆదివారము జరిగింది. 2015 ఫిబ్రవరి 28వ తేదిన కలశయాత్ర, దీప యజ్ఞము జరిగింది. ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. యజ్ఞం పూర్తి అయిన తదుపరి వరుణుడు కరుణించాడు. చక్కని వర్షము పడి ఆహ్లాదకరంగా వాతావరణం మారింది.

## నెల్లూరు జిల్లాలో

భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షలు యదావిధిగా ఈ సంవత్సరము కూడా శ్రీమతి భువన (లక్ష్మీభవాని) స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ కార్యకర్త సారథ్యంలో నెల్లూరు జిల్లాలో నిర్వహించారు. దీనిలో 50 పాఠశాలల నుండి 5000 మంది విద్యార్థి-విద్యార్థినులు (6 నుండి 9వ తరగతి వరకు) అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

పరీక్షలలో విజేతలైన మండల మరియు జిల్లా స్థాయిలలో మొదటి మూడు స్థానాలను కైవసం చేసికొన్న విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు 5 మార్చి 2015 గురువారం నాడు అచ్యుత సుబ్రమణ్య కళ్యాణ మండపంలో నిర్వహింప బడిన కార్యక్రమంలో అందజేయడమైనది.

దీప ప్రజ్వలనను దక్షిణ భారత గాయత్రీ పరివార్ కన్వీనర్ శ్రీ అశ్విని సుబ్బారావుగారు చేశారు. వీరు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, సంస్కారవంతులైన విద్యార్థుల ద్వారా మాత్రమే దేశం ప్రగతి పథంలో పయనించగలదని దీనిలో తల్లిదండ్రుల బాధ్యత అత్యంత ప్రధానమని తెలిపారు.

డా॥ మోహనరాజుగారు మాట్లాడుతూ, గాయత్రీ మంత్ర విశిష్టతను విశదీకరించారు. శ్రీమతి సురేఖరాణిగారు గాయత్రీ తీర్థ్ శాంతికుంజ్ గురించి వివరించగా, స్థానిక మాజీ శాసన సభ్యులు శ్రీ శ్రీధర్‌కృష్ణారెడ్డి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. గాయత్రీ పరివార్ ప్రముఖులైన శ్రీ మణికుమార్, శ్రీ మారుతీ శ్రీనివాస్ (యోగా), శ్రీ రామచంద్రరావు, శ్రీ రంగయ్య, శ్రీమతి గిరిజగార్లు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనాటి సభ జయప్రదంగా ముగిసింది.


**యుగశక్తి గాయత్రి**

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ.5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**ప్రపంచంలో విద్యకు మించిన నేస్తము అవిద్యకు మించిన శత్రువు లేరు**